PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 106 | విజయవాడ, సోమవారం 17 నవంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 17 November 2025 | Rs

ప్రజాస్వామ్య పునాదులపై ఎస్ఐఆర్ దాడి

12 రాష్ట్రాలు లక్ష్యంగా బిజెపి, ఆర్ఎస్ఎస్ ఉమ్మడి రాజకీయ ప్రాజెక్టు

మహిళలు, దళితులు, ఆదివాసీలపై పెరిగిన దాడులు

సిపిఎం పొలిట్‌బ్యూరో ఆందోళన

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉమ్మడి పోరాటాలకు పిలుపు

తీవ్ర పేదరికాన్ని అరికట్టిన కేరళకు అభినందనలు 7

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాగభూషణం, ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.నాగభూషణం, కె.ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.జ్యోతిబసు ఎన్నిక య్యారు. ఒంగోలులోని కొత్త మార్కెట్ వద్ద జి.సుబ్బారావు నగర్‌లో రెండు రోజులపాటు జరిగిన సంఘం 15వ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. 50 మందితో నూతన కమిటీ, ఆఫీస్ బేరర్లుగా 21 మంది ఎన్నికయ్యారు.

నాగభూషణం ఉమామహేశ్వరరావు జ్యోతిబసు

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌ను సన్మానిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు, ప్రముఖులు

విద్యతోనే సామాజిక, ఆర్థిక అసమానతల తొలగింపు

రాజ్యాంగం ఎల్లప్పుడూ మనుగడ సాగించే జీవపత్రం
సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రతి ఒక్కరూ విద్యను అభ్యసించడం ద్వారానే సామాజిక ఆర్థిక అసమానతలు తొలగించడం సాధ్యమవుతుందని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అభిప్రాయపడ్డారని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. మంగళగిరి సికె కన్వెన్షన్‌లో రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘం 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ కానిస్టిట్యూషన్ 75 ఇయర్స్' అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగం అనేది ఎల్లప్పుడూ ఒకేలా స్థిరంగా, ధృడంగా ఉండిపోకుండా పరిస్థితులకు కాలానుగుణంగా పరిణామం చెందుతూ ఎల్లప్పుడూ మనుగడ సాగించే జీవపత్రంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఆర్టికల్ 368 పొందుపరిచారన్నారు. తద్వారా రాజ్యాంగ సవరణకు అవకాశాన్ని ఏర్పరచడం జరిగిందన్నారు. దేశంలో ప్రతి పౌరునికి ప్రసాదించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రాథమిక హక్కుల వల్లే సాధ్యమన్నారు. ఇందుకు చాయ్‌వాలా అయిన మోడీ దేశ ప్రధాని కాగా, మహారాష్ట్రలో మారుమూల ప్రాంతం నుంచి వచ్చిన తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కాగలిగానని అన్నారు. సామాజిక, ఆర్థిక న్యాయ సాధన కోసం రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలను పొందుపరిచారని, ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే కోర్టులను ఆశ్రయించే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగిస్తూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేసిన ప్రసంగం ప్రతి న్యాయవాదికి కంఠోపాఠం కావాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్ల అంశంపై రాజ్యాంగానికి మొదటి సవరణ చేశారన్నారు. రిజర్వేషన్ల విషయంలో క్రీమిలేయర్ అమలు చేయాలని తాను వర్గీకరణ కేసులో చెప్పానని, ఇది కొందరికి నచ్చలేదని, అయినప్పటికీ తాను అందుకు కట్టుబడి ఉన్నానన్నారు. కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మౌలిక స్వరూపం అనే భావనను తీసుకొచ్చిందన్నారు. రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని సవరించరాదని సుప్రీంకోర్టు తీర్పునిచ్చిందన్నారు. ప్రతిపౌరుడిని దృష్టిలో ఉంచుకుని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లకుండా సామాజిక, ఆర్థిక సమస్యలను మిగతా 2లో

అమెరికాలో ఒకరికి బర్డ్‌ఫ్లూ

- వాషింగ్టన్‌లో కేసు నమోదు

వాషింగ్టన్ : అమెరికాలో బర్డ్‌ఫ్లూ కలకలం సృష్టిస్తోంది. వాషింగ్టన్ రాష్ట్రంలో ఒక వ్యక్తికి బర్డ్‌ఫ్లూ వైరస్‌లో నూతన వేరియంట్ సోకినట్లుగా గుర్తించారు. గురువారం ప్రాథమిక పరీక్షల్లో హెచ్5ఎన్5ను గుర్తించగా, శుక్రవారం ధ్రువీకరించారు. ఫిబ్రవరి తరువాత అమెరికాలో ఇది తొలి బర్డ్‌ఫ్లూ కేసు. తాజాగా గుర్తించిన ఇన్ఫెక్షన్ మునుపటి ఇన్ఫెక్షన్ల కన్నా భిన్నంగా ఉందని వైద్య అధికారులు తెలిపారు. బర్డ్‌ఫ్లూ సోకిన వ్యక్తి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ బర్డ్‌ఫ్లూ కేసుతో అమెరికాలో ప్రజారోగ్యానికి ప్రమాదం పెరిగిందని ఆ దేశ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం కనుగొన్న హెచ్5ఎన్5, గతంలో వున్న హెచ్5ఎన్1 వైరస్‌ల మధ్య వ్యత్యాసం ఉందని వెల్లడించింది. వైరస్‌ను విడుదల చేయడంలోనూ, ఇతర కణాలకు వ్యాప్తి చెందడాన్ని ప్రోత్సహించడంలోనూ ఇది మరింత చురుగ్గా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ సోకిన వ్యక్తిని గ్రేస్ హార్బర్ కౌంటీ నివాసి అయిన వృద్ధుడుగా గుర్తించారు. ఇతని ఇంటి వెనుక పెంపుడు జంతువుల శాల ఉంది. ఇందులో అడవి పక్షులను పెంచుతు న్నారు. అమెరికాలో 2024, ఈ ఏడాది ప్రారంభంలో సంభవించిన బర్డ్‌ఫ్లూ వ్యాప్తిలో 70 మందికి ఈ వైరస్‌ను గుర్తించారు. వీరిలో ఎక్కువ మంది పాడి, పౌల్ట్రీ పరిశ్రమల్లో పనిచేశారు. వీరిలో ఒక వ్యక్తి మృతి చెందగా, మిగిలినవారు తేలికపాటి అనారోగ్యాలతో బాధపడ్డారు.

రాష్ట్రంలో ఎస్ఐఆర్ నిలిపివేయాలి

- ఓటు హక్కు నిరాకరించొద్దు
- రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిలిపివేయాలని సిపిఎం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎటువంటి నోటిఫికేషన్ జారీ చేయకుండానే పోలింగ్ బూత్‌స్థాయి వరకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేపట్టడం చట్టవిరుద్ధమైందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో ఇంకా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రక్రియను రాష్ట్రంలో అమలు చేయడానికి పూనుకోవడం పట్ల సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. కీలకమైన ఈ అంశంపై వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని అన్ని పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సిఇఒ)ని కలిసి వినతిపత్రం అందించాలని, విడివిడిగా కూడా లేఖలు రాయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ అమలు చేయడానికి వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్రకమిటీ ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ రెండోదశలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆంధ్రప్రదేశ్‌ను ప్రకటించలేదన్నారు. అయినా రాష్ట్రంలో అమలు చేసేందుకు సిఇఒ సన్నాహాలు చేపట్టడం చట్టవిరుద్ధమని, సిఇఒకు ఉన్న ఆసక్తి ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ అమలు ఇప్పుడేమీ ఉండదని ఇటీవల నిర్వహించిన సమావేశంలో సిఇఒ వెల్లడించారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలతోపాటు అధికార పార్టీ టిడిపి ఎస్ఐఆర్‌పై కొన్ని అభ్యంతరాలు తెలిపిందన్నారు. బిజెపి మినహా అన్ని పార్టీలు వ్యతిరేకిస్తున్న దీనిపై ఎన్నికల సంఘం అఖిలపక్షం ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ అమలు పేరుతో బీహార్‌లో సుమారు 65 లక్షల మంది ఓటర్లను తొలగించారని తెలిపారు. తొలగించిన సుమారు 75 నియోజకవర్గాల్లో అక్కడ ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో ఓటమి చెందాయని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలను దెబ్బకొట్టేందుకు ఎంపిక చేసిన నియోజకవర్గాల్లో ఓట్లు తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రపూరితంగా కేంద్రప్రభుత్వం ఎస్ఐఆర్‌ను ఒక సాధనంగా ఉపయోగించుకుంటోందని పేర్కొన్నారు. దీనిని ఎదుర్కోవాలని కోరారు. రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాల్సిన ఎన్నికల కమిషన్ మోడీ ప్రభుత్వం చెబుతున్నట్లు నడుచుకుంటుందని విమర్శించారు. పాకిస్తాన్‌లో మిలటరీ చెప్పినట్లుగా ఎన్నికల కమిషన్ నడుస్తుందన్నారు. ఇదే విధానాన్ని దేశంలో కూడా అమలు చేసి దేశాన్ని పాకిస్తాన్‌లా మార్చాలని ఆర్ఎస్ఎస్ - బిజెపి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. మాజీ మంత్రి, వైసిపి నేత ఎస్ శైలజానాథ్ మాట్లాడుతూ.. సిఇఒ ఎస్ఐఆర్ విషయంలో అత్యుత్సాహం చూపిస్తోందని, ఎస్ఐఆర్ ప్రకటన రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ఓట్ల తొలగింపు వంటి అనైతిక అంశాలు చేసి బీహార్‌లో ఎన్నికలు నిర్వహించారని చెప్పారు. రాష్ట్రంలో కూడా వివి ప్యాట్లను వారంలోపే దగ్ధం చేశారని తెలిపారు. అందరూ సమానమైన హక్కు కలిగి ఉన్నారనే తెలిపేది ఓటు అని చెప్పారు. దీనిని మిగతా 2లో

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

కార్మికులపై సిఎం వ్యాఖ్యలకు ఖండన

విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులను బెదిరిస్తూ పిడి యాక్ట్‌తో అణచివేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను సమావేశం తీవ్రంగా ఖండించింది. బహిరంగంగా కార్మికులను హెచ్చరించడం తీవ్రమైన అంశమని పేర్కొంది. పిడి యాక్ట్ పెడితే ఆయన ఇంటికి పోతామని, కేసులకు కూడా వెనకాడబోమని తెలిపింది. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది.

కొనసాగుతున్న అల్పపీడనం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని, ఇది పశ్చిమ, వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని తెలిపింది. వీటి ప్రభావంతో నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం నెలకొంటుందని తెలిపింది. మరోవైపు రాష్ట్రంలో రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి చేరుకోవడంతో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలు రాత్రి వేళల్లో నమోదవుతున్నాయని, దీంతో చలితీవ్రత అధికంగా ఉందని తెలిపింది. అరకులో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ఇతర ప్రాంతాల్లోనూ రాత్రి వేళ్లలో చలి పెరుగుతోందని పేర్కొన్నారు.

జల విషాదాలు

వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి, ఒకరు గల్లంతు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో ఆదివారం జలవిషాదాలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. వీరిలో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. ఒక డాక్టర్ గల్లంతయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... తిరుపతి నగరంలోని తాతయ్యగుంటకు చెందిన శివ (35), నరేష్ (36), శేఖర్ కలిసి ఈత కొట్టేందుకు మల్లెమడుగు రిజర్వాయర్ వద్దకు వెళ్లారు. మొదట శివ నీటిలోకి దిగారు. లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోతుండగా ఆయనను కాపాడేందుకు నరేష్ కూడా నీటిలోకి దూకి ఈత రాక మునిగిపోయారు. శేఖర్ సమాచారం మేరకు రేణిగుంట పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి మృతదేహాలనూ వెలికి తీశారు. శివకు భార్య, ఇద్దరు పిల్లలు, నరేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిద్దరూ డ్రైవింగ్ పనులు, కూలి పనులు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం పందిగుంట గ్రామ శివారులోని పేడల వెంకటరమణకు చెందిన పొలంలో ఉపాధి హామీ చట్టం పనుల్లో భాగంగా ఇటీవల నీటి కుంట తవ్వారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఐదుగురు చిన్నారులు పొలం వద్దకు వెళ్లి సరదాగా ఆడుకున్నారు. అందులో ముగ్గురు అమ్మాయిలు పక్క పొలంలో ఉన్న గోరింటాకు ఏరుతుండగా సుధీర్ (9), అవినాష్ (9) నీటి కుంటలో స్నానానికి దిగారు. పలుమార్లు పైకి వచ్చి మళ్లీ కుంటలో దూకారు. అలా దూకిన క్రమంలో కాళ్లు బురదలో కూరుకుపోయి మునిగిపోయారు. ఎప్పటికీ బయటకు రాకపోవడంతో స్థానికులు కుంటలో గాలించాలి. ఇద్దరు పిల్లల మృతదేహాలు లభించాయి. వీరిద్దరూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నారు.

అనంతపురం జిల్లా బెళుగుప్ప ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్న కార్తీక్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మకూరు మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దర్శనార్థం వెళ్లారు. దర్శనం అనంతరం వనభోజనాలు చేశారు. చేతులు కడుక్కునేందుకు హంద్రీనీవా కాలువ వద్దకు వెళ్లిన కార్తీక్ ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోయారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయారు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో ఆయన కోసం కాలువలో గాలిస్తున్నారు.

మృతి చెందిన చిన్నారులు సుధీర్, అవినాష్

రిజర్వాయర్‌లో మునిగి మృతి చెందిన యువకులు

గల్లంతైన డాక్టర్ కార్తీక్ (ఫైల్)

ముఖ్యమంత్రి కార్మికులను బెదిరించడం తగదు

- సిపిఎం రాష్ట్రకమిటీ ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మికులపై పిడి యాక్టు ఉపయోగిస్తామంటూ విశాఖ ఉక్కు కార్మికులను బెదిరించే ధోరణితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన వాఖ్యలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. అవాస్తవాలు, అర్ధ సత్యాలతో ప్రజలను తప్పుదారి పట్టించడం ముఖ్యమంత్రికి తగదని ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల వేతనాలకు ఉత్పత్తితో ముడిపెడుతూ ఉక్కు యాజమాన్యం తాజాగా సర్క్యులర్ జారీ చేయడం మరింత అనిశ్చితికి గురిచేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు, గనులు లేకపోవడం, ఇతర పాలనాపరమైన కారణాలవల్ల నష్టాలు వస్తుంటే అందుకు నెపం కార్మికులపై నెట్టడం దారుణమని తెలిపారు. దేశదేశాలు తిరిగి పారిశ్రామికవేత్తలకు వేలకోట్ల రూపాయల రాయితీలిస్తామని ఎర్రతివాచీ పరిచిన ముఖ్యమంత్రి రేయింబవళ్ళు శ్రమచేసే కార్మికులను పిడి యాక్టు పెట్టి జైళ్లల్లో వేస్తామనడం ఈ ప్రభుత్వం ఎవరి పక్షమో స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. దేశంలోని అన్ని ఉక్కు ఫ్యాక్టరీలకు సొంత గనులుండగా విశాఖ ఉక్కుకు మాత్రం కేటాయించడం లేదని వెల్లడించారు. ఇంకా నిర్మాణం కూడా మొదలు పెట్టని మిట్టల్ స్టీల్‌కు సొంత గనులు కేటాయించిన పాలకులు పబ్లిక్ రంగ ఉక్కు ఫ్యాక్టరీకి మాత్రం మొండిచేయి చూపారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండగా విశాఖ ఉక్కు కార్మికుల ఉద్యమానికి టిడిపి మద్దతుగా నిలిచిందని, ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు నిరాహారదీక్ష కూడా చేపట్టారని వివరించారు. మరి ఇంతలోనే కార్మికులు పనిచేయకుండా తెల్ల ఏనుగును చేసేశారని సిఎం అంతటివారు అనడం తగునా? అని ప్రశ్నించారు. ఉక్కు ఫ్యాక్టరీ రక్షణ కోసం కార్మికులు పోరాడుతుంటే వారికి మద్దతు ఇవ్వకపోగా నిందించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.. వారి ఓట్లతోనే రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీ ఓట్లు సాధించారన్న విషయం మరచిపోతున్నారని తెలిపారు. తమకు వేతనాలు చెల్లించాలనో, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర చట్టబద్ధమైన హక్కులపై ఉద్యమాలు నిర్వహించడం కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కు అని వివరించారు. కానీ "పిడి యాక్ట్ పెట్టి లోపల వేస్తాం" అని ముఖ్యమంత్రి బెదిరించడం గర్హనీయమని పేర్కొన్నారు. అలాగే మిగతా 2లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

స్నిపర్ టీం కమాండర్ మద్వి దేవాతో సహా ముగ్గురు మావోయిస్టులు మృతి

చర్ల : ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. సుక్మా జిల్లాలోని భేజ్జి, చింతగుఫా పోలీస్ స్టేషన్ల సరిహద్దులో ఉన్న తుమ్మలపాడ్ అడవిలో జరిగిన తాజా ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. స్నిపర్ టీం కమాండర్ మద్విదేవా కూడా వీరిలో ఉన్నారు.. ఈ వివరాలను సుక్మా ఎస్‌పి కిరణ్ చవాన్ ప్రకటించారు. సంఘటనా స్థలం నుండి ఆయుధాలు, మందుగుండు సామగ్రి, కొన్ని పత్రాలు, 303 రైఫిల్ బిజిఎల్ లాంచర్, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తుమ్మలపాడ్‌లోని దట్టమైన అడవి కొండ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందిన తర్వాత డిఆర్‌జి బృందం సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించిందని ఎస్‌పి వెల్లడించారు. ఆదివారం ఉదయం ప్రారంభమైన ఈ ఆపరేషన్‌ను గుర్తించిన మావోయిస్టులు కాల్పులకు దిగారని, దీంతో సిబ్బంది ఎదురు కాల్పులు ప్రారంభించారని చెప్పారు.. సంఘటనా స్థలం నుండి స్వాధీనం చేసుకున్న పత్రాలు, ప్రాథమిక గుర్తింపు ఆధారంగా చనిపోయిన ముగ్గుర్ని మావోయిస్టులుగా గుర్తించిన్నట్లు చెప్పారు. స్నిపర్ టీమ్ కమాండర్ మాద్వి దేవాపై ఐదు లక్షల రూపాయల రివార్డు ఉంది. సిఎన్ఎం కమాండర్ పోడియం గంగి రూ.5 లక్షలు, సుక్మా జిల్లా పెద్దపాడు నివాసి. రూ.5 లక్షల రివార్డుతో ఏరియా కమిటీ సభ్యురాలు సోడి గంగి, సుక్మా జిల్లా కిష్టారాం పోలీస్ స్టేషన్‌లోని వర్మగుండ నివాసిగా పోలీసులు గుర్తించారు. బస్తర్ రేంజ్ ఐజిపి సుందర్‌రాజ్ పట్టిలింగం మాట్లాడుతూ... "బస్తర్‌లో మావోయిజం తుది శ్వాస విడిచింది. ఆ సంస్థ నిర్మాణం విచ్ఛిన్నమైంది. క్రియాశీల మావోయిస్టులందరూ హింసను విడిచిపెట్టి, ప్రభుత్వ లొంగుబాటు పునరావాస విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి ' అని తెలిపారు. భద్రతా దళాల ఉమ్మడి కార్యకలాపాల ఫలితంగా ఈ ఏడాదిలో ఇప్పటివరకూ వివిధ ఎన్‌కౌంటర్లలో మొత్తం 233 మంది మావోయిస్టులు మృతి చెందారని చెప్పారు. డిఆర్‌జి, బస్తర్ ఫైటర్స్, సిఆర్‌పిఎఫ్, ఇతర దళాలు ఈ ప్రాంతంలో విస్తృతమైన సోదాలు కొనసాగిస్తున్నాయని ఆయన తెలిపారు.

అప్పుల బాధతో రైతు, కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో అప్పులు ఇద్దరి ఉసురుతీశాయి. ఓర్వకల్లు మండలంలో కౌలురైతు, హాలహర్విలో రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఓర్వకల్లు మండలం నన్నూరులో కళ్లెం బాలరాజు (35) తనకున్న ఎకరాపొలంతో పాటు కొంత భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఇందుకోసం దాదాపుగా రూ.ఆరు లక్షలు అప్పులు చేశారు. అప్పులు తీర్చుకోలేక ఆదివారం ఇంట్లో ఎవరులేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. హాలహర్వి మండలం సిద్దాపురం గ్రామానికి చెందిన రైతు తిమ్మప్ప (45) రెండున్నర ఎకరాల పొలం కౌలుకు తీసుకొని మిరప, మొక్కజొన్న సాగు చేశారు. సాగు కోసం ఆయన ఐదు లక్షలకు పైగా అప్పులు చేశారు. గతేడాది మిరప నష్టం రావడం, ఈ ఏడాది కూడా దిగుబడి ఆశాజనకంగా లేకపోవడం, రుణదాతలు ఒత్తిడి ఎక్కువవడంతో మనస్తాపం చెందారు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన బళ్లారి ఆస్పత్రికి తరలించారు. ఆదివారం తెల్లవారు జామున పరిస్థితి విషమించి తిమ్మప్ప మృతి చెందారు. ఆయనకు భార్య ఈరమ్మ, నలుగురు కుమారులు ఉన్నారు. తిమ్మప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా, మండల రైతుసంఘం నాయకులు పి హనుమంతు, ఈరన్న కోరారు.

కొల్లేరుపై ఆంక్షల కత్తి!

- అన్‌సర్వే భూముల్లో రబీలో వరి సాగుపై నిర్బంధం
- అటవీ శాఖ అధికారుల వేధింపులపై అన్నదాతల ఆందోళన బాట

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

కొల్లేరు రైతుల పట్ల ప్రభుత్వం చెబుతున్న మాటలకు... క్షేత్రస్థాయి పరిస్థితికి సంబంధం లేకుండా ఉంది. కొల్లేరును ఆనుకుని ఉన్న గ్రామాల్లోని అన్‌సర్వే భూముల్లో వందల ఏళ్ల నుంచి రబీలో వరి సాగు చేస్తున్న భూముల్లోకి వెళ్లొద్దంటూ అటవీ శాఖాధికారులు ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది ఆంక్షలు విధించడంతో దీనికి వ్యతిరేకంగా రైతులు రోడ్డెక్కారు. గత గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు. ఉంగుటూరు, దెందులూరు, కైకలూరు, ఉండి నియోజకవర్గాల్లో కొల్లేరు విస్తరించి ఉంది. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో 43,724 ఎకరాల్లోని 1,776 చేపల చెరువులను బాంబులు పెట్టి అప్పటి ప్రభుత్వం ధ్వంసం చేసింది. అప్పటి నుంచి కొల్లేరును ఆనుకుని ఉన్న 120 గ్రామాల ప్రజలు ఉపాధిలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని కొల్లేరును ఆనుకుని ఉన్న అడవికొలను, పెదనింద్రకొలను, తోకపల్లి, బైనేపల్లితోపాటు పలు గ్రామాల్లో చేపల చెరువుల వంటివి తవ్వకాలు చేయకుండా మూడు వేలకు పైగా ఎకరాల్లో వందల ఏళ్ల నుంచి వరి సాగు మాత్రమే చేస్తున్నారు. కొల్లేరును ఆనుకుని ఉన్న అన్‌సర్వే భూముల్లో రబీ పంట మాత్రమే పండుతుంది. కొల్లేరు పల్లపు ప్రాంతం కావడంతో ఖరీఫ్‌లో సాగు సాధ్యం కాదు. కొల్లేరును ఆనుకుని ఉన్న భూములన్నీ సన్న, చిన్నకారు రైతులవే. గ్రామాల్లోని వందల కుటుంబాలకు ఆ భూములే ఆధారం. రబీ సాగుకు సన్నద్ధం అవుతున్న తరుణంలో రైతులపై అటవీ శాఖ అధికారుల నిర్బంధం పెరిగింది. గతంలో ఎన్నడూలేని విధంగా అన్‌సర్వే భూముల్లోకి రైతులు వెళ్లకూడదంటూ ఆంక్షలు విధించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కొల్లేరులో సంప్రదాయబద్ధంగా వ్యవసాయం చేసుకోవచ్చని కోర్టులు సైతం చెప్పాయి. దీనికి విరుద్ధంగా అటవీ శాఖాధికారులు వ్యవహరిస్తున్నారని కొల్లేరు రైతులు ఆగ్రహం మిగతా 2లో

ఈ భూములే మాకు ఆధారం

కొల్లేరును అనుకుని మా కుటుంబానికి ఆరెకరాల భూమి ఉంది. ఈ భూమే మా కుటుంబానికి ఆధారం. అటవీ శాఖాధికారులు నిర్బంధం విధించడం అన్యాయం. పర్యావరణానికి ఇబ్బంది లేకుండా వరి సాగు చేసుకుంటున్నాం. ప్రభుత్వం వెంటనే కొల్లేరు రైతుల సమస్యలు పరిష్కరించాలి.

పమ్మి గోవింద్, అడవికొలను

ఆంక్షలు అన్యాయం

మా కుటుంబానికి కొల్లేరును ఆనుకుని అన్‌సర్వే భూమి ఎకరా ఉంది. రబీలో 40 బస్తాలకుపైగా పండుతుంది. ఇదే మా కుటుంబానికి ఆధారం. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి ఆ భూముల్లోకి వెళ్లొదంటూ అటవీ శాఖాధికారులు అడ్డుకుంటుండడం అన్యాయం. వరి సాగుతో ఇబ్బంది ఏమిటో అర్థం కావడం లేదు.

కొప్పల శ్రీనివాసరావు, పెదనింద్రకొలను

ఎన్నికల సంస్కరణలు అవశ్యం

- సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ఎన్నికల సంస్కరణలు అవశ్యమని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా తెలిపారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం పాత్ర ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన చర్యల వల్ల ఓటర్లు ఇబ్బందులపాలయ్యారని తెలిపారు. తల్లిదండ్రుల పుట్టిన తేదీ, ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలంటూ ఆంక్షలు విధించడంతో అధిక సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కును కోల్పోయారన్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమిని నిరాశ పరిచాయన్నారు. ఈ ఫలితాలపై ఆత్మ పరిశీలన చేసుకోవాల్సి ఉందని తెలిపారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎన్నడూ పాల్గొనని ఆర్‌ఎస్‌ఎస్ తపాలా బిళ్లను, ఆ సంస్థ శతవార్షికోత్సవం సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విడుదల చేయడాన్ని తప్పుబట్టారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు రిజిస్ట్రేషన్ కూడా లేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ దేశ రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని గౌరవించిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న సౌభ్రాతృత్వం, సమానత్వం, ఐక్యత వంటి ప్రాథమిక సూత్రాలను ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నడూ అంగీకరించలేదని ఈ సందర్భంగా రాజా గుర్తు చేశారు. దేశంలో మతోన్మాద పార్టీలు, కార్పొరేట్ శక్తుల మధ్య సంబంధాలు బలంగా ఏర్పడ్డాయని, విశాఖ ఉక్కు కర్మాగారంతో సహా ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ, ప్రజాస్వామ్య రక్షణకు లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కె జయరాజ్ అధ్యక్షత వహించగా, ఎపియుడబ్ల్యుజె నాయకులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ఐజెయు నాయకులు షేక్ బాబు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ అసోసియేషన్ ఎన్నిక జరిగింది. విజయవాడలోని ఎపిఎన్‌జిఒ కార్యాలయంలో ఆదివారం ఈ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డి గోపాల్ రెడ్డి, పిబి సాల్మాన్ రాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె అప్పారావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్‌ఎ సికిందర్, జాయింట్ సెక్రటరీగా కె సుబ్రహ్మణ్యం, మహిళా కార్యదర్శి ఎస్ శాంతి రాజేశ్వరి ఎన్నికయ్యారు.

వీధి కుక్కల బెడద తగ్గించడంపై దృష్టి

- పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడదను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, 2023 జంతు జనన నిబంధనల ప్రకారం కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వడంపై మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుక్కకాటు ప్రమాదాలు, కుక్కలను తగ్గించడానికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 పట్టణాల్లో సుమారు 5.15 లక్షల కుక్కలున్నట్లు అంచనా వేశామన్నారు. 2024 జూన్ ఒకటి నాటికి 2,24,732, అనంతరం మరో 1,36,656 కుక్కలకు స్టెరిలైజేషన్ చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో 197 మంది శిక్షణ పొందిన హ్యాండ్లర్, డాగ్ క్యాచర్లను నియామించినట్లు పేర్కొన్నారు. రాబీస్ సోకిన కుక్కలను వెంటనే గుర్తించి ప్రత్యేక షెల్టర్లకు తరలించాలని సూచించారు. రాష్ట్ర, పట్టణ స్థాయిలో జంతు జనన నియంత్రణ కమిటీలు నియామకం చేపట్టాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, బస్సు, రైల్వే స్టేషన్లు, క్రీడా ప్రాంగణాల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

కొల్లేరుపై ఆంక్షల కత్తి!

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తం చేస్తున్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ కొల్లేరు ప్రజలు 2006 నుంచి పోరాడుతున్నారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో రెండుసార్లు తీర్మానించినా అమలుకు నోచుకోలేదు. గత జూన్ 17, 18 తేదీల్లో కేంద్ర సాధికారిక కమిటీ కొల్లేరు ప్రాంతంలో పర్యటించింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అక్కడి ప్రజలు పెద్ద సంఖ్యలో వినతులు ఇచ్చారు. ఎంఎల్‌ఎలు సైతం కమిటీ సభ్యులకు కొల్లేరు ప్రాంత రైతుల, ప్రజల సమస్యలను వివరించారు. వారికి ఎటువంటి ఇబ్బందీ లేకుండా చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. రబీ సాగుకు నారుమడులు వేసుకునే సమయం దగ్గరపడుతున్నా ప్రభుత్వంలో స్పందన లేకపోవడం, అటవీ శాఖాధికారుల ఆంక్షలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.

ప్రైవేటీకరణ, వర్క్ అవుట్ సోర్సింగ్‌ను అడ్డుకునేందుకు

కార్మిక వర్గం ఏకతాటిపైకి రావాలి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర మహాసభలో పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి- ఒంగోలు సిటీ

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేస్తోన్న ప్రైవేటీకరణ, వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాలను అడ్డుకునేందుకు కార్మిక వర్గం ఏకతాటిపైకి వచ్చి రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని ముమ్మరం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) 15వ రాష్ట్ర మహాసభ తీర్మానించింది. రెండు రోజులపాటు ఒంగోలులో జరిగిన ఈ మహాసభలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం పొందాయి. వీటిని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావుతోపాటు పలువురు నాయకులు ప్రవేశపెట్టారు. ప్రైవేటీకరణ-వర్క్ అవుట్ సోర్సింగ్ రద్దు చేయాలని, పి-4 పేరుతో రాష్ట్రంలో సర్వం ప్రైవేటీకరించాలనే ప్రయత్నాలను విడనాలని, నెల్లూరు-ఏలూరు వంటి పట్టణాల్లో వర్క్ అవుట్ సోర్సింగ్ ప్రయోగాలను, కార్మిక వర్గాన్ని బలహీనపరచే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మహాసభ డిమాండ్ చేసింది. 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించి ఐఆర్ చెల్లించాలని, పెరుగుతున్న ధరల దృష్ట్యా మధ్యంతర భృతి (ఐఆర్) తక్షణమే ఇవ్వాలని తీర్మానించింది. పిఆర్‌సి అమలు తర్వాత అవుట్ సోర్సింగ్-కాంట్రాక్ట్ కార్మికులకు కూడా స్కిల్ కేటగిరీల ప్రకారం సమాన వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ఆమోదించింది. 2001 నుండి నిలిచిపోయిన లేబర్ తనిఖీలను వెంటనే పునరుద్ధరించాలని, 2016లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 27ను రద్దు చేయాలని తీర్మానించింది. కార్మిక సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకుంటోన్న ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేసింది. హక్కుల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చింది. మహాసభలో ముఖ్యఅతిథి, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తున్నాయని, దీనివల్ల ఉద్యోగ భద్రత లేకుండాపోతోందని, కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని వివరించారు. దోపిడీ పాలకులను గద్దె దించడం కార్మికుల ఐక్యఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా మున్సిపల్ కార్మికులు సమరశీల ఉద్యమాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. 2025 డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభను మున్సిపల్ కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి, ఎపి మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు, ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం, కెవిపిఎస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి కల్పన, బి రఘురామ్ సౌహార్ద్ర సందేశం ఇచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం, ఉపాధ్యక్షులు టి నూకరాజు, కె సామ్రాజ్యం, ధనాల వెంకటరావు, టి వజ్రమ్మ, టి తిరుపతమ్మ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు.

హాస్టల్ విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి - కొయ్యూరు (అల్లూరి జిల్లా)

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరోచనాలు, జ్వరంతో 18 మంది ఆస్పత్రుల పాలయ్యారు. వారిలో 16 మంది రాజేంద్రపాలెం పిహెచ్‌సిలోనూ, ఇద్దరు విశాఖలోని కెజిహెచ్‌లోనూ చికిత్స పొందుతున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకూ ఒక్కొక్క విద్యార్థి అస్వస్థతకు గురవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విషయం తెలిసి ఎటిడబ్ల్యు క్రాంతి కుమార్ రాజేంద్రపాలెం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ ఆస్పత్రిలో తక్కువ బెడ్స్ ఉండడంతో ఒక్కో దానిపై ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు చికిత్స పొందుతూ కనిపించారు.

అపారిశుధ్యమా ? కలుషిత ఆహారమా ?

విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి ఆశ్రమ పాఠశాల వద్ద నెలకొన్న అపారిశుధ్య వాతావరణమే కారణమని పలువురు చెబుతున్నారు. తాగునీరు కూడా ఇక్కడ అందడంలేదని అంటున్నారు. ఇటీవల ఓ విద్యార్థి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులు కేకు తిన్నారని, పాడైపోయిన కేకు తిని ఉండొచ్చని హాస్టల్ సిబ్బంది చెబుతున్నారు. విద్యార్థులు రోజువారీ ఆహారంలోనూ తేడా జరిగి ఉండొచ్చని ఇంకొంతమంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వైద్యాధికారులు విద్యార్థులకు అన్ని పరీక్షలు చేసి విశాఖకు శాంపిల్స్‌ను పంపించారు. నివేదిక వచ్చిన తరువాత అస్వస్థతకు కారణాలను తెలియజేస్తామని తెలిపారు. విద్యార్థులను టిడిపి నాయకులు గొలుసింగి సత్యనారాయణ పరామర్శించారు. ఘటన వివరాలను స్థానిక ఎస్ఐ కిషోర్ కుమార్ సేకరించారు.

ద్రోహం చేస్తున్నదికాక ఉక్కు కార్మికులపై అభాండాలు వేస్తారా?

- సిఎం వ్యాఖ్యలు దారుణం : సిపిఎం

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కూడబలుక్కొని నష్టాల్లోకి నెడుతున్నాయని, ఈ ద్రోహాన్ని కప్పి పెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్టీల్‌ప్లాంట్ కార్మికులపై అభాండాలు వేయడం దుర్మార్గమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు పనిచేయకపోతే ప్లాంట్ 3.4 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం నుంచి 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యానికి ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ప్లాంట్ ఏర్పాటు కోసం నాటి కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.4,890 కోట్ల పెట్టుబడి పెడితే నేడు స్టీల్‌ప్లాంట్ ఆస్తి రూ.3 లక్షల కోట్లకు పెరిగిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉక్కు కర్మాగారం నుంచి సుమారు రూ.60 వేల కోట్ల పన్నులు, డివిడెంట్లు రూపంలో ఆదాయం సమకూరిందని గుర్తుచేశారు. దీనిపై సిఎం సమాధానం చెప్పాలని జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సంస్థ రివైవల్ కోసం రూ.12 వేల కోట్ల నిధులు సమకూర్చినట్టు ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆ నిధులను జిఎస్‌టికి, బ్యాంకు అప్పులు, ఇతర అప్పులు తీర్చడానికి, ఉద్యోగులు, కార్మికుల తొలగింపునకు వినియోగించారని గుర్తు చేశారు. కర్మాగారంలో ఉత్పత్తికి, ముడి సరుకుకు, యంత్రాల మరమ్మతులకు, కొత్త యంత్రాలు, స్పేర్ పార్టుల కొనుగోలుకు, ఉద్యోగుల జీతభత్యాలకు ఆ నిధులను ఇవ్వరాదని ఆంక్షలు పెట్టిన సంగతి ముఖ్యమంత్రికి తెలియదా? అని ప్రశ్నించారు. ఇన్ని ఆటంకాలు సృష్టించి, ప్లాంట్ రివైవల్ కోసం పాటుపడుతున్నామని చెప్పడం ప్రజలను వంచించడమే అవుతుందని పేర్కొన్నారు. అత్యంత నైపుణ్యంగల ఆఫీసర్లను, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను వేల సంఖ్యలో తొలగించి, నైపుణ్యం లేని ఇతర రాష్ట్రాల కార్మికులను కొత్తగా నియమించి ఉత్పత్తికి ఆటంకం సృష్టిస్తున్నది డబుల్ ఇంజన్ సర్కారు కాదా? అని ప్రశ్నించారు.

హిందూపురంలో ఉద్రిక్తత

- వైసిపి నాయకులను అడ్డుకున్న పోలీసులు • పలువురు అరెస్టు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఇందిరమ్మ కాలనీ వద్ద రాస్తారోకో చేస్తున్న వైసిపి నాయకులు

హిందూపురంలో రూ.92.50 కోట్లతో చేపట్టిన పనుల పైలాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో వైసిపి కార్యాలయంపై శనివారం జరిగిన దాడిని నిరసిస్తూ ఆ పార్టీ శ్రేణులు ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా నుంచి హిందూపురం వెళ్లేందుకు ప్రయత్నించిన ఆ పార్టీ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అనంతపురం వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు ఉషశ్రీ చరణ్‌తో పాటు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దరెడ్డి, ఇతర నాయకులు హిందూపురం పట్టణానికి వస్తుండగా ఇందిరమ్మ కాలనీ వద్ద అప్ గ్రేడ్ స్టేషన్ సిఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది అడ్డుకుకొని, పట్టణంలోకి వెళ్లేందుకు అనుమతి లేదని వారికి తెలిపారు. ఈ సమయంలో పోలీసులకు, వైసిపి నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తమ కార్యాలయంపై దాడి జరిగితే దానిని పరిశీలించేందుకు వెళ్తున్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారంటూ అనంత వెంకటరామిరెడ్డి పోలీసులను ప్రశ్నించారు. పోలీసుల తీరును నిరసిస్తూ అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు బలవంతంగా వైసిపి నాయకులను అరెస్టు చేసి పెనుగొండ వైపు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శాంతిపురంగా ఉన్న హిందూపురాన్ని అశాంతి పురంగా మారుస్తున్నారంటూ విమర్శించారు. టిడిపి నాయకులు గూండాల్లా వ్యవహరించి వైసిపి కార్యాలయంపై దాడి చేశారన్నారు. అనంతపురం మాజీ పార్లమెంట్ సభ్యులు రంగయ్య, హిందూపురం పార్లమెంట్ అబ్జర్వర్ రమేష్ రెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ ఫయాజ్ భాషా తదితరులు వైసిపి కార్యాలయాన్ని పరిశీలించి నియోజకవర్గ సమన్వయ కర్త దీపికను దాడి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

టిడిపి, వైసిపి నాయకులపై కేసులు

హిందూపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడి ఘటన నేపథ్యంలో వైసిపి, టిడిపి నాయకులు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీసులు ఇరు పార్టీల నాయకులపైనా కేసులు నమోదు చేశారు. టిడిపికి చెందిన 56 మంది, వైసిపికి చెందిన ఏడుగురిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. టిడిపి ఎస్‌సి సెల్ నాయకుల ఫిర్యాదు మేరకు దివాకర్, మనోజ్, ఇర్ఫాన్, వాల్మీకి లోకేష్, వాసీం తదితర నాయకులపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

హిందూపురాన్ని అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ

హిందూపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. హిందూపురంలో ఆయన ఆదివారం పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో బాలకృష్ణ మాట్లాడుతూ తనను మూడుసార్లు గెలిపించిన హిందూపురం ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. హిందూపురం ప్రాంతంలో కొత్త పరిశ్రమలు తీసుకువచ్చి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపి బికె పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టిడిపి యువ నాయకుడు పరిటాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సతీష్ కుమార్‌ది ప్రభుత్వ హత్యే

- వైసిపి ఎమ్మెల్యే టి చంద్రశేఖర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ అసిస్టెంట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఎవిఎస్ఒ) సతీష్ కుమార్‌ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సతీష్ కుమార్ కేవలం ప్రభుత్వ వేధింపులతోనే మరణిస్తే, దానిని హత్యగా ప్రచారం చేస్తూ, వైసిపి నేతలను నిందిస్తున్నారని తెలిపారు. టిటిడి మాజీ ఎవిఎస్ఒ మరణం వెనుక ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. గురువారం సాయంత్రం 7 గంటలకు ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి అర్ధరాత్రి 12 గంటలకు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడని తెలిపారు. ఈ మధ్యలో 5 గంటల వ్యవధిలో ఏం జరిగిందనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 12:30 గంటలకు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఎక్కిన సతీష్ కుమార్ గంట తరువాత తాడిపత్రికి సమీపంలో శవమై కనిపించాడని, ఈ గంటలో ఏం జరిగిందో విచారణ చేయలేదన్నారు. వీపుపై గొడ్డలితో నరికినట్లు వైద్యులు ధ్రువీకరించారంటూ ఎల్లో మీడియాలో, టిడిపి సోషల్ మీడియాలో ప్రచారం చేశారన్నారు. సతీష్ కుమార్ మరణం ప్రభుత్వానికి ఎక్కడ చుట్టుకుంటుందోనన్న భయంతోనే హత్య పేరుతో కట్టుకథను అల్లారని తెలిపారు. నేరాలపై ఫిర్యాదు చేసిన వారినే నేరస్తులుగా చిత్రీకరిస్తూ సిఎం చంద్రబాబు రాష్ట్రంలో ఒక మాఫియా ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని, రెడ్‌బుల్ రాజ్యాంగం పేరుతో అబద్ధాన్ని నిజం చేసే ప్రయత్నంలో ఎంతో మంది నిజాయతీతో పనిచేసిన అధికారుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుకుంటోందని తెలిపారు. జత్వానీ కేసులో పిఎస్‌ఆర్ ఆంజనేయులును 50 రోజులపాటు అక్రమంగా జైలులో నిర్బంధించారని పేర్కొన్నారు.

విద్యతోనే సామాజిక, ఆర్థిక అసమానతల తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించుకునేందుకు దేశాభివృద్ధికి ప్రజల సంక్షేమం దృష్ట్యా రాజ్యాంగాన్ని సవరించుకునే అవకాశం ఉందన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలేను అంబేద్కర్ గురువుగా భావించేవారన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపి హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీ రూపకల్పనకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. ఒకరి సార్వభౌమాధికారంలో వేరేవారు జోక్యం చేసుకోకుండా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ విధానాన్ని ఎవరైనా అతిక్రమిస్తే చూస్తూ ఊరుకోవాల్సిన అవసరం కూడా లేదని, ఆపరేషన్ సింధూర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఇదే విషయాన్ని ప్రపంచానికి స్పష్టం చేసిందన్నారు. తాను ఎప్పుడూ నిత్య విద్యార్థిగానే కొత్త విషయాలను నేర్చుకుంటూనే ఉంటానన్నారు. మీడియా రంగంలో చాలా మార్పులు వచ్చాయని, సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ రైటర్, ఎడిటరేనన్నారు. ప్రజాస్వామ్యం దారి తప్పినప్పుడు న్యాయ వ్యవస్థ దాన్ని గాడిన పెడుతుందనే విషయాన్ని మనం ఎవరూ మరచిపోకూడదన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అత్యున్నతమైన గొప్ప రాజ్యాంగాన్ని దేశానికి అందించారని, దేశంలోని ప్రతి ఒక్కరికీ ఎలాంటి తారతమ్యం లేకుండా ఓటుహక్కును కలిగించారన్నారు. సిజె గవాయ్ మానవతావాది అని, సమానత్వం అనేది మాటల్లోనే కాకుండా చేతల్లో కూడా చూపించే గొప్ప మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.

రాష్ట్ర హైకోర్టు సిజె ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత చాలా మైలురాళ్ళు అధిగమించామని, నాడు దేశాన్ని బ్రిటీష్ వాళ్లు పరిపాలించినా భారతీయులకు జవాబుదారీతనంగా ఉండేవారు కాదన్నారు. అందుకే పెద్దయెత్తున స్వాతంత్ర్య పోరాటం జరిగిందన్నారు. భావోద్వేగ సమయంలో సొంత రాజ్యాంగం రూపకల్పన జరిగిందన్నారు. జాతీయ సమగ్రత, ప్రజాస్వామ్య భావన, సోషల్ ఇంటిగ్రేషన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాజ్యాంగ రచన చేశారన్నారు. రాజ్యాంగానికి 1951లో తొలి సవరణ చేస్తే, ఇప్పటి వరకు 106 రాజ్యాంగ సవరణలు జరిగాయన్నారు. శంకరీసింగ్, గోలక్‌నాథ్, సజ్జన్ సింగ్, ఎస్ఆర్ బొమ్మై, కేశవానంద భారతి వంటి కేసులు రాజ్యాంగంలో కీలక ఘట్టాలుగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయవాదుల సంఘం సీనియర్ అడ్వకేట్ కె చిదంబరం, జనరల్ సెక్రటరీ సుభోష్, ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు జడ్జిలు, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బిసాయి కల్యాణ చక్రవర్తి, అదనపు అడ్వకేట్ జనరల్ ఇ సాంబశివప్రతాప్, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పొన్నారావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కార్మికులను బెదిరించడం తగదు

(మొదటిపేజీ తరువాయి)

విశాఖ ఉక్కు బిఐఎఫ్ఆర్‌కి వెళ్ళిందని చెప్పడం అవాస్తవమని వెల్లడించారు. ఎప్పుడో 2000 సంవత్సరం నాటి సంగతి ఇప్పుడు చెప్పి ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. మంజూరు చేసిన రూ.12,000 కోట్లలో అధికభాగం కేంద్ర పన్నులకు, బ్యాంకు అప్పులకు జమ చేశారే తప్ప ఉత్పత్తికి ప్రత్యక్షంగా ఇచ్చింది తక్కువ అని వివరించారు. ఉపయోగపడని నిధుల గురించి పదే పదే గొప్పగా చెప్పుకొని రాష్ట్ర ప్రజల్ని తప్పుదారి పట్టిస్తున్నారని పేర్కొన్నారు. ఆరు నెలలపాటు విశాఖ ఉక్కు కార్మికులకు, ఉద్యోగులకు వేతనాలే చెల్లించలేదని తెలిపారు. వాస్తవాలు ఇవికాగా కార్మికులపై అభాండాలు వేయడం తగదని సూచించారు.

బలవంతపు భూసేకరణపై ఉద్యమం

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు
- భోగాపురం, గుర్ల మండలాల్లో పర్యటన

ప్రజాశక్తి- భోగాపురం, గుర్ల (విజయనగరం జిల్లా)

పరిశ్రమల పేరుతో పంట భూములను బలవంతంగా సేకరించాలని చూస్తే ఉద్యమం తప్పదని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విజయనగరం జిల్లా భోగాపురం, గుర్ల మండలాల్లోని పలు గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం బృందం ఆదివారం పర్యటించింది. తొలుత భోగాపురం మండలం లింగాలవలస సమీపంలో నిర్మించిన ఎయిర్‌పోర్టు ఆర్ అండ్ ఆర్ కాలనీని పరిశీలించి స్థానికుల సమస్యలను తెలుసుకుంది. అనంతరం గూడెపువలసలో పర్యటించి రైతులు, గ్రామ నాయకులతో మాట్లాడి, ఇటీవల ప్రభుత్వం చేపట్టిన రహస్య భూ సర్వేపై ఆరా తీసింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టుకు భూములు కోల్పోయిన రైతులకు పూర్తి పరిహారం ఇవ్వలేదని, ఇచ్చిన హామీలు ఇంకా నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడిన నాయకులపై కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. పారిశ్రామికవేత్తల కోసం విశాఖలో ప్రభుత్వం సమ్మిట్ నిర్వహిస్తే, తాము భోగాపురం రైతులతో త్వరలో సమ్మిట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 27న రాష్ట్ర కేంద్రంలో భారీ ధర్నా నిర్వహిస్తామన్నారు. పరిశ్రమల పేరుతో భూములు సేకరించడం రియల్ ఎస్టేట్ వ్యాపారానికేనని విమర్శించారు. గుర్ల మండలంలో దమరసింగి, బెల్లానపేట, కెల్ల, మాన్యపురిపేట గ్రామాల్లో సూపర్ స్మెల్టర్స్ స్టీల్ పరిశ్రమకు భూములు కేటాయిస్తారనే వార్తలు రావడంతో ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశమయ్యారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భూమిలిచ్చే ప్రసక్తే లేదని రైతులు కరాఖండిగా చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు పంటలు పండే సుమారు 1,100 ఎకరాల భూములను పరిశ్రమలకు కేటాయించడం వల్ల ఐదు వేల మంది నిరాశ్రయులు అవుతారని తెలిపారు. సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా రైతుల భూములను సర్వే చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో కవులువాడ నాయకులు కొండపు కొత్తయ్యరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాస్, గాడు అప్పారావు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి.రమణ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకున్నాం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకున్నామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్టీల్‌ప్లాంట్ కోసం మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రతిపక్షాల మాటలు తగవని ఆదివారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. నష్టాల్లో ఉన్న స్టీల్‌ప్లాంట్ కోసం కేంద్రం నుంచి రాష్ట్రం సుమారు రూ.14 వేలకోట్లు తీసుకొచ్చి, ఆర్థిక సాయం అందించి ఆదుకుందని తెలిపారు. దీనిపట్ల బాధ్యతగా ఉండాల్సింది మాని లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని పేర్కొన్నారు. బాధ్యతగా తీసుకొచ్చిన డబ్బులను సద్వినియోగం చేసుకోవాలన్న విషయాన్ని పక్కన పెట్టి కార్మికులు ప్లాంట్‌ను ఏదో అన్నారని మాట్లాడటం మంచిది కాదన్నారు. పబ్లిక్ సెక్టార్‌లో ఉన్న ఏ ప్లాంట్ అయినా లాభాల్లో నడవాలంటే మేనేజ్‌మెంట్, కార్మికులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. వైసిపి నాయకులతో కలిసి కొందరు వ్యాఖ్యల్ని వక్రీకరించి మాట్లాడారన్నారు. లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సిఎం చంద్రబాబు కృషితోనే ఈ ప్లాంట్ లాభాల బాటలో నడుస్తోందని, కార్మికులు, ప్రజానీకం, స్టీల్‌ప్లాంట్‌లోని వారు గ్రహించాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని వెల్లడించారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి తదితరులు

నేటి యువతకు ఉయ్యాలవాడ స్ఫూర్తిదాయకం

- ఆర్ అండ్ బి శాఖా మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి

ప్రజాశకి - పెనుమంట్ర

తొలి స్వాతంత్ర సమరయోధుడు, విప్లవ నేత ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేటి యువతకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామంలో ఆదివారం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వన సమారాధన కార్యక్రమ సభలో మంత్రి ప్రసంగించారు. బ్రిటీష్ పాలకులపై తిరుగుబాటు చేసి, పోలీస్ స్టేషన్లోని తుపాకీలు తీసుకెళ్లి వారిపైనే ఎదురు దాడి చేసిన రాయల సీమ ప్రాంత విప్లవ వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని అన్నారు. నేటి తరానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాటపటిమ ఆదర్శం కావాలని కోరారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ స్వాతంత్రానికి వంద సంవత్సరాల పూర్వమే బ్రిటీష్ వారిపై అలుపెరగని పోరాటం చేసిన యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియాడారు. అటువంటి మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని మార్టేరులో ఏర్పాటు చేసుకోవడం శుభదాయకమన్నారు. ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన రెడ్డి సేవా సంఘం నాయకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డి సేవా సంఘం నాయకులు కెవివి సత్యనారాయణ రెడ్డి, వెలగలబుల్లి రామిరెడ్డి, కోనాల కోదండ చంద్రశేఖర్ రెడ్డి (ఆచారి), తేతలి రాజారెడ్డి, గుడిమెట్ల లక్ష్మణ్ రెడ్డి, చిర్ల బాలాజీ రెడ్డి, నల్లిమిల్లి వివేకానంద రెడ్డి, సంధానకర్త విజయారెడ్డి, పరిసర పంచ గ్రామాల్లోని పలువురు ప్రముఖులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత ర్యాలీ నిర్వహించారు.

రాష్ట్రంలో ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలి

(మొదటిపేజీ తరువాయి)

నిరాకరించడం పేదలను, అణగారిన కులాలను ఓటు హక్కుకు దూరంగా మార్చే ప్రక్రియ ఎస్ఐఆర్ అని తెలిపారు. కొంతమందిని లక్ష్యంగా చేసుకొని దీనిని అమలు చేస్తే కచ్చితంగా తాము వ్యతిరేకిస్తామన్నారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న ఇలాంటి కార్యక్రమాలు ఏకపక్షంగా జరుగుతున్నాయని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వం రాజ్యాంగబద్ధమైన సంస్థలను నిర్వీర్యం చేసి రాజకీయ జోక్యాన్ని చొప్పిస్తున్నాయని అన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలు కోరుతున్నా సంస్కరణలను ఎన్నికల కమిషన్ పట్టించుకోకుండా అడగని వాటిని దొడ్డిదారిన ఎస్ఐఆర్ వంటి సంస్కరణలు అమలు చేస్తున్నాయని తెలిపారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల నాటికి దేశ రాజ్యాంగాన్ని ఎత్తివేయాలని బిజెపి ప్రయత్నించిందన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ద్వారా సాధ్యం కాదని వారికి అర్థమైందన్నారు. అందుకనే రాజ్యాంగాన్ని కుదించే ప్రయత్నం చేస్తున్నారని, అందులో భాగమే ఎస్ఐఆర్ వంటి చర్యల ద్వారా ప్రతిపక్ష ఓట్ల తొలగింపు చర్యలకు పూనుకుందని తెలిపారు. ప్రత్యేకహోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ మోడీ-షాల కమిషన్‌గా మారిందన్నారు. ఓట్లు తొలగించే చర్యలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ప్రజలను ఇలాంటి అంశాల నుంచి పక్కదారి పట్టించేందుకు మత, కుల విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జైభీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. ఒక పద్ధతి ప్రకారం స్వయం ప్రతిపత్తి గల వ్యవస్థలను బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాశనం చేస్తూ ప్రజాస్వామ్యంపై దాడి చేస్తున్నాయని చెప్పారు. ఓట్ల తొలగింపు, కొత్త ఓట్లు గురించి ఎన్నికల కమిషన్ సమాధానం చెప్పడం లేదన్నారు. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు బంగారావు, ఆర్‌ఎస్‌పి నాయకులు జానకిరాములు, విసికె పార్టీ నాయకులు విద్యాసాగర్, ఆప్ నేత నేతి మహేశ్వరరావు, ఎస్‌యుసిఐ నాయకులు సుధీర్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రామకృష్ణ, ఎంసిపిఐయు నాయకులు ఖాదర్ బాషా, రెడ్‌ఫ్లాగ్ నాయకులు ప్రసాద్, ఐలూ రాష్ట్ర నాయకులు సుధాకర్, భారత్ బచావో నాయకులు భాస్కరరావు మాట్లాడుతూ.. బీహార్‌లో వలస కూలీలు, ప్రతిపక్ష నేతల ఓట్లు తొలగించారని తెలిపారు. మూడు విదేశీ శక్తులను ఏరిపారేసేందుకు ఎస్ఐఆర్ అమలు చేస్తున్నామని బిజెపి పదేపదే చెప్పిందని తెలిపారు. తొలగించిన 65 లక్షల ఓట్లలో విదేశీలు ఎంతమంది ఉన్నారో చెప్పలేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, బి తులసీదాస్, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బిర్సా ముండా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఒడిశా సిఎం మాఝీ

బిర్సాముండా విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి జిల్లా)

ఆదివాసీ పోరాట యోధుడు బిర్సా ముండా 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అల్లూరి జిల్లా పాడేరు మండలం చింతల వీధిలో బిర్సా ముండా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఆదివారం ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం 497 ఏకలవ్య మోడల్ పాఠశాలలను దేశవ్యాప్తంగా నెలకొల్పి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తోందని తెలిపారు. ఆది కర్మయోగి అభియాన్ ద్వారా గిరిజన యువతకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. దేశంలో నక్సల్ ప్రభావిత జిల్లాలను 126 నుంచి 38కి తగ్గించి గిరిజన ప్రాంతాల్లో శాంతి భద్రతలను నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. 24 లక్షల గిరిజన కుటుంబాలకు అటవీ హక్కుల పట్టాలు పంపిణీ చేశామని వివరించారు. గిరిజన వీరుల స్మారకార్థం దేశవ్యాప్తంగా పది మ్యూజియాలు ఏర్పాటు చేస్తున్నామని, వాటిలో ఆంధ్రప్రదేశ్‌లోని లంబసింగి ప్రాంతముందని తెలిపారు.

గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై అనుచిత వ్యాఖ్యలా?

- ఎన్నికలకు ముందు ఒకమాట... గెలిచాక మరోమాటా?
- సిఎం చంద్రబాబుపై భగ్గుమన్న ఉక్కు కార్మికులు

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

'పని చేయకుండా జీతాలివ్వాలా..' అంటూ ఉక్కు కార్మికులను ఉద్దేశించి సిఎం చంద్రబాబు శనివారం విశాఖ వేదికగా సిఐఐ భాగస్వామ్య సదస్సు ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వ్యాఖ్యలు చేయడం పట్ల విశాఖ ఉక్కు కర్మాగారంలోని కార్మిక సంఘాలు భగ్గుమన్నాయి. ప్లాంట్ ప్రగతిలో కీలకంగా ఉన్న కార్మికులపై బాధ్యతాయుత పదవిలో ఉన్న చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని కార్మిక నేతలు అన్నారు. ఎన్నికలకు ముందు ఒకమాట... గెలిచిన తర్వాత మరోమాట ఆడడం ఆయనకే చెల్లిందని, రానున్న కాలంలో కార్మికులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ఈ క్రమంలోనే ఉక్కు యాజమాన్యం ప్లాంట్ విభాగాల్లో ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోకుంటే కార్మికుల వేతనాల్లో కోతలు పెడతామంటూ శనివారం ఓ సర్క్యులర్‌ను జారీ చేసిందని, ఉత్పత్తికి, కార్మికుల జీతాలకు ముడిపెట్టడం సరికాదని అన్నారు.

కార్మికులను అవమానిస్తారా ?

స్టీల్‌ప్లాంట్ కార్మికులపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు అర్థరహితం. కార్మికులను అవమానించినట్టుగా మాట్లాడడం సరికాదు. ఉత్పత్తి వ్యయం ఇతర స్టీల్‌ప్లాంట్లతో పోల్చుకుంటే విశాఖ ఉక్కుకు అధికం. సొంత గనులు ఈ ప్లాంట్‌కు లేవు. ఈ విషయాన్ని అవగాహన చేసుకుని సిఎం మాట్లాడితే మంచిది. కొత్తగా అనకాపల్లి జిల్లాలో పెడుతున్న ప్రైవేటు స్టీల్‌ప్లాంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం గనులు కోరుతోందిగానీ, ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు కోరడం లేదు. ఇది అత్యంత దారుణం. చంద్రబాబు వ్యాఖ్యలను వెనక్కు తీసుకోకుంటే ఆందోళనకు దిగుతాం.

డి.ఆదినారాయణ, ఉక్కు గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ, యాజమాన్య విధానాల వల్లే 'ఉక్కు'కు నష్టాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఉక్కు యాజమాన్య విధానాల వల్లే స్టీల్‌ప్లాంట్‌కు నష్టాలు వస్తున్నాయి. ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని మోడీ సర్కారు ప్రకటించినప్పటి నుంచీ కుట్రలు పెరుగుతూనే ఉన్నాయి. ప్లాంట్ నష్టాల విషయమై కార్మికులపై నెపం నెట్టడం దారుణం. సిఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం. ప్లాంట్‌లో 45 రోజులకు సరిపడా ముడి సరుకు ఉండాలి. కానీ, ప్రస్తుతం ఐదు రోజులకు సరిపడే ముడి సరుకు మాత్రమే ఉంది. యాజమాన్యం, ప్రభుత్వం నుంచి కార్మికులకు సహకారం ఉండడం లేదు. ఉత్పత్తి విషయంలో లక్ష్యాలు విధించి ఒత్తిడి పెంచడం తగదు. ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికులను తగ్గించి ఉన్న కార్మికులపై పనిభారం పెంచారు. స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తే కార్మికులు లాభాలను తీసుకొస్తారు.

-జె.అయోధ్యరాం, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి

కార్మికులకు క్షమాపణ చెప్పాలి

సిఎం చేసిన అనుచిత వ్యాఖ్యలు కార్మికులకు మనస్తాపం కలిగించాయి. వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలి. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసే ఆలోచనలో ప్రభుత్వాలు ఉన్నాయి. ఎన్నికలకు ముందు ఒక మాట... తర్వాత ఒక మాట మాట్లాడే ఆయనను కార్మిక వర్గం నమ్మరాదు. ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించినప్పుడు కూడా సిఎం నోరు మెదపలేదు. మోడీ ప్రభుత్వం రాకముందు వరకూ ప్లాంట్ లాభాల్లోనే ఉంది. ఇప్పుడు కొత్తకొత్త సర్క్యులర్లు, విధానాలు తెచ్చి కార్మికులను ఇబ్బంది పెడుతున్నారు.

-మంత్రి రాజశేఖర్, స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టియుసి నాయకులు

ప్రమాదకరంగా రాష్ట్ర ఆర్థిక స్థితి

- మాజీ సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రమాదకరంగా మారిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సంపద సృష్టిస్తామంటూ టిడిపి, జనసేన నేతలు చెప్పిన దానికి విరుద్ధంగా ఆర్థిక పరిస్థితి ఉందని ఆదివారం ఎక్స్‌లో విమర్శించారు. తక్కువ ఆదాయ వృద్ధి, తక్కువ మూలధన పెట్టుబడి, పెరిగిపోతున్న రుణభారం అని పేర్కొన్నారు. కాగ్ విడుదల చేసిన గణాంకాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో రాష్ట్రప్రభుత్వ సొంత పన్ను ఆదాయాల వార్షిక వృద్ధి కేవలం 7.03 శాతం ఉందని తెలిపారు. సొంత ఆదాయాలు ఏమాత్రం పెరగకపోగా, మూలధన పెట్టుబడులు కూడా గణనీయంగా తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందంటూ ఎలా ప్రచారం చేస్తారని ప్రశ్నించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిఎస్‌డిపి వృద్ధిని 12.02 శాతంగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆ వృద్ధిని 17.1 శాతంగా లక్ష్యంగా పెట్టుకుందని, కానీ ఫలితాలు దారుణంగా ఉన్నట్లు కాగ్ నివేదికలు చెప్తున్నాయని పేర్కొన్నారు. సంపద సృష్టి లేకపోవటంతో రాష్ట్రం తిరోగమనంలో ఉందని విమర్శించారు.

పెట్టుబడుల దిశను మార్చిన సిఐఐ సమ్మిట్

- మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పెట్టుబడుల దిశను విశాఖ సిఐఐ సమ్మిట్ మార్చేసిందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెట్టుబడులకు రాష్ట్రాన్ని గమ్యస్థానంగా నిలపడంలో సిఎం చంద్రబాబు మరోసారి తన సత్తాను చాటారన్నారు. మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేష్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారన్నారు. మిగిలిన రాష్ట్రాలకు భిన్నంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుండటంతో రాష్ట్రంలో పరిశ్రమలు క్యూ కట్టాయన్నారు. రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు, 16 లక్షల ఉద్యోగాలు రావడం రాష్ట్రం పట్ల పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వెళ్లడం, ప్రభుత్వ వికేంద్రీకరణ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

డిసిబి బ్యాంక్ లిమిటెడ్
నమోదిత కార్యాలయం : 601 & 602, పెనిన్సుల బిజినెస్ పార్క్, 6వ అంతస్తు, టవర్ ఎ, సేనాపతి బాపత్ మార్గ్, లోయర్ పారెల్, ముంబై-400 013

DCB BANK

బహిరంగ ప్రకటన
అభరణాల వేలం కమ్ ఆహ్వాన నోటీసు

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు **డిసిబి బ్యాంక్ లిమిటెడ్** నుండి అభరణాలు ఎదురుగా వారిచే పొందిన రుణసౌకర్యాలు మొత్తం బకాయిలు చెల్లించుటకు నోటీసులు జారీచేయబడినాయి. దీని ప్రకారం, **బ్యాంక్ 18.12.2025 మరియు 19.12.2025 శాఖలలో మ.12:00 నుండి సా.04:00** వరకు పట్టికలో పేర్కొన్న తాలూకా/తహసీళ్ళు/ప్రదేశాలలో నిర్వహించబడే మొదటి వేలం గురించి బహిరంగ నోటీసు ఇస్తుంది. వేలం యొక్క నిబంధనలు మరియు షరతులతో సహా మరిన్ని వివరాల కొరకు వారి వెబ్‌సైట్ **https://gold.samil.in/home** లేదా సంబంధిత శాఖకు లాగిన్ అవ్వడం ద్వారా బ్యాంక్ ఎంపానెల్డ్ వేలం సంస్థ **మెసెర్స్.శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్** (ఎస్ఎఎమ్ఐఎల్) ను సంప్రదించాలని ఆహ్వానించబడ్డారు.
రుణగ్రహీతలు మరియు బిడ్డరుదారులు మా వెబ్‌సైట్ **www.dcb.bank.in** ను శాఖ చిరునామాలు/ వేలం వేదిక కొరకు చూడవచ్చు.

క్రసం	ఖాతాదారుని ఐడి	ఖాతాదారుని పేరు	ప్రాంతం/ప్రదేశం
1	103013414	పాముల కనక రమేష్	అనకాపల్లి-విశాఖపట్నం
2	108116039	సింగంపల్లి చంద్ర శేఖ	అనకాపల్లి-విశాఖపట్నం
3	107767592	వియ్యపు ప్రభాష్ యాదవ్	అనకాపల్లి-విశాఖపట్నం
4	106770502	కొల్లాటి దుర్గా వర్మ	అనకాపల్లి-విశాఖపట్నం
5	106148016	గంట్ల మధుసూధన	అనంతపురం-అనంతపురం
6	107929019	యన్నపూసల అనూష	అనంతపురం-అనంతపురం
7	105554128	బండి విజయ్ కుమార్	అనంతపురం-అనంతపురం
8	106982177	కంచి సౌజన్య	అనంతపురం-అనంతపురం
9	106554344	ఎస్.యాస్మీన్ బేగం	అనంతపురం-అనంతపురం
10	107025814	కంచి హరినాథ్ రెడ్డి	అనంతపురం-అనంతపురం
11	107908715	ఇల్లుగంటి వెంకటనారాయణ	అనంతపురం-అనంతపురం
12	106183409	సింగుపురపు కృష్ణారావు	అరిసవిల్లి-శ్రీకాకుళం
13	107426561	బండారు రాజేంద్రప్రసాద్	చిట్టివలస- చిట్టివలస
14	108427302	గెద్దల విజయ్ కుమార్	ఏలూరు-ఏలూరు
15	107397366	మల్లింపల్లి జీవన్ కిషోర్	ఏలూరు-ఏలూరు
16	105159806	రెడ్డి దుర్గా ప్రసాద్	ఏలూరు-ఏలూరు
17	107717223	షేక్. సుభాన్	కర్నూలు-కర్నూలు
18	108051013	సుధా నాగరాజు	నల్లపాడు-నల్లపాడు
19	104063218	లంక మహాలక్ష్మి	రాజమండ్రి-రాజమండ్రి
20	101489180	పెనుగొండ సత్య వెంకట ఆర్	రాజమండ్రి-రాజమండ్రి
21	106543650	కొల్లం సెట్టి రాణి	రాజమండ్రి-రాజమండ్రి
22	106005187	ఈద్ర సత్యవతి	తిరుపతి-తిరుపతి
23	107393501	అట్లూరు జగదీష్ ప్రసాద్	తిరుపతి-తిరుపతి
24	108432776	సన్నిధి వెంకట రావు	విశాఖపట్నం-విశాఖపట్నం
25	106802251	దన్నిన కావ్య కుసుమ	విశాఖపట్నం-విశాఖపట్నం

ఈ ప్రచురణ ద్వారా, సంబంధిత రుణగ్రహీత (లు)/తనఖాదారు (లు) లేదా వారి చట్టపరమైన వారసుడికి (లు) దీని ద్వారా తుది నోటీసు ఇవ్వబడుతుంది మరియు బ్యాంక్ రీకాల్ చేసిన సౌకర్యాలలో మొత్తం బకాయిలను క్లియర్ చేయడానికి చివరి అవకాశం ఇవ్వబడుతుంది, నిర్ణీత వేలం తేదికి ముందు అన్నీ వడ్డీ మరియు ఛార్జీలతో, అది విఫలమైతే, ఈ బహిరంగ నోటీసుకు అనుగుణంగా తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాలు వేలం వేయబడతాయి. ఏదైనా వేలం విఫలమైన సందర్భంలో, సంబంధిత రుణగ్రహీత (లు) కు ముందస్తు నోటీసు/సమాచారం లేకుండా ఏ ఇతర వేలం ద్వారా మరియు/లేదా వేలం వేదికను మార్చడం ద్వారా తదుపరి తేది(లు) లో అటువంటి బంగారు ఆభరణాలను వేలం వేయడానికి మరియు విక్రయించడానికి బ్యాంకు తన హక్కును కలిగి ఉంటుంది. వేలంలో పాల్గొనడం మరియు వేలాన్ని అంగీకరించడం **డిసిబి బ్యాంక్ లిమిటెడ్** యొక్క స్వంత అభీష్టానుసారం ఉంటుంది. ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతా (లను) తొలగించడానికి/వేలం తేది (లను) మార్చడానికి **డిసిబి బ్యాంక్ లిమిటెడ్‌కు** అధికారం ఉంది.
దయచేసి గమనించవలసింది ఏమనగా వేలం **"ఆధారం ఎక్కడ ఉంది అలాగే", "ఆధారం ఏమిటి ప్రాతిపదికన", "ఆధారం ఏమైనా ఉంది"** మరియు **"ఆధారం లేకుండా"** జరుతుంది మరియు ఆభరణాలకు సంబంధించిన ఏవైనా క్లెయిమ్లు, వివాదాలు, అభ్యంతరాలు లేదా దాని వేలానికి **డిసిబి బ్యాంక్** ఏ విధంగానూ బాధ్యత వహించదు మరియు పూచి ఉండదు.

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్
తేది : 17.11.2025
సం/- అధీకృత అధికారి
డిసిబి బ్యాంక్ లిమిటెడ్

ఆధారాల కోసం అన్వేషణ!

- వీడని సతీష్ కుమార్ మృతి మిస్టరీ
- మరోసారి సీన్ రీ కన్‌స్ట్రక్షన్

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

టిటిడి మాజీ ఎవిఎస్‌ఒ, గుంకల్లు రైల్వే సిఐ సతీష్ కుమార్ అనుమానాస్పద మృతికి కారణాలను అన్ని కోణాల్లోనూ పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతి ఏ రకంగా జరిగిందన్న దానిని ఛేధించే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఇప్పటికీ ఎక్కడా సరైన ఆధారాలు దొరకనట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం నాడు ఘటన జరిగిన ప్రాంతంలో మరోమారు సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. శనివారం నాడు సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై మరింత నిర్ధిష్టత రావడానికి ఆదివారం కూడా మరోమారు చేశారు. శనివారం నాడు రెండు బొమ్మలను వినియోగిస్తే ఆదివారం నాడు మూడు బొమ్మలను వినియోగించారు. తాడిపత్రి ఎఎస్‌పి రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో ఈ దర్యాప్తు జరుగుతోంది. సతీష్‌కుమార్ అంత బరువున్న మూడు బొమ్మలను మూడు రకాలుగా కిందకు పడేసి పరీక్షించారు. దీన్ని గుంతకల్లు, చెన్నై ఎగ్మోర్ రైలు బోగీల నుంచి కిందకు పడేసి ఆ బొమ్మలు ఎంతదూరంలో పడ్డాయన్న వివరాలను తెలుసుకున్నారు. తనంట తాను దూకితే ఎంత దూరంలో పడతారు? బయటకు ఎవరైనా తోసేస్తే ఎంత దూరంలో పడతారు? డోరు నుంచి జారి పడితే ఎంత దూరంలో పడుతారు? అనే వివరాలను తెలుసుకునేందుకు మూడు బొమ్మల ద్వారా ప్రయోగం చేశారు. నిలబడి ఉన్న బొమ్మను తోసేయగా అది 88 అడుగుల దూరంలో పడింది. నిలబడి ఉండగా తనంతతాను పడిపోతే 61 అడుగుల దూరంలో బొమ్మ పడింది. కూర్చొని ఉన్న బొమ్మ కిందకు పడితే 46 అడుగుల దూరంలో పడింది. దీన్నిబట్టి సతీష్‌కుమార్ ఏ రకంగా రైలులో నుంచి కిందకు పడి ఉండవచ్చన్న దానిని పోలీసులు అంచనా వేశారు. డిఐజి షిమోసి, ఎస్‌పి జగదీశ్‌ల సమక్షంలో అన్ని వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మరోవైపు ఘటన జరిగిన రోజు రైలులో ఏమి జరిగిందన్న వివరాలను తెలుసుకునేందుకు ప్రత్యక్ష సాక్షులను గుర్తించే పనిలోనూ పోలీసులు నిమగ్నమయ్యారు.

ఆధారాల కోసం అన్వేషణ

ఘటన జరిగిన ప్రాంతంలో పరిశీలన జరుపుతూనే ఆ గంట ప్రయాణంలో ఏమి జరిగిందని దానిని గుర్తించేందుకు ఘటన స్థలాన్ని పోలీసులు మరోసారి పరిశీలిస్తున్నారు. సతీష్‌కుమార్ వాడుతున్న మొబైల్ ఫోను ద్వారా కూడా సమాచారాన్ని సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. చివరగా ఆయన ఎవరెవరితో మాట్లాడారు, ఆయన వాట్సప్‌లో ఏమైనా సందేశాలున్నాయా అన్న దానిపై ఆరా తీస్తున్నారు. దీంతోపాటు ఆ రోజు రైలులో సతీష్‌కుమార్ ప్రయాణిస్తున్న ఎ-1 బోగితోపాటు పక్క బోగిల్లో ఎవరున్నారు, వారిలో ఎవరైనా సతీష్‌కుమార్ మరణాన్ని చూసిన వారున్నారా అన్న కోణంలోనూ దర్యాప్తు చేపడుతున్నారు. రిజర్వేషన్ ఛార్టు తీసుకుని దాని ద్వారా గుర్తించే ప్రయత్నం చేయడమే కాకుండా పాత నేరస్తులేమైనా ఉన్నారా అన్నది కూడా పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు పోలీసులకు ఎటువంటి ఆధారమూ లభించనట్టు తెలుస్తోంది. రైలులో ఆయన లగేజీ రిజర్వ్ చేసుకున్న బెర్తు నంబరు 29లో కాకుండా 11కు ఎలా వెళ్లిందన్న దానిపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే తిరుపతిలో రైల్వే డిఎస్‌పి హర్షిణి బోగిలో ఆ రోజు విధుల్లో ఉన్న టిటిఇతోపాటు బెడ్ రోలరును, ఎలక్ట్రిషన్‌ను విచారించారు. ఇలా అన్ని కోణాల్లోనూ సమాచారాన్ని సేకరించి క్లూ సేకరించేందుకు పోలీసులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు.

రైల్వే కొలువులకు సిద్ధం ఇలా !

-కె.ఎస్.లక్ష్మణరావు,
మాజీ శాసనమండలి సభ్యులు,
జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు,
సెల్ : 8309965083

కేంద్రప్రభుత్వ రైల్వే విభాగాల్లో ఉద్యోగం సాధించాలని చాలా మంది యువత కలలు కంటారు. దాన్ని సాకారం చేసుకోవడానికి చాలా కష్ట పడతారు. రైల్వేలో జీతాలు, బోనస్‌లు, వసతులు చాలా బాగుంటాయి. దేశంలో ఎక్కడికైనా తిరిగే అవకాశం లభిస్తుంది. దీనిలో చిన్న ఉద్యోగం వస్తే చాలు జీవితంలో స్థిరపడిపోవచ్చు.

దేశంలోని వివిధ రైల్వే విభాగాల్లో ఇటీవల పలు విభాగాల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. గ్రూప్-డి నుంచి టిక్కెట్ కలెక్టర్, టెక్నికల్ విభాగాల్లో పలు పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్లు వచ్చాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్..ఇలా టెక్నికల్ విభాగాల్లో ఇంజనీరింగ్ పోస్టులు కూడా ఉన్నాయి. అభ్యర్థులు తమ విద్యార్హతకు అనుగుణంగా ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకుని ప్రణాళికా బద్ధంగా ప్రిపరేషన్ సాగిస్తే ఉద్యోగాన్ని కైవసం చేసుకోవచ్చు. ఇలా ఎదురు చూస్తున్నవారందరికీ ఇండియన్ రైల్వే రైల్వేలో సాధారణ స్థాయి నుంచి ఉన్నత స్థాయి ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే కొన్ని నోటిఫికేషన్లు వచ్చాయి.

ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతలతో ఆర్ఆర్‌బిలు ఎన్‌టీపీసీ ఉద్యోగాల భర్తీకి ఇటీవలే ప్రకటనలు వెలువరించాయి. ఇదే బాటలో డిప్లొమాతోనూ రైల్వేలో జూనియర్ ఇంజినీర్(జేఈ)గా కొలువుదీరే అవకాశం వచ్చింది. ఇటీవలే 2569 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. పరీక్షల్లో ప్రతిభ చూపితే చాలు.. లెవల్-6 వేతనంతో సేవలందించొచ్చు. ఆ తర్వాత ఉద్యోగోన్నతితో ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు.

డిప్లమా విద్యార్హతతో మేటి ఉద్యోగం పొందే అవకాశం రైల్వేలు కల్పిస్తున్నాయి. జూనియర్ ఇంజినీర్‌గా చేరిన వారు మొదటి నెల నుంచే సుమారు రూ.65 వేలు జీతం పొందొచ్చు. ఆ తర్వాత అనుభవం, నైపుణ్యాలు, విద్యార్హతల ద్వారా.. అసిస్టెంట్ ఇంజనీర్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్...ఇలా ఉన్నత హోదాలు పొందొచ్చు. రెండు దశల్లో నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలు, ధృవపత్రాల పరిశీలన ఉంటుంది. వైద్య పరీక్షల అనంతరం నియామకాలు పూర్తవుతాయి.

పరీక్షలు జరిగేది ఇలా...

-కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) పద్ధతిలో పరీక్షలు జరుగుతాయి. సిలబస్ ప్రకారం ఆయా విభాగాల వారీ ప్రాథమికాంశాల నుంచి ప్రారంభించి పూర్తిగా చదవాలి.

-వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. ముఖ్యాంశాలు నోట్ చేసుకోవాలి.

-అధ్యయనం పూర్తయిన తర్వాత పాతప్రశ్నాపత్రాలను పరిశీలించాలి.

-పరీక్ష కోణంలో ఆలోచించి ఏ అంశాలకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకుని మళ్లీ చదవటం, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించటం చేయాలి.

-మాక్ టెస్టులు రాసి, ఫలితాలు విశ్లేషించుకోవాలి. తప్పులు పునరావృతం కాకుండా పరీక్షల వారీ స్కోరులో మెరుగుదల ఉండేలా కృషిచేయాలి.

స్టేజ్-1: వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వంద ప్రశ్నలు వస్తాయి. మేథ్స్ 30, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 25, జనరల్ అవేర్‌నెస్ 15, జనరల్ సైన్స్ 30 ప్రశ్నలు ఉంటాయి. వీటిని 90 నిమిషాల్లో పూర్తిచేయాలి.

స్టేజ్-2: స్టేజ్ -1లో ప్రతిభావంతులకే స్టేజ్-2కి అవకాశమిస్తారు. స్టేజ్-1 మార్కుల మెరిట్‌తో విభాగాల వారీ ఉన్న ఖాళీలకు 15 రెట్ల మందిని స్టేజ్-2కి తీసుకుంటారు. దీన్ని 150 మార్కులకు నిర్వహిస్తారు. 150 ప్రశ్నలు. ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష వ్యవధి 2 గంటలు. జనరల్ అవేర్‌నెస్ 15, ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ 15, కంప్యూటర్స్ అండ్ అప్లికేషన్స్ బేసిక్స్ 10, ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్ బేసిక్స్ 10, టెక్నికల్ ఎబిలిటీస్ 100 ప్రశ్నలు వస్తాయి.

తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు

పరీక్ష కోసం తెలుగు మాధ్యమాన్నీ ఎంచుకోవచ్చు. ఆన్‌లైన్ ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్‌లో డిస్‌ప్లే అవుతాయి. స్టేజ్ 1, స్టేజ్ 2 రెండు దశల్లోనూ తప్పు సమాధానానికి 1/3 మార్కు తగ్గిస్తారు. స్టేజ్ 1, స్టేజ్ 2ల్లో అర్హత సాధించడానికి జనరల్, ఇడబ్ల్యుఎస్ 40, ఓబీసీ, ఎస్సీ 30, ఎస్టీలు 25 శాతం మార్కులు పొందాలి. స్టేజ్-2లో అర్హత పొందిన వారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఖాళీల సంఖ్యకు సమానంగా అభ్యర్థులను ధ్రువ పత్రాల పరిశీలనకు పిలుస్తారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, ఏ సమస్యా లేని వారిని ఉద్యోగంలోకి ఆహ్వానిస్తారు.

ఈ అంశాలు కీలకం

ముందు నోటిఫికేషన్‌లోని సిలబస్ వివరాలు గమనించాలి. వాటికి అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ సిద్ధం చేసుకోవాలి. పరిమిత సాధన వనరులనే ఎంచుకుని, వాటినే విస్తృతంగా చదవడం, పున:శ్చరణ చేయడానికి ప్రాధాన్యమివ్వాలి.

పరీక్ష తేదీ ప్రకటించనందున ఎక్కువ వ్యవధే ఉండొచ్చు. అందువల్ల ఏదైనా విభాగంలోని ఒక అంశాన్నే తీసుకుని పూర్తిగా ఒక రోజు కేటాయించుకోవచ్చు. ప్రాథమికాంశాల నుంచి ప్రారంభించి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. అలాగే ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి.

ప్రతి విభాగంలోనూ అన్ని అంశాలూ చదవడం పూర్తయిన తర్వాత, పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పరీక్ష కోణంలో ఆలోచించి, ఏ అంశాలకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకుని, మళ్లీ చదవడం, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించడం చేయాలి.

పరీక్ష తేదీకి నెల రోజుల ముందు నుంచే మాక్ టెస్టులు రాయాలి. ఫలితాలు విశ్లేషించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. వెనుకబడుతోన్న అంశాలకు ప్రాధాన్యమిచ్చి, బాగా చదివితే, స్కోరు పెరుగుతుంది.

రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేయాలి.

తక్కువ వ్యవధిలో వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించాలి. అందువల్ల వేగం, కచ్చితత్వం రెండూ ముఖ్యమే. వీలైనన్ని మాదిరి ప్రశ్నల సాధనతో, వీటిపై పట్టు లభిస్తుంది.

మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రశ్నలకు ఆబ్జెక్టివ్ అర్థమెటిక్ విభాగంలో త్రికోణమితి, ఆల్జీబ్రా.. మొదలైన అంశాల కోసం పదో తరగతి గణిత పుస్తకాన్ని బాగా చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగానికి ఎక్కువ సమయం కేటాయించాలి.

స్టేజ్ -1, 2ల్లోని జనరల్ అవేర్‌నెస్ కోసం.. సిలబస్‌లో పేర్కొన్న అంశాలకు చెందిన తాజా పరిణామాలకు ప్రాధాన్యమివ్వాలి. ఏప్రిల్, 2025 నుంచి పరీక్ష తేదీ వరకు.. ముఖ్య సంఘటనలు గుర్తుంచుకోవాలి. వార్తా పత్రికలకు క్రమం తప్పకుండా చదవాలి. చదివేటప్పుడే ప్రశ్నగా రావడానికి అవకాశం ఉన్న వాటిని నోట్సు రాసుకుంటే..పరీక్షకు ముందు తక్కువ వ్యవధిలోనే మరోసారి పున:శ్చరణ చేసుకోవచ్చు.

పరీక్షలో విజయాన్ని నిర్ణయించేది స్టేజ్-2లో టెక్నికల్ ఎబిలిటీస్ విభాగం. ఇందులో ఎక్కువ మార్కులకు డిప్లొమా పాఠ్యపుస్తకాలే దిక్సూచి. అలాగే ఆర్ఆర్‌బి జేఈ పాతప్రశ్నపత్రాలతోపాటూ.. ఎస్ఎస్‌సి దాదాపు ఏటా నిర్వహిస్తోన్న జేఈ ప్రశ్నపత్రాల అధ్యయనమూ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

స్టేజ్-1, స్టేజ్-2ల్లో ఉమ్మడిగా ఉన్న జనరల్ సైన్స్ కోసం.. సీబీఎస్‌ఈ 8,9,10 తరగతుల భౌతిక, రసాయన, జీవశాస్త్రాల పుస్తకాలు క్షుణ్ణంగా చదవాలి. ఈ విభాగాల్లో ఆర్‌జేసీ, పాలిటెక్నిక్ పాత ప్రశ్నపత్రాల అధ్యయనంతో ఎక్కువ మార్కులు పొందడానికి అవకాశం ఉంది.

మొత్తం ఖాళీలు : 2569.

విద్యార్హత : జూనియర్ ఇంజనీర్ పోస్టులకు.. సంబంధిత, అనుబంధ విభాగాల్లో మూడేళ్ల డిప్లొమా లేదా బీఈ/బీటెక్ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకు బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీలతో అవకాశం ఉంది. డిపో మెటీరియల్ సూపరింటెండెంట్ ఖాళీలకు డిప్లొమా అన్ని విభాగాలవారూ అర్హులే. ఏదో ఒక ఆర్ఆర్‌బీలో ఉన్న ఖాళీలకే దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం చివరి ఏడాది కోర్సుల్లో ఉన్నవారికి అవకాశం లేదు.

వయస్సు: జనవరి 1, 2026 నాటికి 18 నుంచి 33 ఏళ్లలోపు ఉండాలి. జనరల్ అభ్యర్థులైతే జనవరి 2, 1993 - జనవరి 1, 2008 మధ్య జన్మించాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయసులో సడలింపులు వర్తిస్తాయి.

పరీక్ష ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, వికలాంగులు, మైనార్టీలు, ఈబీసీలకు రూ.250. స్టేజ్ -1కు హాజరైతే బ్యాంకు ఛార్జీలు మినహాయించి, పరీక్ష ఫీజు ఇచ్చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 30

పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారనేది రైల్వే అధికారులు త్వరలో ప్రకటించనున్నారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లు విద్యార్థులకు వరం

కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయప్రతిభా ఉపకార వేతనాలు (నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)లు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల చదువుకు ఎంతోమేలు చేస్తాయి. అత్యధిక మంది పిల్లలు పేద, సామాన్య వ్యవసాయ కుటుంబాలకు చెందిన పిల్లలు ఆర్థిక ఇబ్బందులు పడుతూ చదువుకుంటున్న విషయం అందరికీ తెలిసిందే. అలాంటి విద్యార్థులను ఉపాధ్యాయులు వెన్నుతట్టి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు.

ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఉన్నత విద్య దిశగా ప్రోత్సహించడానికి కేంద్ర మానవ వనరుల విభాగానికి చెందిన స్కూల్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ విభాగం ఈ స్కాలర్‌షిప్పులను అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఏటేటా యేటా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నేషనల్ మీన్స్-కమ్-మెరిట్ స్కాలర్‌షిప్ అందిస్తున్న సంగతి తెలిసిందే. 2025-26 విద్యా సంవత్సరానికి కూడా ఈ పథకాన్ని అమలు చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. 8వ తరగతి తర్వాత విద్యార్థుల డ్రాపౌట్ కాకుండా నివారించి, వారిని చదువుకునేందుకు ప్రోత్సహించడం, ప్రాథమిక విద్యను కొనసాగించడమే లక్ష్యం. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ పాఠశాలల్లో, స్థానిక సంస్థల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరం 8వ తరగతి చదువుతూ ఉన్న విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50 లక్షలకు మించకుండా ఉండాలి. 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. దేశవ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్పులు అందిస్తారు. రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన వీటిని విభజించారు. ఈ లెక్క ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు 4087, తెలంగాణకు 2921 కేటాయించారు. వీటిలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6, బీసీ-ఎ 7, బీసీ-బీ 10, బీసీ-సీ 1, బీసీ-డీ 7, బీసీ-ఈ 4, వికలాంగులకు 3 శాతం సీట్లు దక్కుతాయి.ఈ పథకానికి ఎంపికైన లక్ష మంది విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి మొత్తం రూ.12000 స్కాలర్‌షిప్‌గా అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తిచేసే వరకు ఉపకారవేతనం లభిస్తుంది. 13 నుంచి 15 సంవత్సరాల వయస్సులో కలిగిన 8వ తరగతి విద్యార్థులకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఇచ్చారు. విద్యార్థుల ఎంపికకు రాష్ట్రస్థాయిలో రెండు పేపర్ల రాత పరీక్షలు నిర్వహిస్తారు.

పరీక్షలు జరిగేది ఇలా..:

పేపర్ 1లో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్) 90 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 90 మార్కులకు పరీక్ష ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ ఉండదు.

పేపర్ 2 స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (శాట్) 90 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలకు ఉంటుంది. మొత్తం 90 మార్కులకు పరీక్ష ఉంటుంది. 7, 8 తరగతుల స్థాయిలో సోషల్, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఈ పేపర్‌కు కూడా నెగెటివ్ మార్కింగ్ ఉండదు. మ్యాట్, శాట్ పరీక్షల్లో కనీసం 40 శాతం మార్కులతో అర్హత సాధించాలి. ఎస్సీ, ఎస్టీలు 32శాతం సాధించాలి.

రెండు భాగాల్లో జరిగే పరీక్ష మొత్తం 180 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 180 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు.

రెండు భాగాలు. పార్ట్-1లో 90, పార్ట్-2లో 90 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో పార్ట్ వ్యవధి 90 నిమిషాలు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 4 ఆప్షన్లు.

పార్ట్-1 మెంటల్ ఎబిలిటీ టెస్టు: వెర్బల్, నాన్ వెర్బల్ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. రీజనింగ్, క్రిటికల్ థింకింగ్ నైపుణ్యాలను పరీక్షిస్తారు. అనాలజీ, క్లాసిఫికేషన్, న్యూమరికల్ సిరీస్, ప్యాటర్న్ పర్సెప్షన్స్, హిడెన్ ఫిగర్స్...మొదలైన అంశాల్లో వీటిని అడుగుతారు.

పార్ట్-2 స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్టు: ఫిజిక్స్-12, కెమిస్ట్రీ-11, బయాలజీ-12, మ్యాథ్స్ -20, హిస్టరీ-10, జాగ్రఫీ-10, పొలిటికల్ సైన్స్-10 ఎకనామిక్స్ -5 చొప్పున ప్రశ్నలు వస్తాయి. ఇందులో సైన్స్, సోషల్, మ్యాథ్స్ ప్రశ్నలు 7,8 తరగతుల సిలబస్ నుంచి అడుగుతారు.

ఇలా అర్హులైన విద్యార్థుల జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం స్కాలర్‌షిప్పులకు ఎంపిక చేస్తారు. ఈ స్కాలర్‌షిప్పు కొనసాగాలంటే ప్రతి తరగతిలోనూ నిర్దేశిత మార్కులు సాధించడం తప్పనిసరి. వీరు పదో తరగతిలో కనీసం 60 (ఎస్సీ, ఎస్టీలు 55) శాతం పొందితేనే స్కాలర్‌షిప్పు కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో డిసెంబర్ 8న, తెలంగాణాలో నవంబర్ 24న ఈ పరీక్ష జరగనుంది.

మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోండి

జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలు పొందాలంటే విద్యార్థినీ విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని విద్యార్థినీ విద్యార్థుల కోసం నేను ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ రూపొందించాను. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి విద్యార్థులు పరీక్ష రాసేలా ప్రోత్సహిస్తున్నాం. ఏటేటా మేమిచ్చే ప్రత్యేక స్టడీ మెటీరియల్, ప్రత్యేక తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా తల్లిదండ్రులకు భారం కాకుండా ముందుకు సాగుతున్నారు. పరీక్షలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్తీర్ణులయ్యేలా మంచి మెటీరియల్‌ను సిద్ధం చేసి 2 లక్షల వరకూ కాపీలను పంచాము. చక్కగా ప్రిపేరయ్యి ఈ పరీక్షలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాం.

కళ ఎందుకంటే- అన్నం ఎందుకు?
అన్నం ఆకలిని తీరుస్తుంది.
కళ మనసులోని ఆకలిని తీరుస్తుంది.
మనిషి అంటే కేవలం శరీరం కాదు కదా!
మనసు కూడా! మనిషి బుద్ధి జీవి మాత్రమే కాదు;
హృదయజీవి కూడా.

- సంజీవ్‌దేవ్

గుడిలో చావు

ఒక్కసారిగా మృత్యువు
గుంపుకట్టి మీద పడుతుందని
మెట్లదారికి తట్టలేదు
ఏకాదశి పుణ్యకాలం
ఎకాయెకిన తొక్కుకుంటూ వస్తుందని
ఏ ప్రవచనకర్తా ప్రకటించలేదు
టెంపచేతితో రాయిబెడ్డ పట్టి
గురిచూసి పొద్దుపండునే రాలగొట్టినట్టు
విపత్తులేవైనా ఎక్కువలో ఎక్కువ
ఆడప్రాణాల్నే నేలకూలుస్తాయెందుకో
ఏ ముందస్తు హెచ్చరిక వ్యవస్థా గుర్తించలేదు!

ఢిల్లీకి వారధి కట్టగలిగేటన్ని
పచ్చని కాంతులు గుప్పిట్లో ఉన్నా
గుడి కట్టడానికే కట్టుబడ్డ ధర్మకర్తకి
మందిని మలిపే ఒక్క దారే కనిపించింది
వచ్చే పోయే రెండు మార్గాల ఊసే పట్టలేదు
ఆ ముసలి గుండె విశ్వాసాల
రెయిలింగ్ విరిచేసి, భక్తిమెట్లను తొక్కి
ఉన్మాదమే ఆరాధనౌతుందని కూడా
ఊహించలేదేమో..!

ఎన్ని పూలసజ్జలు చేజారి పడ్డాయో..
ఎన్ని మొక్కులు నుసిమేయబడ్డాయో..
కర్కశ పాదాల కింద నలిగిన లేత ఊపిరి
తోడి చావుకొడుకై పుల్లెంటెల్లిందనీ
నుజ్జు నుజ్జై పేగుబంధాలు పాడెక్కాయనీ
సంతాప సూచకంగా ఏ ఒక్క కోవెల
దీపమైనా కొండెక్కిందా..?

గుడిలో చావుకి మరో పేరు లేదు
మూక మౌఢ్యాల వేదిక వేడుక కాదు
ఎలా మొదలైందో తెలీదు ఈ వేలంవెర్రి
ఇంకెంత బీభత్స స్థాయిల్ని తాకుతుందో
ఇప్పుడప్పుడే తేల్చలేం కూడా!
ఎగిరే జెండాకూ ఎగరేసే గాలికీ
ఇక్కడ నిర్వేతుక పొత్తులుంటాయి
అపరాధం ఎవరిదని అడగడానికి లేదు

ఉనికిలో లేని ఊపిర్ల కోసం
ఎంత వాదించినా
ఏ తీర్పూ ముద్దాయిని నిర్ధారించదు
బాధితుల నెత్తిమీద కాలుమోపే నెపం
ఏ నేరానికీ ప్రతిష్ఠా భంగం కలిగించదు
పరిహారం ఇవ్వడం ఒక కనీస కన్ఫెషన్
అంత్యక్రియలే అంతిమ పరిష్కారం
ఇప్పటికైతే ఒక విషాదంతో పాటు
ఒక నేరం మట్టిలో కలిసిపోయినట్టే!

రేపు మరో గుడి ప్రారంభోత్సవం..

- కంచరాన భుజంగరావు

9441589602

బాలి యాత్ర

అడవిలో వేటకు ఉపక్రమించేప్పుడు
మృగ వాగ్దానంలా
తొలకరించిన పొలి కారు వేళ
తొలి నారు నాటుడులా...
బాలి యాత్ర అంటే మరేమీ కాదు,
ఉత్కళ కడలి వాకిట్లో జరిగే
వార్షిక జల జాతర...
బరులు గీసుకొన్న బహుళ జాతి నౌకల మధ్య
బారులు తీరిన దీపాల జ్వాలాపన!
ఉత్తుంగ కళింగ కెరటాల్లో
ఉప్పొంగే తెరచాపల శిరోచాలనా కలాపం
నాగరికతని నడిపించిన నాగావళీ పరివాహకంలో
సైకత సంగమ నృత్య భంగిమ
చుక్కానుల చూపులై మ్యాపుల్లో
శిరస్సులు దాచుకొనే
గంభీర సరంగులందరూ
సంబరాల సాంబశివులైన శుభ సందర్భం
దేశ దేశాల జెండాల జడల్లోని పూల నడుమ
పడవల వడ్డాణం చుట్టిన మహాస్సాగర సభ
అశ్వ ఘోషుడి గిట్టల కింద
నలిగిన నెత్తుటి మట్టినుంచీ
విత్తుకొచ్చిన రావి చెట్టు
ప్రాకృత లిపిలో
ప్రకృతికి ప్రేమ లేఖ రాసే
అపురూప అపర్ణాహం
అశోకుని సిగపాగాలో దూరిన
మిన్నాగై బుస కొట్టిన మౌర్యపుత్రుల పగ
మౌన తంబురాలు మోగిస్తూ
బౌద్ధాన్ని శరణు వేడిన
రణ విరమణోత్సవం!
ఎన్నో తుపానుల దాడిలో
ఏకైక విజేతగా నిలబడ్డ
ఓడ రేవు ఒడ్డున
ఒంటరి నావికుడి నవ్వు!
తూరుపు తిన్నెల తిరునాళ్లలో
కార్తీక దొన్నెల్లో కదలాడే పున్నమి పులకింత!
(శ్రీముఖలింగం రేవులో పునః ప్రారంభమైనవేళ)

- డా. సుదేరా
97013 47080

ఆశు కవితాఝరి అందెశ్రీ

నివాళి



కొన్ని నెలల క్రితం దీర్ఘాసి విజయభాస్కర్ నుంచి నాకు ఫోన్ కాల్ వచ్చింది. "నీతో అందెశ్రీ గారు మాట్లాడతారు" అని చెప్పి వారికి ఫోన్ ఇచ్చారు. "విజయభాస్కర్ గారు మీ గురించి, మీ పెయింటింగ్స్ గురించి చెప్పారు. చాలా సంతోషం బ్రదర్. సాహిత్యంపై ఉన్న ప్రేమతో 'వాక్కులమ్మ ప్రచురణలు' అనే సంస్థను స్థాపించాను. దాని ద్వారా వంద పుస్తకాలు ప్రచురించాలని నా ఉద్దేశం. ఇప్పటివరకు 'నిప్పుల వాగు' (తెలంగాణ ఉద్యమ సాహిత్యం), 'శూద్ర గంగ' (సుద్దాల అశోక్ తేజ రచన) 'హసిత భాష్పాలు' (శ్రీరామ్) ముద్రించాను. నాల్గవ పుస్తకంగా దీర్ఘాసి విజయభాస్కర్ గారి ఉపనిషత్తుల 'సృష్టి గర్భ' ముద్రించాలని అనుకుంటున్నాను. దానికి మీరు ముఖచిత్రం గీయాలని నా కోరిక." అన్నారు. దానికి నేను సంతోషంగా ఒప్పుకొని, హైదరాబాద్ వచ్చినప్పుడు తప్పకుండా కలుస్తానని చెప్పాను. వారు కోరిన విధంగా ఆ పుస్తకానికి కవర్ పేజీ వేయడం, పుస్తకం ఆవిష్కరించడం జరిగాయి. ఆయనను నేను కలవాలన్న కోరిక తీరకుండానే ఆయన ఇకలేరన్న వార్త వినాల్సి వచ్చింది.

తెలంగాణ మట్టి పరిమళాన్ని, అక్కడి ప్రజల ఆర్తిని తన గొంతులో పలికించిన అరుదైన వాగ్గేయకారుడు డాక్టర్ అందెశ్రీ. పశువుల కాపరి స్థాయి నుంచి విశ్వవిద్యాలయాల పాఠ్య పుస్తకాల్లో పాఠ్యాంశంగా మారిన ఆయన జీవితం ఒక అద్భుత ప్రయాణం. నిరక్షరాస్యుడిగా మొదలై, ప్రజాకవిగా, తెలంగాణ రాష్ట్ర గేయ రచయితగా ఎదిగిన ఆయన ప్రస్థానం ఒక గొప్ప స్ఫూర్తి పాఠం.

అందెశ్రీ అసలు పేరు అందె ఎల్లయ్య. సిద్దిపేట జిల్లా జనగామ సమీపంలోని రేబర్తి గ్రామంలో ఒక నిరుపేద దళిత కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులను కోల్పోయి, అనాథగా మిగిలిపోవడం వల్ల ఆకలి ఆయనకు మొదటి గురువు అయింది. పొట్టకూటి కోసం పశువుల కాపరిగా మారారు. చెట్లు, పక్షుల కిలకిలారావాలు, సెలయేళ్ళ గలగలలు నేస్తాలయ్యాయి. ప్రకతిని గమనించడం, సమాజాన్ని పరిశీలించడం ద్వారానే ఆయన జీవిత సత్యాలను గ్రహించారు. అదే ఆయనలోని కవిత్వానికి తొలి బీజం వేసింది. ఆయన విద్యాభ్యాసం జీవితమనే విశాలమైన విశ్వ విద్యాలయంలో జరిగింది.

సాంప్రదాయ అక్షర జ్ఞానం లేకున్నా కొత్త విషయాలను నేర్చుకోవాలన్న ఆకాంక్ష ఆయనలో బలంగా ఉండేది. చిన్నప్పుడే జగ్గిరెడ్డి మల్లారెడ్డి ద్వారా రామాయణ, మహాభారత ఇతిహాసాలు, భాగవత కథలు, పురాణ గాథలను విని సారాంశాన్ని వంటబట్టించుకున్నారు. 'శరీరం మీద తెల్లని గుడ్డలు లేకపోతే సంఘం గౌరవించదురా' అని మునీర్ సేటు అనే వ్యక్తి చెప్పిన మాటలు బతుకుపై ఒక స్పష్టతను, పట్టుదలను ఇచ్చాయి.

అందెశ్రీ ఏకసంథాగ్రాహి. విన్నదాన్ని వెంటనే గ్రహించి, తనదైన శైలిలో తిరిగి చెప్పగల శక్తి ఆయన సొంతం. యక్షగానాలు, చిందులు, భాగవతాలు వంటి జానపద కళలను చూస్తూ, వాటిలోని లయను, మాండలిక సొగసును ఔపోసన పట్టారు. నిజామాబాద్ వెళ్ళి అక్కడ తాపీ మేస్త్రీగా, కూలీగా పనిచేశారు. ఈ క్రమంలో శంకర్ మహారాజ్ అనే సాధువు ఎల్లయ్యలోని అద్భుతమైన కవితా శక్తిని, గొంతులోని మాధుర్యాన్ని గుర్తించారు. 'అక్షరం నీ శరీరంలో నిలువెల్లా ధ్వనిస్తోంది. నువ్వు సామాన్యుడివి కాదు.' అని పేరును 'అందెశ్రీ'గా మార్చారు.

అందెశ్రీని జీవితాంతం పేదరిక ప్రభావం వెంటాడింది. కుమారుడు, కుమార్తె మరణం, రెండో కుమారుడికి వచ్చిన జబ్బు ఆయనను మానసికంగా కంగదీశాయి. ఐదేళ్ల పాటు కొడుకును చేతుల మీద ఎత్తుకొని, చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ సర్వస్వం కోల్పోయారు. ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక 1991లో భార్యాపిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకొని, విషం కూడా తెచ్చుకున్నారు. ఆ సమయంలో ఆయన అంతరాత్మ నుండి ఒక పాట పెల్లుబికింది. "నిన్ను చూడకుండా నిలువ... తెలిసిందీ నీ విలువ... సాగే జీవన సమరంలో" అంటూ సాగి, ఆయనలో ధైర్యాన్ని తట్టిలేపింది. బతికి తీరాలన్న పట్టుదలను ప్రసాదించింది. డాక్టర్ రామకృష్ణారెడ్డి అందించిన సహాయం కూడా కొండంత అండగా నిలిచింది.

మొదట్లో భక్తి, ఆధ్యాత్మిక గీతాలు రాసిన అందెశ్రీ క్రమంగా ప్రజా సమస్యల వైపు మళ్లారు. గద్దర్, వంగపండు వంటి ప్రజాకవుల ప్రభావం, నాటి సామాజిక ఉద్యమాల ప్రేరణ ఆయనను ప్రజాకవిగా మలిచాయి. మనిషిలోని స్వార్థాన్ని, మానవీయ విలువల పతనాన్ని ప్రశ్నిస్తూ ఆయన రాసిన 'మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడు' పాట చాలా గుర్తింపు పొందింది. కులమతాలకు అతీతంగా మనిషిని మనిషిగా చూడాలన్నది ఆయన తపన, తాత్వికత. తెలంగాణ మలిదశ ఉద్యమంలో అందెశ్రీ మాట, పాట ఎంతో ప్రభావం చూపాయి. 2002 సెప్టెంబర్ 30న కామారెడ్డిలో జరిగిన ధూంధాం వేదికపై ఆశువుగా ఆయన గొంతు నుంచి జాలువారిందే 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం'. ఇందులో నాటి తెలంగాణలో జిల్లాల విశిష్టతను, నదులను, కవులను, చరిత్రను, సంస్కృతిని, భౌగోళిక విశేషాలను, పోరాట పటిమను అద్భుతంగా ఆవిష్కరించారు. 2024లో తెలంగాణ ప్రభుత్వం దీనిని రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించింది.

అందెశ్రీ చలనచిత్ర రంగంలో కూడా తనదైన ముద్ర వేశారు. దాదాపు 21 సినిమాలకు పాటలు రాశారు. 'గంగ', 'కొమరం భీమ్' వంటి సినిమాల్లో ఆయన రాసిన పాటలు అన్ని తరగతుల శ్రోతలను మెప్పించాయి. సినిమా ద్వారా కీర్తి వచ్చినా తన మూలాలను, మట్టి మనుషులను ఆయన మర్చిపోలేదు. "నా కవిత్వాన్ని అమ్ముకోను, నా కవిత్వమే నాకు ఆస్తి" అని గర్వంగా ప్రకటించిన స్వాభిమాని ఆయన. పాండిత్యం కేవలం పండితుల సొత్తు కాదని, అది ప్రజల నుండి, ప్రకతి నుండి వస్తుందని ఆయన నిరూపించారు. కాకతీయ విశ్వవిద్యాలయం (2008) ఆయనను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. 'గంగ' సినిమాలోని పాటకు గాను నంది అవార్డు (2006) అందుకున్నారు. ఇతరుల రచనలను కూడా వెలుగులోకి తేవడానికి 'వాక్కులమ్మ ప్రచురణలు' అనే సంస్థను స్థాపించారు. తెలంగాణ ఉద్యమ సాహిత్యాన్ని, కవుల రచనలను ప్రచురించడం ద్వారా సాహిత్య సేవ చేశారు. వంద పుస్తకాలను ప్రచురించాలన్న ఆయన కల నాలుగు ప్రచురణల వద్దే ఆగిపోయింది. "నేల మీద గొడవ ఉన్నది కాబట్టి, నాకు ఇక్కడ పోవాలని ఉన్నది. గాలి తరగల్లాగా లేచిపోయి నేల మీద వాలడమే నా పని." అన్నారు అందెశ్రీ. తన మూలాలకు, తాను వచ్చిన సమాజానికి కట్టుబడి ఉంటానని, తన కవిత్వం ఎప్పటికీ ప్రజల పక్షానే నిలుస్తుందని ఆయన చేసిన ప్రతిన ఇది. "చదువు అంటే అక్షరాలు దిద్దడం కాదు, అనుభవాలను ఆలింగనం చేసుకోవడం. మనిషిగా బతకడం. ప్రకృతి కవిగా, ప్రజాకవిగా, దార్శనికుడిగా జీవించిన డాక్టర్ అందెశ్రీ 2025 నవంబర్ 10 సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటు. ఆయన భౌతికంగా దూరమైనా ఆయన సష్టించిన సాహిత్యం శాశ్వతంగా నిలిచి ఉంటుంది.

- రేగుళ్ళ మల్లికార్జునరావు,
సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్,
94916 59899

కథ లోతులను స్పృశించిన కథాంతరంగం

"క" ఒక అక్షరం, 'థ' కూడా ఒకే అక్షరం. విడివిడిగా దేనికి అర్థం లేదు. ఈ రెండు అక్షరాల మధ్య దూరాన్ని ఎంత బాగా తగ్గిస్తే అంత గాఢమైన కథ తయారవుతుంది." డాక్టర్ లంక శివరామ ప్రసాద్ కథ గురించి చెప్పిన మాటలివి. లక్షల సంఖ్యలో కథలొచ్చుంటా యిప్పటికి. వాటిని కోట్ల సంఖ్యలో పాఠకులు చదివి వుంటారు అందరూ ఒకే తీరున చదువుతున్నారా? ఒకేలాగా అర్థం చేసుకుంటు న్నారా? రచయిత చెప్పాలనుకున్న విషయాన్ని, చెప్పలేకపోయిన అంశాన్ని పట్టుకోగలుగు తున్నారా? ఎంత మంచి ఇతివృత్తమున్నా కొన్ని కథలు ఎందుకు పాఠకులను రాబట్టుకోలేక పోతున్నాయి? రచయితలు కూడా పాఠకులే కదా, రచయితలు కథను ఎలా చదవాలి? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడానికి ఖమ్మం ఈస్తటిక్స్ సాహితీ మిత్రులు రవి మారుత్, సీతారాం, వంశీకృష్ణ మరికొందరు కలిసి, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఓ నలభై మంది రచయితలను పోగేసి, కథాంతరంగం పేరుతో నవంబర్ 8, 9 తేదీల్లో మేథోమథనం జరిపారు. ఈ నలభై మందిలో సుదీర్ఘ రచనానుభవం ఉన్న కుప్పిలి పద్మ మొదలు ఇటీవలే రాస్తున్న దర్పణం శ్రీనివాస్ వరకు, 70కి దగ్గరగా ఉన్న రాసాని మొదలు యువ తరంగం కడలి వరకు భిన్న తరాలు, వైవిధ్య రచనానుభవం ఉన్న రచయితలు పాల్గొన్నారు.

నాలుగేళ్ల నుంచి కథా, కవిత విభాగాల్లో 'ఖమ్మం ఈస్తటిక్స్' వారు సాహిత్య పురస్కారాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహిం చిందే ఈ కథాంతరంగం! ఇందుకోసం కొంతమందికి ముందుగానే ఫోన్ చేసి పాల్గొనమని ఆహ్వానించారు రవిమారుత్. అంగీకరించిన వారిని కథాంతరంగం పేరుతో ఓ వాట్సప్ సమూహంలో కలిపారు. ఆరు కథలను ఆ సమూహంలో పోస్ట్ చేసి, అందరినీ చదువుకు రమ్మన్నారు. ఈ హోమ్ వర్క్ అంతా పూర్తయి, నవంబరు 8, 9 అంటే రెండో శనివారం, ఆదివారం రోజుల్లో అసలైన క్లాసులు మొదలయ్యాయి. ఖమ్మం సెడార్ వ్యాలీ స్కూల్ ప్రాంగణం వేదికగా జరిగిన ఈ సంబరంలో...

ఆ ఆరు కథలు : పరావర్తనం (శ్రీ ఊహ), ఇన్‌స్టంట్ లైఫ్ (కుప్పిలి పద్మ), జుమ్మేకి రాత్ మే (పెద్దింటి అశోక్ కుమార్), దేవ్లీ (రుబీనా పర్వీన్), గోధుమరంగు ఊహ (వంశీకృష్ణ), ఆపా (ఖదీర్ బాబు)

ఆరు టేబుళ్లు: శిల్పం, సృజన, రూపం, ఇతివృత్తం, కథనం, సారం.అర్థవంతంగా పేర్లు పెట్టిన ఒక్కో టేబుల్ చుట్టూ ఆరేసి మంది కథకులు. పైన చెప్పిన ఆరు కథలను ఒక్కో కథను వాళ్ళు ఎలా చదివారో చెప్పారు. ఎలా అర్థం చేసుకున్నారో విడమరిచారు. కథలోని మంచి చెడు విశ్లేషించారు. కథలో చెప్పినదేంటో, చెప్పీ చెప్పకుండా చెప్పినదేంటో, చెప్పకుండా వాక్యాల మధ్య దాచినదేంటో, కథకు ఆవల ఎంత కథుందో... కథలో శైలీ, శిల్పం సరిగ్గా కుదిరాయా, కథకు పాఠకుణ్ని తనవెంట లాక్కెళ్లే గుణముందా... ఇలా ఆరు టేబుళ్లు ఆరు సాగరాలై కథామథనం వేదికలయ్యాయి.

ఎనిమిదో తేదీన పరావర్తనం, ఇన్‌స్టంట్ లైఫ్, జుమ్మేకి రాత్ మే కథల మీద; తొమ్మిదో తేదీన దేవ్లీ, గోధుమరంగు ఊహ, ఆపా కథల మీద చర్చోపచర్చలు జరిగాయి. ప్రతి కథ మీద చర్చ పూర్తయ్యాక ఒక్కో టేబుల్ నుంచి ఒక్కొక్కరు వారి మథనం సారాంశాన్ని వివరించారు. తప్పిపోయిన భర్తీలను మోడరేటర్లు పూర్తిచేశారు. 'పరావర్తనం' కథకు సీతారాం, 'ఇన్‌స్టంట్ లైఫ్'కు వంశీకృష్ణ, 'జుమ్మేకి రాత్ మే' కథకు కుప్పిలి పద్మ, 'గోధుమరంగు ఊహ'కు ప్రతిమ, 'దేవ్లీ' కథకు ఒమ్మి రమేష్ బాబు, 'ఆపా' కథకు డాక్టర్ ఎల్.ఎస్.ఆర్. ప్రసాద్ మోడరేటర్లుగా వ్యవహరించారు.

ఈ మథనం ద్వారా కథకులు తాము ఇదివరకే రాసిన కథలను ఆత్మ పరిశీలన చేసుకున్నారు. ఎలా రాయచ్చునో అభ్యాసం చేసుకున్నారు. ఈ చర్చ వల్ల కథా నిర్మాణానికి సంబంధించిన అంశాలను కూలంకషంగా అర్థం చేసుకునే అవకాశం కలిగింది. చిన్నచిన్న పొరబాట్లను సరిదిద్దుకునే అవగాహన కలిగింది. గంటలకొద్దీ ఉపన్యాసాలు, ఏకపక్ష ప్రసంగాలు కాకుండా, అందరూ చర్చలో పాల్గొనడానికి, ప్రతి ఒక్కరూ మాట్లాడటానికి వేదికగా ఈ కార్యక్రమం రూపొందించారు. అందువల్ల పాల్గొన్నవారికి ఎక్కడా విసుగనిపించలేదు. చర్చకు పెట్టిన కథలను రాసిన కుప్పిలి పద్మ, శ్రీ ఊహ, వంశీకృష్ణ ప్రత్యక్షంగా పాల్గొని, కథ రాసిన అనుభవాన్ని పంచుకోవడం మరింత ఉత్సాహాన్నిచ్చింది. కథకులు ఎదురుగా ఉన్నా, లేకపోయినా ప్రతివొక్కరూ నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలను, విమర్శను వ్యక్తం చేయడం, దానిని కథకులు సహృదయంతో స్వీకరించడం మంచి వాతావరణం.

ఎనిమిదో తేదీ సాయంత్రం పాఠశాల ప్రాంగణంలోని సాంస్కృతిక వేదిక వద్ద చేరిన పార్టిసిపెంట్స్ పిల్లలయిపోయి పాటలు, పద్యాలు, షాయిరీలు పాడుకుంటూ హుషారు పడ్డారు. దర్పణం శ్రీనివాస్ పాడిన మునయ్య రాయలసీమ జానపద గీతాలు, సామల రమేష్, తగుళ్ళ గోపాల్ పాడిన తెలంగాణా పల్లెపదాలు, రేణుకా అయోలా గజల్స్, పలమనేరు బాలాజీ చదివి వినిపించిన కవిత్వంతో సహా నవ్వుల జల్లులు, చమత్కారాలతో ఆ సాయంత్రం ఆహ్లాదంగా గడచిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల నుంచి పలమనేరు బాలాజీ, దేశరాజు, ముని సురేష్ పిళ్లై, జి.ఉమామహేశ్వర్, రేణుక అయోలా, రమేష్ సామల, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, ఫణిమాధవి, కన్నోజు, ప్రగతి, శ్రీనివాస్ సూఫీ, ధరణికోట రమేష్ సహా యువ ప్రతినిధులుగా కడలి, తగుళ్ల గోపాల్, మువ్వా జయశ్రీ, అరుణ కుమార్ ఆలూరి, కె.వి.మేఘనాథ్ రెడ్డి, సుధామురళి, స్వప్న చార్వాక్, ఝాన్సీ పాపుదేశి, శీలం సురేంద్ర, తోట సుభాషిణి తదితరులు ఈ చర్చలో పాల్గొని వివిధ సందర్భాల్లో తమ స్వరం వినిపించారు. తొమ్మిదో తేదీ సాయంత్రం ఖమ్మం జిల్లా పరిషత్ హాలులో పురస్కారాల సభ జరిగింది. ఈ సంవత్సరం పలమనేరు బాలాజీ 'లోపలేదో కదులుతున్నట్టు' కవితా సంపుటికి పురస్కారం అందుకున్నారు. రేణుకా అయోలా 'రవిక' కవితాసంపుటికి, పాయల మురళీకృష్ణ 'గచ్చెంసెట్టుకి అటూయిటూ' కవిత్వానికి ప్రోత్సాహక పురస్కారాలు అందుకున్నారు. కథల విభాగంలో వి.ఆర్. రాసాని 'తేనెకల్లు' కథకు ప్రథమ బహుమతి (రూ.25 వేలు), ఆలూరి అరుణ్ కుమార్ 'అంజమ్మ' కథకు ద్వితీయ బహుమతి (రూ.15 వేలు), యాములపల్లి నర్సిరెడ్డి 'కావలి' కథకు తతీయ బహుమతి (రూ.10 వేలు) అందుకున్నారు. వీటితో పాటు మరో తొమ్మిది కథలతో ప్రచురించిన ఖమ్మం ఈస్తటిక్స్-2025 కథల సంకలనాన్ని డాక్టర్ ఎల్.ఎస్.ఆర్.ప్రసాద్ ఆవిష్కరించారు. ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి శ్రమించి, జయప్రదంగా ముగించిన ఖమ్మం ఈస్తటిక్స్ మిత్రులు రవిమారుత్, ప్రసేన్, సీతారాం, వంశీకృష్ణ, ఇతర మిత్రులకు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరికీ వందనాలు.

నివేదిక : ఎం.ప్రగతి
94407 98008

నాటికల నవజీవన సందేశం

రంగస్థలం

నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్య కళారూపం. సకళ కళల సమాహారమే నాటకం. మానవ జీవితాలకు సంబంధించిన అన్ని కోణాలను యథార్థంగా సరైన కొలతలతో సమగ్రంగా చూపించగల కళాప్రక్రియ నాటకం మాత్రమే. నాటకమంటే ఒక నమ్మకం. నాటకమంటే ఒక విశ్వాసం. నాటకమంటే ఒక ధ్యేయం. నాటకమంటే ఒక భరోసా. నాటకమంటే ఒక వాస్తవం. నాటకమంటే సమాజ సమస్త ప్రయోజనాలను అందించే ఒక హామీపత్రం. ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో వుంటూ, ఒకప్పుడు ఎర్రబడ్డ ఆకాశాన్ని తనమీద అంగవస్త్రంగా కప్పుకున్న పెద మేరంగి గ్రామంలో 7, 8, 9 నవంబరు 2025 తేదీల్లో 'మేరంగి నాటక పరిషత్' పేరున ఉభయ తెలుగు రాష్ట్రాల తృతీయ ఆహ్వాన నాటికల పోటీలను నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో ప్రదర్శించే నాటికలను చూడటానికి ఆ గ్రామ కుటుంబాలకు కుటుంబాలు కలిసి రావడం, ఎంతో స్ఫూర్తిదాయకాన్ని అందించింది.

మొదటి రోజు ఈ నాటిక పోటీలు చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం' నాటికతో ప్రారంభమయ్యాయి. భార్యాభర్తల అనుబంధాన్ని కేంద్ర బిందువుగా తీసుకొని మలిచిన ఈ నాటికలో ఒక వేశ్య ద్వారా భార్యాభర్తల మధ్యన ఉండవలసిన అనురాగానికి కొత్త బీజాలను మొలకెత్తింపజేసే సన్నివేశాలు చాలా ఆలోచింపజేశాయి. జబ్బుపడి, తాను ఏమాత్రం నడవలేని స్థితిలో భర్త నిరాదరణకు లోనై కుమిలిపోతున్న ఇల్లాలి పాత్రను, ఆమె కన్నీటిని తుడిచి, తిరిగి ఆమె తన భర్త ప్రేమను అపారంగా పొందటానికి కృషి చేసిన వేశ్య పాత్రను పోషించిన నటీమణులు పోటీ పడి నటించడంతో ఈ నాటిక మంచి ప్రదర్శన స్థాయిని అందుకుంది. రెండవ నాటికగా మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్, చిలకలూరిపేట వారు 'మా ఇంట్లో మహాభారతం' నాటికను ప్రదర్శించారు. హాస్యరసంతో సాగిన ఈ నాటికలో కులాలు, మతాలు ఈ కొలతలతో మనుషుల్ని కొలవకూడదనే సందేశాన్ని అందించారు.

రెండవరోజు మొదటి నాటికగా చైతన్య కళా స్రవంతి, ఉక్కునగరం, విశాఖ వారు 'అసత్యం' నాటికను ప్రదర్శించారు. అసత్యానికి దండోరాను వాయించే ఒక మూఢ నమ్మకాన్ని ఖండిస్తూ, అదే మూఢ నమ్మకం ద్వారా ఒక సత్యాన్ని బతికించటానికి చేసిన ప్రయత్నం ఈ నాటికలో చాలా ఉన్నతంగా ఆవిష్కరించబడింది. నటీనటులందరూ ఆయా పాత్రల్లో అతి సహజంగా నటించి, పాత్రలకు జీవం పోసి, దర్శకత్వ విలువలు ఉన్నతంగా సాగిన నేపథ్యంలో ఈ నాటికకు అందించిన నేపథ్య సంగీతం తన పాత్రను చాలా సమర్థవంతంగా పోషించడంతో ప్రదర్శన ఉన్నత స్థాయిని సొంతం చేసుకోగలిగింది. రెండవ నాటికగా ఉషోదయా కళానికేతన్, కట్రపాడు వారు 'గారడీ'ని ప్రదర్శించారు. వివిధ రంగాల్లో దళారులు చేసే గారడీలను ఎత్తిచూపే ప్రయత్నం ఈ నాటికలో జరిగింది. పాకిస్తాన్ ఉగ్రవాదులు, భారతీయ యువతను ఉపయోగించుకొని తమ కార్యకలాపాలను నిర్వహించే పద్ధతుల్ని చూపే ప్రయత్నం ఈ నాటికలో జరిగింది. మూడవ నాటికగా కళాభినయ విశాఖపట్నం వారు 'ఓ కాశీవాసి రావయ్య' నాటికను ప్రదర్శించారు. మనుషుల మధ్య ఆర్థిక సంబంధాలు ఎంత వికృతంగా మారి అసహ్యకర స్థితికి చేరుకుంటాయో చూపించే సన్నివేశాలను బలంగా పండించటానికి నటీనటులు చేసిన ప్రయత్నం అభినందనపూర్వకంగా వుంది.

చివరిరోజు గోవాడ క్రియేషన్స్, వనస్థలిపురం, హైదరాబాదు వారు 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటికను మంచిస్థాయిలో ప్రదర్శించారు. బాల్యంనుంచే ఆడపిల్లగా ప్రవర్తించే నైజాన్ని ఇష్టపడిన ఒక బాలుని కథ ఇది. తండ్రి అతని ప్రవర్తనకు విసుగు చెంది, ఇల్లు వదిలి వెళ్లిపోయినా, తల్లి మాత్రం తన బిడ్డ కోరికకు మద్దతుగా నిలిచి, ఆ పిల్లాడు పెద్దవాడై ట్రాన్స్ జెండర్‌గా మారి, తన చదువును కొనసాగిస్తూ, చివరికి ఐఎఎస్ అధికారి స్థాయికి చేరటానికి తల్లి ఆందించిన సహకారం చాలా ఉన్నతంగా ఈ నాటికలో చిత్రీకరించబడింది. వివిధ సన్నివేశాలలో తల్లిపాత్రను పోషించిన నటి హావభావాలు, అదే స్థాయిలో అమ్మాయిగా మారటానికి ఇష్టపడ్డ అబ్బాయి పాత్రను పోషించిన బాలనటుడి నటన చాలా విశేషంగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. నిజ జీవితంలో ట్రాన్స్ జెండర్‌గా మారి హర్షిణి పేరుతో జీవిస్తున్న వ్యక్తి ఈ నాటికలో ముఖ్య పాత్రను పోషించడం విశేషం.

మూడు రోజులపాటు పెద మేరంగి గ్రామంలో ప్రదర్శించిన నాటికలను వీక్షించిన తరువాత, కొన్ని నాటికలు ఉన్నత స్థాయిలో ప్రదర్శించబడినా, మరికొన్ని నాటికల ప్రదర్శనను, ఆయా సమాజాల వారు మరిన్ని జాగ్రత్తలతో వాటి స్థాయిని పెంచుకోవలసిన అవసరం బాగా కనిపించింది. ప్రదర్శనలకు హాజరవుతున్న ప్రేక్షకులు, గుణనిర్ణేతల స్థాయిలో నాటిక ప్రదర్శనలను విశ్లేషిస్తున్నారు. ప్రజా జీవితాలను, వర్తమాన విషయాలను, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే నాటిక ఇతివృత్తాలను, సహజత్వానికి పెద్దపీట వేసే ప్రదర్శనలను నేటికాలం ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. తమ జీవిత ప్రతిబింబాలను ఆయా నాటికల్లో చూసుకోవటానికి ఆతురత పడుతున్నారు. సమస్యల మూలాలను సమగ్రంగా చర్చించే నాటికల పట్ల తమ ఆనందాన్ని రెట్టింపు చేసుకుంటున్నారు. ఇవి లోపించిన నాటికలను ఆయా సమాజాల వాళ్లు ఎన్ని హంగులతో ప్రదర్శించినా అమవాస్య రోజున వెన్నెలను ఆశించినట్లే వుంటుంది. మంచి సాహిత్య సృజనకు మంచి సాహిత్య అధ్యయనం ఎలా అవసరమో, ఒక గొప్ప నాటక ప్రదర్శనకు గొప్ప గొప్ప నాటకాల ప్రదర్శనలను, సమాజాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. జాతీయస్థాయిలో వివిధ భాషల్లో వినూత్నంగా ప్రదర్శిస్తున్న ఆయా నాటక ప్రదర్శనల వైవిధ్యాన్ని, వాళ్ల అనుసరిస్తున్న సాంకేతిక విలువల్ని తెలుగు నాటక సంస్థలు తమ అంబుల పొదిలో చేర్చుకోవలసిన అవసరం చాలా ఉంది.

'మేరంగి పరిషత్' నిర్వహించిన ఈ నాటికల పోటీలో చైతన్య కళా స్రవంతి, ఉక్కునగరం, విశాఖ వారి 'అ సత్యం' నాటిక ఉత్తమ ప్రదర్శన బహుమతిని, గోవాడ క్రియేషన్స్, వనస్థలిపురం, హైదరాబాదు వారి 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక ద్వితీయ ఉత్తమ ప్రదర్శన బహుమతిని, చైతన్య కళాభారతి, కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శన బహుమతిని గెల్చుకున్నాయి. ఈ నాటిక పోటీలను నిర్వహించిన 'మేరంగి పరిషత్' నిర్వాహకుల కృషి చాలా మెచ్చుకోదగిన స్థాయిలో వుంది. నాటకరంగానికి అంకితమవుతున్న ఆ సభ్యుల చిత్తశుద్ధి వల్ల ఈ పోటీలు చాలా సంతృప్తికరమైన స్థాయిలో నిర్వహించబడ్డాయి. ఇదే సందర్భంలో ప్రత్యేక ప్రదర్శనగా పరిషత్ నిర్వాహక సభ్యులు కి.శే.ముప్పర్తి వెంకటరావు రచించిన 'మనిషి కన్న శవం మిన్న' నాటికను వినోదాత్మకంగా ప్రదర్శించి, మానవత్వానికి మించిన విలువలు మరేవీలేవనే సందేశాన్ని చాలా బలంగా అందించారు. రాత్రి ఎంత సమయం దాటినా సరే, ప్రదర్శించబడిన ప్రతి నాటికను చివరిదాకా చూసి, కళాకారులను ఆశీర్వదించిన ఆ గ్రామ ప్రజల సంస్కారం చాలా గొప్పది. మళ్లీ వచ్చే ఏడాది నిర్వహించే పోటీలకు ఇప్పుడే ఈ పరిషత్ నిర్వాహకులు సిద్ధం కావడం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది.

- డాక్టర్ కె.జి.వేణు,
98480 70084

గురజాడ సాంస్కృతిక సమాఖ్య కవితల పోటీ ఫలితాలు

గురజాడ వర్ధంతి సందర్భంగా గురజాడ సాంస్కృతిక సమాఖ్య సంస్థ (విజయనగరం) జాతీయస్థాయి కవితల పోటీ నిర్వహించింది. వీరిలో పొత్తూరి సీతారామరాజు, గంగవరపు సునీత, మహమ్మద్ అప్సర వలిషా, ఇనపకుర్తి చిన సత్యనారాయణ, చళ్లపిళ్ల శ్యామల గురజాడ ఉత్తమ కవితా పురస్కారానికి' ఎంపికయ్యారు. ఈనెల 30న విజయనగరంలో జరిగే సభలో బహుమతి ప్రదానం ఉంటుంది. ప్రముఖ సాహితీవేత్త పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ ఈ ఏడాది గురజాడ విశిష్ట పురస్కారాన్ని అందుకోనున్నారు.

నేడు విశాఖలో రచయితల అంతరంగం

ఈనెల 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయం పెద్దహాలులో అరసం సాహిత్యసభ జరగనుంది. రచయితల అంతరంగం కార్యక్రమంలో కవిత్వం గురించి రెడ్డిరామకృష్ణ, కథల గురించి ఎస్.హనుమంతరావు, నవల గురించి పెబ్బిలి హైమావతి, నాటకం గురించి బివి అప్పారావు ప్రసంగిస్తారు. దీనికిముందు ఎస్‌డివి అజీజ్ రచించిన 'అల్లూరి సత్యనారాయణరాజు' నవల ఆంగ్లానువాదం పుస్తకాన్ని ప్రముఖసాహితీవేత్త డాక్టర్ డివి సూర్యారావు ఆవిష్కరిస్తారు.

- ఉప్పల అప్పలరాజు, అరసం

22, 23 తేదీల్లో సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలు

ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ నిర్వహణలో నవంబరు 22, 23 తేదీల్లో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగుతాయి. ఈ ఉత్సవాలను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ ప్రారంభిస్తారు. పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవుతారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతలు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, డా.పాపినేని శివశంకర్, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీ (రాజమహేంద్రవరం) ఉపకులపతి ఆచార్య డి.మునిరత్నం నాయుడు, ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ అధ్యక్షులు ఆర్.డి.విల్సన్ అతిథులుగా హాజరవుతారు. నాలుగు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారు. పల్లెపాటలు, ఏకపాత్రలు, వివిధ కళారూపాల ప్రదర్శనలు, చిన్నారుల నత్యాలు, పుస్తకావిష్కరణలు కవి సమ్మేళనాలతో కార్యక్రమం రెండురోజులపాటు ఉదయం 9 నుండి రాత్రి 9 గంటలవరకు జరుగుతుంది. ఈ సందర్భంగా కథలు, కవితలు, కార్టూన్లపోటీలో ఎంపికైన రచనలతో జాతీయ సాంస్కృతిక ఉత్సవాల ప్రత్యేక సంచికను ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఆవిష్కరిస్తారు.

- కలిమిశ్రీ, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షులు

పెట్టుబడుల హబ్‌గా రాష్ట్రం

- టిడిపి ఎమ్మెల్యే రాము

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని పెట్టుబడుల హబ్‌గా మార్చడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ శ్రమ ఎనలేనిదని టిడిపి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నంలో జరిగిన సిఐఐ సమ్మిట్ చారిత్రాత్మకమని, దేశ, విదేశాల నుంచి, వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు వచ్చారని తెలిపారు.

వేల మందిని సమన్వయపరిచి సమ్మిట్ నిర్వహించడం చాలా అరుదైన విషయమన్నారు. జగన్ విధ్వంసకర విధానాలకు భయపడి రాష్ట్రం విడిచి వెళ్లిపోయిన రెన్యూ, హీరో ఫ్యూచర్స్, ఎబిసి వంటి కంపెనీలు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆకర్షితులై వచ్చారని చెప్పారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT: AMANGAL
O.S.NO. 63 OF 2025

Between:
Eslavath Manjula @ Ketavath Manjula ....Plaintiff.
And
Ketavath Kishan and others. .....Defendants.

To
D5. Munnangi Veera Sridhar Reddy S/o. Ankamma Reddy Aged about 56 years, occ.: Business, R/0.3-607, Undavalli, Guntur Rural, Guntur District, Andhra Pradesh - 522 501.

Please take notice that the plaintiff filed the above suit for partition and you may appear before the above court on **21-11-2025** at 10.30 a.m., either in person or through an authorized Advocate and answer the claim of the plaintiff, failing which the matter will be decided as per material available on record.

// BY ORDER//
V. Mahipal Reddy,
Advocate.
Office # 17-1-382/R/9/1,,
RTC Officers Colony, Karmanghat,
Champapet, Hyderabad-500 079.

NOTICE
IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT. AT: AMANGAL
I.A.No. 276 OF 2025
IN
O.S.NO. 63 OF 2025

Between:
Eslavath Manjula @ Ketavath Manjula ....Petitioner/Plaintiff.
And
Ketavath Kishan and others. .....Resds./Defendants.

To,
R5. Munnangi Veera Sridhar Reddy S/o. Ankamma Reddy Aged about 56 years, occ.: Business, R/0.3-607, Undavalli, Guntur Rural, Guntur District, Andhra Pradesh - 522 501.

Please take notice that the plaintiff filed the above suit for partition and you may appear before the above court on **21-11-2025** at 10.30 a.m., either in person or through an authorized Advocate and answer the claim of the plaintiff, failing which the matter will be decided as per material available on record.

// BY ORDER//
V. Mahipal Reddy,
Advocate.
Office # 17-1-382/R/9/1,,
RTC Officers Colony, Karmanghat,
Champapet, Hyderabad-500 079.

జర్నలిస్ట్ జైదీప్ హార్దికర్‌కు 'రామోజీ ఎక్సలెన్స్'

- మరో ఆరుగురికి పురస్కారం
- అవార్డుల ప్రదానోత్సవానికి ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, చంద్రబాబు, రేవంత్, ప్రముఖులు హాజరు

అవార్డు గ్రహీతలతో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, చంద్రబాబు, రేవంత్, వెంకయ్యనాయుడు తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ జర్నలిస్ట్ జైదీప్ హార్దికర్‌కు రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డు లభించింది. ఆయనతో పాటు మరో ఆరుగురు ఈ పురస్కారం అందుకున్నారు. రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకులు రామోజీరావు పేరిట ఏర్పాటు చేసిన రామోజీ ఎక్సలెన్స్ జాతీయ అవార్డుల ప్రధానోత్సవం ఆదివారం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ మాట్లాడుతూ సిబ్బందిలో రామోజీరావు టీమ్ స్పిరిట్ నింపేవారని తెలిపారు. దేశంలో ఎక్కడ విపత్తు వచ్చినా స్పందించేవారని అన్నారు. సమాజానికి స్ఫూర్తిగా నిలవడమే ఓ గొప్ప విజయమని, స్క్రిప్ట్‌తో వస్తే ఫస్ట్ ప్రింట్‌తో వెళ్లేలా రామోజీ ఫిల్మ్‌సిటీని తీర్చిదిద్దారని కొనియాడారు. ఎపి సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, నమ్మిన సిద్ధాంతాల కోసం రామోజీరావు దేనినైనా వదులుకునేవారన్నారు. రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ఆలోచన ఎంతో ప్రశంసనీయమని, ఆయన ఏర్పాటు చేసిన వ్యవస్థలు చిరస్థాయిగా ఉంటాయని చెప్పారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, మానవ సేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, కళ-సంస్కృతి, మహిళా సాధికారత, యూత్ ఐకాన్ విభాగాల్లో అవార్డులు ప్రకటించడం హర్షణీయమన్నారు. ప్రజల పక్షాన బలంగా పోరాడిన యోధుడు రామోజీరావు అని కొనియాడారు. ప్రతిపక్షం బలహీనంగా ఉంటే రామోజీయే ఆ పాత్ర పోషించారని చెప్పారు. రామోజీ స్ఫూర్తిగా తెలుగు భాష సంరక్షణ కోసం ప్రయత్నిస్తానని తెలిపారు. తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రామోజీ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని కుటుంబ సభ్యులు భావించడం ప్రశంసనీయమన్నారు. జరిగిన వాస్తవాలను ప్రజలకు అందించాలన్న స్ఫూర్తి.. ఈనాడు, ఇటివిలో కనిపిస్తుందన్నారు. హైదరాబాద్ నగరమంటే నాలుగు అద్భుతాలు గుర్తొస్తాయి. అందులో మొదటిది ఛార్మినార్, రెండోది గోల్కొండ, మూడోది హైటెక్ సిటీ, నాలుగోదే రామోజీ ఫిల్మ్‌సిటీ అని అన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ రామోజీరావు పేరిట ఏడు అవార్డులు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. అవార్డు గ్రహీతలంతా దీనిని ఓ బాధ్యతగా గుర్తించి సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మాట్లాడుతూ పత్రిక ద్వారా దేశాభివృద్ధికి రామోజీరావు విశేష కృషి చేశారని అన్నారు. రామోజీ గ్రూప్ సిఎండి కిరణ్ ప్రారంభోపన్యాసం చేశారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, బండి సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు

అమలా రూయా (గ్రామీణాభివ ద్ధి విభాగం), శ్రీకాంత్ బొల్లా (యూత్ ఐకాన్), మాధవీలత (సైన్స్ అండ్ టెక్నాలజీ), ఆకాశ్ టాండన్ (మానవసేవ), ప్రసన్న శ్రీ (కళ- సంస్కృతి), జైదీప్ హార్దికర్ (జర్నలిజం), పల్లవి ఘోష్ (మహిళా సాధికారత)

డిసెంబర్ 9 నుండి అమరావతి బాలోత్సవం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

అమరావతి బాలోత్సవం 8వ పిల్లల పండుగ డిసెంబర్ 9,10,11 తేదీలలో విజయవాడ మొగల్‌రాజపురం సిద్ధార్థ కళాశాలలో జరుగుతుందని బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్ కొండలరావు తెలిపారు. నగరంలోని బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం బాలోత్సవం -2015 పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 'పర్యావరణాన్ని కాపాడుకుందాం... మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం' అనే "థీమ్" ముందుకు తెస్తూ ఈ బాలోత్సవాన్ని జరుపుతున్నామని తెలిపారు. పోటీల సందర్భంగా ఇచ్చే అంశాలలోను, నిర్వహణలోనూ పర్యావరణం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. తరగతి గదిలో సిలబస్, పరీక్షలు, మార్కులు ఒత్తిడిలో ఉన్న విద్యార్థులు చదువుతో పాటుగా ఇతర అంశాలలో వారి ప్రతిభను, శక్తి సామర్థ్యాలు ప్రదర్శించే వేదికగా బాలోత్సవం జరుగుతుందని తెలిపారు. అకడమిక్, కల్చరల్ అంశాలలో 60 పోటీలు జరుగుతాయని, విద్యార్థులు 2వ తరగతి నుండి 10వ తరగతి వరకు సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పాల్గొంటారని చెప్పారు. విజయవాడ నగరం, ఎన్‌టిఆర్ జిల్లా, కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లా, ఏలూరు జిల్లాల పరిధిలోని 200 పాఠశాలల నుండి 15000 మంది విద్యార్థులు ఈ బాలోత్సవంలో పాల్గొంటున్నారని తెలిపారు. వివిధ రంగాలలో నిష్ణాతులుగా ఉన్న 200 మంది ఆర్గనైజర్లుగా, న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు బాలోత్సవం కమిటీ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో బాలోత్సవ బాధ్యులు ఎస్. విద్యా కన్నా, గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, వై సుబ్బారావు, కె వెంకట్, యువి రామరాజు, ఎస్ లెనిన్‌బాబు, జి నారాయణరావు, టి క్రాంతి పాల్గొన్నారు.



బాలోత్సవం -2015 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సహజ సంపద కార్పొరేట్లకు ధారాదత్తం

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్

ప్రజాశక్తి- నెల్లూరు

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం దేశంలోని సహజ సంపదను, వనరులను కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా ధారదత్తం చేస్తోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. ఆదివారం ఆయన నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. ఇటీవల బీహార్‌లో బిజెపి సాధించిన విజయం ప్రజల మద్దతుతో కాదని, కులం, మతం పేరుతో ప్రజలను చీల్చి కుట్రలు, కుతంత్రాలతో గెలుపొందని విమర్శించారు. ఎపిలోని కృష్ణపట్నం పోర్టు సహా దేశంలోని అన్ని షిప్‌యార్డులు, విమానయాన సంస్థలను అదానికి అప్పగిస్తోందని వివరించారు. జిఎస్‌టి పేరుతో ప్రజల నుంచి లక్షల కోట్ల రూపాయలను దోచుకొని ఇటీవల తగ్గించామంటూ సంబరాలు పేరుతో కర్నూలుకు ప్రధాని రావడం, ఆ కార్యక్రమానికి రాష్ట్ర సిఎం నారా చంద్రబాబు నాయుడు హాజరు కావడం విడ్డూరంగా ఉందన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడితో నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ఫెవికాల్ బంధం కంటే గట్టిబంధం ఉందని విమర్శించారు. ఆ బంధం వల్ల సమాజానికి నష్టమే తప్ప, లాభం లేదన్నారు. విశాఖపట్నానికి గూగూల్ వస్తుందని నరేంద్ర మోడి, చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ ఒకరిని మరొకరు పొగడ్తలతో ముంచేత్తుకుంటున్నారని, లక్ష కోట్ల రూపాయల పెట్టుబడితో వస్తున్న సంస్థకు 22 వేల కోట్లు రాయితీ ప్రకటించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ప్రపంచంలో ఎక్కడైనా ఒక సంస్థ స్థాపనకు పెట్టుబడిలో 5వ వంతు రాయితీ ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజాపాలనను విస్మరించి భూములను కార్పొరేట్లకు ధారదత్తం చేస్తున్నాయని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించడం దారుణమన్నారు. ఉపాధి హామీ పనుల బకాయిలు కోట్ల రూపాయల్లో పేరుకుపోయాయని, వాటిని చెల్లించాలని కోరుతూ పంచాయతీ కార్యాలయాల ముట్టడి, దిగ్బంధన కార్యక్రమాలను దేశవ్యాప్తంగా చేపట్టనున్నామని తెలిపారు. విలేకర్ల సమావేశంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కంకణల ఆంజేయులు, జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి అన్వర్ బాషా పాల్గొన్నారు.

విశాఖలో 50 అంతస్తుల ఐకానిక్ భవన నిర్మాణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖలోని మధురవాడ సమీప ప్రాంతంలో 50 అంతస్తుల ఐకానిక్ భవన నిర్మాణం త్వరలో చేపట్టనున్నట్టు రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి నారాయణ తెలిపారు. విఎంఆర్‌డిఎ ప్రాజెక్టుల ప్రగతిపై ఆయన విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ సమావేశ మందిరంలో ఆదివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పనులలో ఎటువంటి జాప్యం లేకుండా, కాంట్రాక్టర్లు కచ్చితమైన సమయపాలన పాటించేలా, నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏడు బృహత్తర రహదారుల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు.

విమానాశ్రయం ప్రారంభించే సమయానికి ఈ రహదారులు పూర్తిచేయాలని సూచించారు. బృహత్తర ప్రణాళిక రివిజన్ ప్రక్రియను ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని డిసెంబర్ నెలాఖరుకు కొన్ని పనులు, 2026 ఫిబ్రవరి నెలాఖరుకు మరికొన్నింటిని పూర్తి చేయాలని గడువు విధించారు. ఎల్‌ఆర్‌ఎస్, బిపిఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని, దీని ద్వారా సంస్థకు ఆర్థిక పరిపుష్టి లభిస్తుందని పేర్కొన్నారు. కొత్తవలసలో 120 ఎకరాలలో, శొంఠ్యాంలో 80 ఎకరాలలో చేపడుతున్న థీమ్ బేస్డ్ సిటీస్ నిర్మాణం, ల్యాండ్ పూలింగ్, పిపిపి ప్రాజెక్టుల స్థితిగతులను క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సమీక్షా సమావేశంలో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, విఎంఆర్‌డిఎ కమిషనర్ ఎన్ తేజ్ భరత్, జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ప్రణాళిక అధికారిని శిల్ప, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, జివిఎంసి ఉన్నతాధికారులు, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ ఓవరాల్ ఛాంపియన్ విజయనగరం

ప్రజాశక్తి- నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా విజయనగరం జిల్లా నిలిచింది. మండలంలోని కొండవెలగాడలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 12వ రాష్ట్ర స్థాయి మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీలలో విజయనగరం క్రీడాకారులు సత్తా చాటారు. ఉమెన్, మెన్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు. ఉమెన్స్ విభాగంలో బెస్ట్ వెయిట్ లిఫ్టర్‌గా కొండవెలగాడ క్రీడాకారిణి సుస్మిత నిలిచారు. మెన్స్ విభాగంలో కడప జిల్లాకు చెందిన రవిశంకర్ బెస్టు లిఫ్టర్‌గా సత్తా చాటారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నీలంశెట్టి లక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు బహుమతులు ప్రదానం చేశారు. త్వరలో గ్రామంలో ఏర్పాటు చేయనున్న జిమ్‌ని ఎమ్‌పి కలిశెట్టి పరిశీలించి అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. తొలుత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన క్రీడాకారిణి సత్యజ్యోతికి సంతాపం తెలిపారు.

AXIS BANK ప్లాట్ నెం.41, శేషాద్రి రోడ్, ఆనంద్ రావు సర్కిల్, బెంగళూరు-560009

డిమాండ్ నోటీసు

క్రింది రుణగ్రహీతలు బ్యాంకు నుండి పొందిన క్రెడిట్ సౌకర్యాల అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డిఫాల్ట్ అయ్యారని మరియు సదరు సౌకర్యాలు నాన్-పర్ఫార్మింగ్ అసెట్స్ మారాయని ఇందుమూలంగా నోటీసు ఇవ్వబడింది. సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13 (2) కింద వారి చివరి చిరునామాలకు నోటీసులు జారీ చేయబడ్డాయి, అయితే అవి చేరకుండానే వెనుదిగిరినవి మరియు అందువలన వారికి దీని గురించి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయబడింది.

క్ర సం	రుణగ్రహీత పేరు & చిరునామా	రుణం పొందిన ఆస్తి చిరునామా	నోటీసు తేదీ	బాకీపడిన బ్యాలెన్స్ (క్లెయిమ్‌చేసినది) రూ.
1	(1) శ్రీ సునీల్ బండారు తండ్రి శ్రీ రాధయ్య బండారు, నెం.16, మాతృశ్రీ నిలయ, 5వ మెయిన్, 5వ క్రాస్, జిఎం పాళ్య, బెంగళూరు ఈస్ట్-560075. **ఇక్కడ కూడా:** 2-44, విటిసి గంగవరం, గంగవరం ఉపజిల్లా, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523167. **ఇక్కడ కూడా:** ఫ్లాట్ నెం.301, 2వ అంతస్తు, శుభం గ్రాండ్, డోర్ నెం.1-31-20 దగ్గర, డోర్ నెం.258/ఏ& 258/ఏ 7బి, కొరిటెపాడు, ఎస్‌విఎన్ కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ -522002.	**ఆస్తి వివరణ. శ్రీ.సునీల్ బండారుకు చెందినది:** ఈ స్థిరాస్తి నివాస ఫ్లాట్-ఆంధ్రప్రదేశ్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎస్‌విఎన్ కాలనీలోని "సుభం గ్రాండ్" అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోని రెండవ అంతస్తులో ఫ్లాట్ నెం.301. ఈ ఫ్లాట్ కొత్తపాడులోని ప్లాట్ నెం.258/ఏ మరియు 258/ఏ7బి లో భాగం మరియు డోర్ నెం.1-31-20 సమీపంలో ఉంది. ఇది 1100 చ.అ.ల ప్లింత్ ఏరియాను కలిగి ఉంది, ఇందులో ఉమ్మడి ఏరియాలు మరియు మధ్య తరహా కార్ పార్కింగ్ స్థలం ఉన్నాయి. ఈ ఫ్లాట్ తూర్పున ఒక సాధారణ లిఫ్ట్, కారిడార్ మరియు మెట్ల సరిహద్దులుగా ఉన్నాయి: ఉత్తరం మరియు దక్షిణం వైపున ఓపెన్ గ్రౌండ్; మరియు పశ్చిమాన ఓపెన్ గ్రౌండ్ మరియు మునిసిపల్ రోడ్ రెండూ ఉన్నాయి. ఇది మొత్తం 335 చదరపు గజాలు 280.09 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 41.875 చ.గ.ల (లేదా 35.012 చ.మీ.ల) అనుబంధ స్థలం విభజించబడని మరియు పేర్కొనబడని వాటాతో ఉంది. ఈ స్థలం తూర్పున 30 అ.ల వెడల్పు గల రోడ్డు, దక్షిణాన లెనంపూడి శ్రీ లక్ష్మి ఆస్తి, పశ్చిమాన మరొక రోడ్డు మరియు ఉత్తరాన పిల్లోట్ల సుబ్బారావు కాంపౌండ్ వాల్ ఉన్నాయి. తూర్పు: ఉమ్మడి లిఫ్ట్, 6'6" వెడల్పు ఉమ్మడి కారిడార్, మరియు ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.302 మధ్య మెట్లు, దక్షిణం: గ్రౌండ్‌లో ఓపెన్ ఏరియా, పడమర: గ్రౌండ్ లో ఓపెన్ ఏరియా మరియు మున్సిపల్ రోడ్, ఉత్తరం: గ్రౌండ్‌లో ఓపెన్ ఏరియా. **ఏదైనా స్పష్టీకరణల కోసం, దయచేసి శ్రీ.ప్రేమ్ మొబైల్ నెం.8880041234 లో సంప్రదించండి.**	06.10.2025 ఎన్‌పిఎ తేదీ 08.02.2025	పవర్ హోమ్ వనిల్లా బిఆర్ఇ రుణ ఖాతా నెం: PHR16880 3883420. మొత్తం రూ. 31,53,904/- మొత్తం మొత్తం రూ. 30,36,873/- పవర్ హోమ్ వనిల్లా బిఆర్ఇ రుణ ఖాతా నెం: HTR0069 07022121, మొత్తం రూ. 8,90,000/- మొత్తం మొత్తం రూ. 8,86,628/-, బాకీపడిన మొత్తం: 07.10.2025 నాటికి రూ. 39,23,501/-

పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్-13లోని సబ్-సెక్షన్13లో పేర్కొన్నట్లుగా, మీరు ఈ నోటీసులో సూచించబడిన సెక్యూరిటీ కింద పేర్కొన్న ఆస్తులను మా బ్యాంకు ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా బదిలీ చేయరాదని దయచేసి గమనించండి.

ప్రత్యామ్నాయ నోటీసు సేవ కోసం చర్యలు తీసుకుంటున్నారు. పైన పేర్కొన్న రుణగ్రహీతలు మరియు/లేదా హామీదారులు (వర్తించే చోట) పైన పేర్కొన్న విధంగా బకాయిలను తదుపరి వడ్డీ మరియు వర్తించే ఛార్జీలతో సహా ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి 60 రోజులలోపు చెల్లించాలని సూచించబడింది. విఫలమైతే, ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు ముగిసిన తర్వాత "సెక్యూరిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, సబ్-సెక్షన్ (2)లో సూచించబడిన నోటీసు అందిన తర్వాత, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, ఏ రుణగ్రహీత కూడా నోటీసులో సూచించబడిన తన సెక్యూర్డ్ ఆస్తులను అమ్మకం, లీజు లేదా ఇతరత్రా బదిలీ చేయకూడదని దయచేసి గమనించండి.

చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలపై రుణగ్రహీత దృష్టిని ఆకర్షించడం జరిగింది. రుణగ్రహీతలు సెక్యూర్డ్ ఆస్తులను లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం ద్వారా బదిలీ చేయడానికి బహిరంగ ప్రకటన నోటీసు ప్రచురించే తేదీకి ముందు లేదా ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఒప్పందం నుండి కొటేషన్లు లేదా టెండర్లను ఆహ్వానించే తేదీకి ముందు ఎప్పుడైనా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు సంబంధించిన బకాయిలను అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలతో చెల్లించడం ద్వారా రీడీమ్ చేసుకోవచ్చు.

తేది: 15.11.2025 **సం/- అధీకృత అధికారి**
ప్రదేశం: బెంగళూరు. **యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్**

మానవ వ్యక్తిత్వాన్ని మలిచే 'జీవనసరళి'

- పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి- కర్నూలు కల్చరల్

మానవ జీవితంలో ఎదురయ్యే అనేక సంఘర్షణలు సంక్లిష్టతలను వివరిస్తూ మానవుని వ్యక్తిత్వాన్ని మలిచేలా విజయులు తనగల 'జీవనసరళి' కవిత్వం అందించారని వక్తలు కొనియాడారు. కర్నూలు నగరంలోని టిజివి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన 'జీవనసరళి' పుస్తకావిష్కరణ సభకు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ కవిత్వం వస్తు ప్రధానంగా సాగుతుందని సామాజిక సమస్యలను ఇతివృత్తంగా కవిత్వం రాశారని అన్నారు. ముఖ్య అతిథి ప్రముఖ న్యాయవాది జయరాజు మాట్లాడుతూ సమాజంలో మనుషులు ఎదుర్కొనే అనేక సమస్యలను కవిత్వంగా రాయడం అరుదైన విషయమని, ఈ కవి తెలుగు సాహిత్యంలో నిలబడతారని పేర్కొన్నారు. పుస్తకాన్ని సమీక్షించిన ప్రముఖ కథారచయిత ఇనాయతుల్లా మాట్లాడుతూ పుస్తకంలోని కవితలు మానవ జీవిత వ్యక్తిత్వ వికాసానికి అద్దం పడతాయని అన్నారు. ఈ రవితలు చదవడం వల్ల మనిషిలోని ఆలోచనలు సరైన మార్గంలో ప్రయాణం చేస్తాయని పేర్కొన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, . సాహితీ స్రవంతి జిల్లా నాయకులు అకేపోగు నాగరాజు, కెఎన్‌ఆర్ పాఠశాల కరస్పాండెంట్ విశ్వనాథ్ మాట్లాడుతూ కవిత్వంలోని వస్తువులు భిన్నత్వాన్ని సాధించాయని, ఈ కవిత్వం ఆదరించదగ్గదని అన్నారు. జీవనసరళి కవిత్వంలో మానవీయ విలువలు నైతికత ఉందని, సమాజానికి దగ్గరగా ఈ కవిత్వం ఉందని వివరించారు. కవులు తెలుగు భాషా సాహిత్యాలను తమ రచనలతో కాపాడుతూ ప్రాణం పోస్తున్నారని అన్నారు. కవి విజయులు తనగల మాట్లాడుతూ ఈ కవిత్వం ఇలా రావడానికి సాహితీ స్రవంతి అందించిన ప్రోత్సాహమే కారణమని, ఈ స్ఫూర్తితో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. అంతకుముందు ప్రజావాగ్గేయకారులు అందెశ్రీ మృతికి మౌనం పాటించి సభ నివాళులర్పించింది. కవులు మారుతీ పౌరోహితం, నాగేశ్వరాచారి, ఆవుల చక్రపాణి యాదవ్, సూర్యప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సభలో నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా పాడిన పాటలు అలరించాయి.

సమాజ మార్పులో యువ రచయితల పాత్ర కీలకం

- 'ఆనందమాయే సఖి' నవల ఆవిష్కరణ సభలో రచయిత అట్టాడ

ప్రజాశక్తి - విజయనగరం కోట

సమాజ మార్పులో యువ రచయితల పాత్ర కీలకంగా ఉండాలని ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు సూచించారు. నేటి సమాజంలో పత్రికలు, మీడియా.. పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లడం వల్ల వాస్తవాలు, సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలు వెలుగు చూడడం లేదన్నారు. ఈ నేపథ్యంలో కవులు, రచయితలే సామాజిక మార్పులు, పరిణామాలను స్వేచ్ఛగా రాయగలుతున్నారని తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సాహితీ స్రవంతి - జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యాన యువ రచయిత వావిలపల్లి సృజన రాసిన 'ఆనందమాయే సఖి' నవలను విజయనగరంలోని గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన ఆదివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సాహితీ స్రవంతి సభ్యులు చీకటి చంద్రికారాణి అధ్యక్షతన జరిగిన సభలో అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ రైతులు, కార్మికులు, శ్రమజీవుల సంఘర్షణ, వారి పోరాటాల నుంచి మాత్రమే సమాజ మార్పు ఉంటుందని వివరించారు. నేటి సమాజంలో మనుషుల మధ్య అంతరాలు సృష్టించేందుకు అనుసరిస్తోన్న పరిస్థితులను, విచ్ఛిన్నకర ఆలోచనలను రచయితలు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు మాట్లాడుతూ నవలలో సృజన భాష, భావం ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని, శాస్త్రీయ ఆలోచనలు కూడా ఉన్నాయని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షులు ఎల్.చిన్నారి మాట్లాడారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు కె.రమాదేవి పుస్తక సమీక్ష, యువ కవి గూండ్ల వెంకటనారాయణ నవల పరిచయం చేశారు.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
MANAPPURAM HOME FINANCE LTD.
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
సిఐఎన్ : U65923K12010PIC039179 యూనిట్ నం.301- 315, 3వ అంతస్తు, ఎ వింగ్, కనకియ వాల్ స్ట్రీట్, అందేరి-కుర్ల రోడ్, అందేరి తూర్పు, ముంబై-400093.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, దిగువసంతకందారు అయిన **మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("యంఎహెచ్ఎఫ్ఎల్")** అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (2002 యొక్క 54) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9 తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ రుణగ్రహీతలను మరియు సహ-రుణగ్రహీతలను పిలుస్తు నోటీసులో పేర్కొన్న మొత్తం సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా మొత్తాన్ని చెల్లించవలసిందిగా **డిమాండ్ నోటీసు** జారీచేయబడింది. రుణగ్రహీత మొత్తాన్ని చెల్లించుటలో విఫలమైనందున, సదరు రూల్స్ లోని రూల్ 9 తో చదువుతూ సదరు చట్టం లోని సెక్షన్ 13 (4) క్రింద అతను/ఆమెకి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారుడు ఇందులో దిగువ వివరించిన ఆస్తిని **లాంఛనప్రాయంగా** స్వాధీనం చేసుకున్నారు. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమైనది. ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదని జరిపే ఏవేని లావాదేవీలు మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌కు లోబడి ఉంటాయని తెలియపరుచుచున్నాము.

క్ర సం	రుణగ్రహీత/సహా-రుణగ్రహీతల పేరు/లోన్ అకౌంట్ నం./శాఖ	సృష్టించబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	డిమాండ్ నోటీసు పంపిన తేది మరియు మొత్తం బకాయి	స్వాధీనతా తేది
1	పండిపాటి వాణి, పండిపాటి ప్రసాద్ బాబు / MHL00310015596 / విజయవాడ	కృష్ణా జిల్లా, వుయ్యూరు సబ్ రిజిస్ట్రీ, తోట్లవల్లూరు మండలం, కుమ్మమూరు గ్రామ పంచాయతీ ఏరియా, ఆర్ఎస్ నెం.221/2, డోర్ నెం.3-19, అసిస్ట్ నెం.413, ఆంధ్రప్రదేశ్ -521165 విస్తీర్ణం 158 చ.గ.లు: తూర్పు: వల్లూరు ప్రసాదరావు ఆస్తి, పడమర: పంచాయతీ రోడ్డు, దక్షిణం: గురివిందపల్లి కమలారత్నం ఆస్తి, ఉత్తరం: కొడాలిమల్లి ఆస్తి మరియు పంచాయతీ రోడ్డు.	18-08-2024 & RS.426532/-	15-11-2025
2	ప్రత్తిపాటి దివేనా, ప్రత్తిపాటి దావీదు / MHL00310034849 /విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రీ, జి.కొండూరు మండలం, వెంకటాపురం గ్రామ పంచాయతీ ఏరియా, వెంకటాపురం గ్రామం, ఆర్ఎస్ నెం.50-2ఏ, డోర్ నెం.2-143, అసిస్ట్ నెం.339, విస్తీర్ణం 96.8 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్: 521229. తూర్పు: ప్రత్తిపాటి రామారావు ఆస్తి, పడమర: రోడ్డు, దక్షిణం: ప్రత్తిపాటి సురేష్ బాబు ఆస్తి, ఉత్తరం: రోడ్డు.	18-08-2025 & RS.427124/-	15-11-2025
3	పాతపాటి అనురాధ, పాతపాటి వేంకటేశ్వర / MHL00310026093 / విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, మైలవరం సబ్ రిజిస్ట్రర్ వై, జి.కొండూరు మండలం, వెల్లటూరు గ్రామ పంచాయతీ ఏరియా, వెల్లటూరు గ్రామం, ఆర్.ఎస్.నెం.332, డోర్ నెం.7-9, అసిస్ట్ నెం.781, విస్తీర్ణం 185.5 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్: 521229. తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: పాలపర్ల పరిశుద్ధరావు ఆస్తి, దక్షిణం: నిమ్మగడ్డలాజరు ఆస్తి, ఉత్తరం: పాతపాటి మరియన్న ఆస్తి.	18-08-2025 & RS.533204/-	15-11-2025
4	బైర్ల చెన్నయ్య, బైర్ల బేబీ, మైలమల పవన్ / CO90COLONS0 00005008619 / విజయవాడ	ఆర్ఎస్ నెం.229లోని ఆర్‌సిసి రూఫ్డ్ బిల్డింగ్‌తోకూడిన సైట్ యొక్క 152 చ.గ.ల విస్తీర్ణం, రుద్రవరంగ్రామ పంచాయతీ, రెడ్డిగూడెం మండలం, మైలవరం సబ్‌రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 521226. తూర్పు: బయర్ల యోహాన్ సైట్, పడమర: పంచాయతీ రోడ్డు, దక్షిణం: బయర్ల యోహాన్ సైట్, ఉత్తరం: మేడిపల్లి వరయ్య సైట్.	18-08-2025 & RS.625994/-	15-11-2025
5	వాడిత్య నందిని, వాడిత్య చంటి / MHL00310028857 / విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, విస్సన్న పేట సబ్ రిజిస్ట్రీ, విస్సన్నపేట్ మండలం, వేమిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ ప్రాంతం, వేమిరెడ్డిపల్లి గ్రామం, ఆర్.ఎస్.నెం.96/8, డోర్ నెం.4-108, అసిస్ట్ నెం.708, విస్తీర్ణం 338.8 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 521215. తూర్పు: అజమీర భాస్కరరావు ఇల్లు మరియు స్థలం, పడమర: బాణవత్తు నాగేశ్వరరావు ఇల్లు మరియు స్థలం, దక్షిణం: పంచాయతీ రోడ్డు, ఉత్తరం: దర్మసోతు శ్రీను ఆస్తి.	18-08-2025 & RS.641183/-	15-11-2025
6	తిరివీధి పుష్పలీల, తిరివీధి సాలన్‌రాజు / MHL00310021702 / విజయవాడ	కృష్ణా జిల్లా, విజయవాడ తూర్పు జిల్లా రిజిస్ట్రీ, గన్నవరం సబ్ రిజిస్ట్రీ, గన్నవరం గ్రామ పంచాయతీ ప్రాంతం, గన్నవరం గ్రామం, ఆర్.ఎస్.నెం.417, డోర్‌నెం.15-47, అసిస్ట్‌నెం.4597, మొత్తం 236.62 చ.గ.ల విస్తీర్ణంలోని దక్షిణ వైపుగల 79.07 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్: 521101. తూర్పు: 4 అ.ల వెడల్పు జాయింట్ పాసేజ్, పడమర: తిరివీధి ముని సైట్, దక్షిణం: పంచాయతీ రోడ్డు, ఉత్తరం: తిరివీధి కుమార్ బాబు ఆస్తి.	18-08-2025 &RS.685438/-	15-11-2025
7	నంద్రు పాపారావు, ముల్లంగి స్పందన ప్రియ, మాడుగుల రాంబాబు / NHL00310029325 / విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల సబ్ రిజిస్ట్రీ, వీరులపాడు మండలం, పొన్నవరం గ్రామ పంచాయతీ ఏరియా, పొన్నవరం గ్రామం, ఆర్.ఎస్.నెం.50, డోర్ నెం.3-98, అసిస్ట్ నెం.300, ఆంధ్ర ప్రదేశ్-521180 విస్తీర్ణం 96.8 చ.గ.లు: తూర్పు: గంధంహారోను ఇల్లు, పడమర: పంచాయితీ సిమెంట్ రోడ్, దక్షిణం: పంచాయతీ సిమెంట్ రోడ్, ఉత్తరం: ఎమన అప్పారావు ఇల్లు.	18-08-2025 & RS.874993/-	15-11-2025
8	దేవరపల్లి జానకి, దేవరపల్లి బాబు / MLAP00310 06100 / విజయవాడ	కృష్ణా జిల్లా , గన్నవరం సబ్ రిజిస్ట్రీ, ఉంగుటూరు మండలం, ఆత్కూరు గ్రామ పంచాయితీ ఏరియా, ఆత్కూరు గ్రామం, ఆర్ఎస్ నెం.630/1, డోర్ నెం.7-146, ఆర్‌సిసి దాబా కలిగియున్న నివాస సైట్ యొక్క 242 చ.గ.ల విస్తీర్ణం, ఆంధ్ర ప్రదేశ్, పిన్-521286. తూర్పు: పాల్ ఆస్తి, పడమర: దేవరపల్లి సునీల్ ఆస్తి, దక్షిణం: ముల్పూరిజెర్మియా ఆస్తి, ఉత్తరం: 3 గజాల వెడల్పు సొంత మార్గం.	18-08-2025 & RS.458390/-	15-11-2025
9	గొల్లపల్లి నిర్మల, గొల్లపల్లి సందీప్ / MHL00310009223 / విజయవాడ	కృష్ణా జిల్లా, గుడివాడ సబ్ రిజిస్ట్రీ, గుడివాడ మున్సిపాలిటీ ఏరియా, నాగవరప్పాడు గ్రామం, ఆర్.ఎస్.నెం.48/3, డోర్ నెం.1-435-ఏ, ఏసిసి షీట్ షెడ్ కలిగియున్న నివాస సైట్ యొక్క 96.8 చ.గ.ల విస్తీర్ణం, ఆంధ్రప్రదేశ్, పిన్-521301. తూర్పు: మున్సిపల్ రోడ్డు, పడమర: మున్సిపాలిటీ రోడ్, దక్షిణం: దొండపాటి సుబ్బా రావు ఆస్తి, ఉత్తరం: దొండపాటి మనోహర్ ఆస్తి.	18-08-2025 &RS.509994/-	15-11-2025
10	బెల్లంకొండ సూరమ్మ, బెల్లంకొండ కోటేశ్వర రావు / MLAP0031 004806 / విజయవాడ	ఎన్.టి.ఆర్.జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, మైలవరం సబ్ రిజిస్ట్రీ, మైలవరంమండలం, మైలవరం గ్రామ పంచాయితీ ఏరియా, మైలవరం గ్రామం, ఆర్ఎస్ నెం.166-1, డోర్ నెం.8-69, అసిస్ట్ నెం.1752, ఏసిసి షీట్ షెడ్ కలిగియున్న నివాస సైట్ యొక్క 312 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్ 521230. తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: వలిపి వెంకటేశ్వరరావు స్థలం, దక్షిణం: బెల్లం కొండ జమలయ్య స్థలం, ఉత్తరం: డేరంగుల గంగయ్య స్థలం.	18-08-2025 & RS.605919/-	15-11-2025
11	పొన్నం రమ్య, మందా రామారావు / MHL00310044525 / విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల సబ్-రిజిస్ట్రీ, పరిటాల గ్రామపంచాయతీ ఏరియా, పరిటాల గ్రామం, ఆర్ఎస్ నెం.487/1, డోర్ నెం.5-207/1, అసెస్‌మెంట్ నెం.2397, ఆంధ్ర ప్రదేశ్- 521180 విస్తీర్ణం 121 చ.గ.లు: తూర్పు: వేముల సంగీతరావు ఇల్లు, పడమర: తంగిరాల తిరుమలరావు ఇల్లు, దక్షిణం: తంగిరాల జోసెఫ్ స్థలం, ఉత్తరం: బజార్ మరియు కర్రా నాగమణి ఇల్లు.	16-08-2025 & Rs.488149/-	15-11-2025
12	ఇంద్రకంటి ఇందిర, ఇంద్రకంటి జీవన్ / MHL00310042699/ విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, మైలవరం సబ్-రిజిస్ట్రీ, మైలవరం మండలం, వెల్వడం గ్రామ పంచాయతీ ఏరియా, వెల్వడం గ్రామం, ఆర్.ఎస్.నెం.494/8, డోర్ నెం.10-75, అసిస్ట్ నెం.1589, ఆంధ్ర ప్రదేశ్-521230లో విస్తీర్ణం 96.8 చ.గ.లు. తూర్పు: రోడ్డు, పడమర: యలమర్తి బాబు ఇల్లు మరియు స్థలం, దక్షిణం: తోమండ్రు కిషోర్ ఇల్లు మరియు స్థలం, ఉత్తరం: మొండితోక వెంకటేశ్వర రావు ఇల్లు మరియు స్థలం.	16-08-2025 & Rs.509573/-	15-11-2025
13	ప్రత్తిపాటి రమాదేవి, ప్రత్తిపాటి సాంబశివ రావు /MHL00 310031481 / విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, మైలవరం సబ్-రిజిస్ట్రీ, మైలవరం మండలం, వెల్వడం గ్రామ పంచాయతీ ప్రాంతం, వెల్వడం గ్రామం, ఆర్.ఎస్.నెం.494/8, డోర్ నెం.8-80, అసెస్‌మెంట్ నెం.1578, 96.8చదరపు గజాల విస్తీర్ణం, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 521230. తూర్పు: మట్టకొయ్యా యేసోబు ఇల్లు మరియు స్థలం, పడమర: సిమెంట్ రోడ్డు, దక్షిణం: కోట ప్రసాదరావు ఇల్లు మరియు స్థలం, ఉత్తరం: కోట గంగయ్య ఇల్లు మరియు స్థలం.	16-08-2025 & Rs.516012/-	15-11-2025
14	బోలపాటి జయ లక్ష్మి, బోలపాటి ప్రశాంత్ కుమార్ / MHL0031 0030411 / విజయవాడ	కృష్ణా జిల్లా, కౌతారం సబ్-రిజిస్ట్రీ, గుడ్లవల్లేరు మండలం, కౌతారం గ్రామ పంచాయతీ పరిధి, కౌతారం గ్రామం, ఆర్ఎస్ నెం.447-1, డోర్ నెం.8-73, అసిస్ట్ నెం.1200, విస్తీర్ణం 160 చ.గ.లు ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్-521331. తూర్పు: బోలపాటి శిరీష ఇల్లు, పడమర: సరిహద్దు సలోమి ఇల్లు, దక్షిణం: బోలపాటి ముని శేఖర్ ఇల్లు, ఉత్తరం: పంచాయతీ రోడ్డు.	16-08-2025 & Rs.724678/-	15-11-2025
15	వల్లెపు ధరిసీని, దేరంగుల నాగరాజు/ MHL00310023354/ విజయవాడ	ఏలూరు జిల్లా, నూజివీడు సబ్-రిజిస్ట్రీ, ఆగిరిపల్లి మండలం, బొద్దనపల్లి గ్రామ పంచాయతీ ప్రాంతం, ఆర్.ఎస్.నెం.242/1, డోర్ నెం.1-42, అసిస్ట్ నెం.41, ఆంధ్ర ప్రదేశ్-521211 విస్తీర్ణం 193.6 చదరపు గజాల. తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: డేరంగుల భాగ్యమ్మ స్థలం, దక్షిణం: డేరంగుల భాగ్యమ్మ స్థలం, ఉత్తరం: డేరంగుల భాగ్యమ్మ స్థలం.	16-08-2025 & Rs.506926/-	15-11-2025
16	చేగుడి లక్ష్మి, చేగుడి అంకయ్య, చేగుడి మరియమ్మ / MHL00310020989 / విజయవాడ	ఆర్ఎస్ నెం.792/11లోని 145.2 చదరపు గజాల విస్తీర్ణం, అసిస్ట్ నెం.10, డోర్ నెం.2-133, కొండుభొట్లవారి పాలెం గ్రామ పంచాయతీ, తూర్పు బాపట్ల మండలం, బాపట్ల ఎస్ఆర్ఓ, బాపట్ల జిల్లా, ఆంధ్ర ప్రదేశ్-522101. తూర్పు: పంచాయితీ రోడ్, పడమర: జోగి సుబ్బయ్య ఆస్తి, దక్షిణం: బొలిమెర కృపానందం ఆస్తి, ఉత్తరం: పంచాయతీ రోడ్ ఆస్తి.	16-08-2025 & Rs.513035/-	15-11-2025
17	కాకర్ల హైమావతి, కాకర్ల హైమావతి, కాకర్ల చిట్టిబాబు / MHL00310027345 / విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, విస్సన్న పెట సబ్ రిజిస్ట్రీ, రెడ్డిగూడెం మండలం, సొకుళ్లపాడు గ్రామ పంచాయతీ ప్రాంతం, సరుకుళ్లపాడు గ్రామం, ఆర్ఎస్ నెం.290/5, డోర్ నెం.1-14/5, అసెస్‌మెంట్ నెం. 42, ఆర్‌సిసి దాబా కలిగిన 193.62 చ.గ.ల విస్తీర్ణంలో నివాస స్థలం, పి.ఓ.తోలుకోడు, కృష్ణ, ఆంధ్రప్రదేశ్, పిన్: 521230. తూర్పు: సిమెంట్ రోడ్డు, పడమర: కొక్కిలిగడ్డదవీడు ఇల్లు మరియు స్థలం, దక్షిణం: గోడుమిషక్ ఇల్లు మరియు స్థలం, ఉత్తరం: కాకర్ల వసంత రావు ఇల్లు మరియు స్థలం.	16-08-2025 & Rs.426444/-	15-11-2025
18	కట్టుపల్లి ధనలక్ష్మి, కట్టుపల్లి దయానందం / MHL00310022850 / విజయవాడ	బాపట్ల జిల్లా, బాపట్ల రిజిస్ట్రేషన్ జిల్లా, బాపట్ల మండలం, తూర్పు బాపట్ల పంచాయతీ, హైదారు పేట్, తూర్పు బాపట్ల గ్రామం, డోర్ నెం.886/3, డోర్ నెం.6-43, అసిస్ట్ నెం.1050, విస్తీర్ణం 145.2 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 522101. తూర్పు: కంద్రు దయానంద రావు ఇల్లు మరియు స్థలం, పడమర: పంచాయతీ సి.సి.రోడ్, దక్షిణం: పంచాయతీ రోడ్, ఉత్తరం: బొనిగల ప్రభాకరరావు స్థలం.	16-08-2025 & Rs.516098/-	15-11-2025
19	కంద్రు కృపా జ్యోతి, బోనిగల నెహె మియా / MHL00310035407 /విజయవాడ	బాపట్ల జిల్లా. బాపట్ల రిజిస్ట్రేషన్ జిల్లా, బాపట్ల సబ్ రిజిస్ట్రీ, తూర్పు బాపట్ల గ్రామ పంచాయతీ ఏరియా, హైదర్ పేట్ గ్రామం, తూర్పు బాపట్ల గ్రామం, డోర్ నెం.902/813, డోర్ నెం.4-156, అసిస్ట్ నెం.763, ఎక 0.03 సెంట్లు లేదా 145.2 చ.గ.ల విస్తీర్ణంతో, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 522101. తూర్పు: ఇతరుల ఆస్తి, పడమర: పంచాయత్ రోడ్, దక్షిణం: చుక్కా ఎలిషా బాబు ఆస్తి, ఉత్తరం: బొనిగల అనితన్న ఆస్తి.	16-08-2025 & Rs.520486/-	15-11-2025
20	మన్నెం అరుణ, మన్నెం వెంకట శ్రీనివాస రావు / MHL00310034099 / విజయవాడ	కృష్ణా జిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రీ, గన్నవరం మండలం, అల్లాపురం గ్రామ పంచాయితీ, ఆర్ఎస్ నెం.83/2, డోర్ నెం.1-59/1, అసిస్ట్ నెం.77, విస్తీర్ణం 242 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 521101. తూర్పు: మన్నెం మణి యొక్క ఆస్తి, పడమర: పంచాయతీ రోడ్డు, దక్షిణం: పంచాయతీ రోడ్డు, ఉత్తరం: మన్నెం ముత్యాలు ఆస్తి.	16-08-2025 & Rs.534886/-	15-11-2025
21	గొల్లపల్లి భార్గవి, గొల్లపల్లి కళ్యాణ్ / MHL00310032319 / విజయవాడ	ఏలూరు జిల్లా, కనుమోలు సబ్-రిజిస్ట్రీ, నూజివీడు మండలం, పల్లెర్లమూడి గ్రామ పంచాయతీ ప్రాంతం, పల్లెర్లమూడి గ్రామం, ఆర్.ఎస్.నెం.203/3, డోర్ నెం.4-114, అసిస్ట్ నెం.565, విస్తీర్ణం 112 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్: 521105. తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: పచ్చిగళ్ల డేవిడ్ ఆస్తి, దక్షిణం: సంగ శ్యామల ఆస్తి, ఉత్తరం: ఉప్పిడి బుజ్జి ఆస్తి.	16-08-2025 & Rs.556385/-	15-11-2025
22	మడిపల్లి దేవిడ్ రాజు, మడిపల్లి సుదర్శనం, మడిపల్లి మధు / NHL00310035749/ విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, తిరువూరు సబ్ రిజిస్ట్రీ, తిరువూరు మండలం, జి.కొత్తూరు గ్రామ పంచాయతీ ప్రాంతం, గానుగపాడు శివారు, జి.కొత్తూరు గ్రామం, ఆర్.ఎస్.నెం.418/1, డోర్ నెం.8-23, అసిస్ట్ నెం.129, ఆర్‌సిసి దాబా కలిగియున్న నివాస సైట్ యొక్క విస్తీర్ణం 217.8 చ.గ.ల విస్తీర్ణం, కృష్ణ, ఆంధ్ర ప్రదేశ్, 521235. తూర్పు: సిమెంట్ రోడ్డు, పడమర: బూడిపల్లి రాములు ఇల్లు మరియు స్థలం, దక్షిణం: మడిపల్లి యోహాను ఇల్లు మరియు స్థలం, ఉత్తరం: బూడిపల్లి అచ్చయ్య ఇల్లు మరియు స్థలం.	16-08-2025 & Rs.979913/-	15-11-2025
23	దేశవత్తు నాగరాజు, దేవత ఉమా, దేశవత్తు వెంకటేశ్వర రావు / NHL00310036 593 / విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, మైలవరం సబ్-రిజిస్ట్రీ, మైలవరం మండలం, కనిమెర్ల గ్రామ పంచాయతీ ప్రాంతం, కనిమెర్ల గ్రామం, ఆర్.ఎస్.నెం.48-1 బి, డోర్ నెం.4-143, అసిస్ట్ నెం.622, నివాస సైట్ యొక్క 193.6 చదరపు గజాల విస్తీర్ణం, కృష్ణ, ఆంధ్ర ప్రదేశ్-521230. తూర్పు: పంచాయతీ రోడ్డు, పడమర: వాడిత్య శ్రీరాములు ఆస్తి, దక్షిణం: దేశావత్తు వెంకటేశ్వరరావు ఆస్తి, ఉత్తరం: పంచాయతీ రోడ్డు.	16-08-2025 & Rs.974671/-	15-11-2025

ప్రదేశం: విజయవాడ, తేది: 17-11-2025 **సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**

19న బీహార్‌లో కొత్త ప్రభుత్వం!

పాట్నా : బీహార్‌లో ఈ నెల 19న కొత్త ప్రభుత్వం కొలువుతీరనుంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంటుంది. ఈ నెల 19న లేదా 20 తేదీన ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. పాట్నాలోని గాంధీ మైదానంలో ఇందుకు సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ షెడ్యూల్‌ను బట్టి ఈ రెండు తేదీల్లోనే ప్రమాణస్వీకారం కార్యక్రమం ఉండనుందని తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల జాబితాను గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు ఎన్నికల సంఘం సమర్పించనుంది. అనంతరం కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రకటన రానుంది. సోమవారం నితీశ్ కుమార్ తన క్యాబినెట్‌తో సమావేశం కానున్నారు. ఆ తర్వాత రాజ్‌భవన్‌కు వెళ్లి తన రాజీనామా లేఖను గవర్నర్‌కు ఇవ్వనున్నారు. అనంతరం ఎన్‌డిఎ కూటమి ఎమ్మెల్యేలు సమావేశమై తమ కూటమి నాయకుడిని ఎన్నుకుంటారు. అందరూ అమోదించిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు.

బాలికపై లైంగిక దాడి నిందితుని అరెస్టు

ప్రజాశక్తి- సీతానగరం (తూర్పుగోదావరి)

ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, బాలికపై లైంగిక దాడికి పాల్పడటమే కాక, ఆమెను బెదిరించి డబ్బులు వసూలు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు రఘుదేవపురం గ్రామానికి చెందిన నిందితుడు గడుసుల నాగ వెంకటేష్, అతని తల్లి రమణపై పోక్సో, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇంటర్ చదివిన ఒక బాలిక ఎయిర్ హోస్టెస్ కోచింగ్ కోసం విశాఖపట్నంలో ఉన్నారు. ఏడాది క్రితం వెంకటేష్‌కు, ఆమెకు వాట్సాప్‌లో పరిచయమైంది. దీంతో, ఆమెను పెళ్లి చేసుకుంటానని వెంకటేష్ నమ్మించాడు. సంవత్సర కాలంగా ఆమె నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేశాడు. గత అక్టోబర్ 31న ఇంటర్వ్యూ పేరుతో మాయమాటలు చెప్పి బాలికను హైదరాబాద్ తీసుకువెళ్లాడు. అక్కడ ఒక హోటల్‌లో వారిద్దరూ కలిసి దిగిన ఫొటోలు, వీడియోలను నెట్‌లో పెడతానని బెదిరించి ఆమెపై మూడు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను రఘుదేవపురం తీసుకువచ్చాడు. బాలిక ఫిర్యాదు మేరకు వెంకటేష్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు.

కుక్కల దాడి... 16 గొర్రెలు మృతి

- పరిశీలించిన వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- పెద్దపప్పూరు (అనంతపురం జిల్లా)

అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం అమ్మలదిన్నె గ్రామంలో రేకుటషెడ్డులో ఉన్న గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. దీంతో, 16 గొర్రెలు మృతి చెందాయి.

బాధితుని కథనం ప్రకారం... మండలంలోని అమ్మలదిన్నె గ్రామానికి చెందిన గొర్ల పుల్లయ్య 16 గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవారు. ఒక షెడ్డు వేసుకుని రాత్రిళ్ల వాటిని దానిలో ఉంచుకునేవారు. ఆదివారం తెల్లవారుజామున వీధి కుక్కలు గొర్రెల మందపై దాడి చేయడంతో 16 గొర్రెలూ చనిపోయాయి. దీంతో దాదాపు రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి అమ్మలదిన్నె కుళ్లాయప్ప, సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం మృతి చెందిన గొర్రెలను పరిశీలించి బాధిత కాపరిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత గొర్రెల కాపరిని తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోప్యత హక్కుకు పాతర

- ప్రభుత్వ అధీనంలో వ్యక్తిగత సమాచారం
- అమలులోకి వచ్చిన డిపిడిపి చట్ట నిబంధనలు

న్యూఢిల్లీ : వివాదాస్పద డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్ట నిబంధనలు అమలులోకి వచ్చాయి. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్-ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. తొలుత డిపిడిపి చట్టంలోని పరిపాలనా సంబంధమైన నిబంధనలు అమలులోకి వచ్చాయి. రాబోయే 18 నెలలో కాలంలో ఇతర నిబంధనలను కూడా దశల వారీగా నోటిఫై చేస్తారు. సమాచార హక్కు (ఆర్‌టిఐ) చట్టంలోని సెక్షన్ 8 (1) (జె)పై నేరుగా ప్రభావం చూపే డిపిడిపి చట్టంలోని సెక్షన్ 44 (3)ని కూడా ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. జరిమానాలకు సంబంధించిన నిబంధనలు కూడా తక్షణమే అమలులోకి వచ్చాయి. వ్యక్తుల గోప్యతను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన మొట్టమొదటి చట్టం డిపిడిపి. దీని ప్రకారం వివిధ వేదికలు తమ వినియోగదారుల ప్రైవేటు సమాచారాన్ని గోప్యంగా ఉంచాల్సి ఉంటుంది. వినియోగదారులు కోరితే ఆ సమాచారాన్ని తొలగించాలి కూడా. డిపిడిపి చట్టంలోని సెక్షన్ 44 (3)ని అమలులోకి తేవడంతో పౌరుల సమాచార హక్కుకు భంగం వాటిల్లే ప్రమాదం ఉంది. ఎందుకంటే ఇది ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8 (1) (జె)ని నీరుకారుస్తుంది. ప్రజా ప్రయోజనాల కోసం లేదా విస్తృత ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే సందర్భాలలో వ్యక్తుల సమాచారాన్ని బహిర్గతం చేయడానికి డిపిడిపి సెక్షన్ అనుమతిస్తోంది. ఆర్‌టిఐ చట్ట నిబంధనల ప్రకారం డిజిటల్ వేదికల వినియోగదారులందరికీ నోటీసులు అందజేయాలి. డేటా భద్రతలో ఏదైనా ఉల్లంఘన జరిగితే వినియోగదారులకు తెలియజేయాలి. డిజిటల్ వేదికలు ఏ మేరకు, ఎంత పరిమాణంలో డేటాను తమ వద్ద ఉంచుకోవాలన్న విషయంపై కొన్ని పరిమితులు ఉంటాయి. అంతేకాకుండా డేటా విశ్వసనీయతను...అంటే వినియోగదారుల గోప్యతను కాపాడాల్సిన వారు ఆ బాధ్యతను నెరవేర్చడానికి కఠినమైన ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. ఇక కంపెనీలు వ్యక్తిగత డేటా ఎలా సేకరించాలి, ఎలా భద్రపరచాలి, దానిని ఎలా నిలుపుకోవాలి, ఎలా తొలగించాలి...వంటి అంశాలపై డిపిడిపి చట్టం కొన్ని నియమాలను నిర్దేశించింది. అయితే వీటిలో చాలా వరకూ ఓ సంవత్సరం తర్వాత మాత్రమే అమలులోకి వస్తాయి. డిపిడిపి చట్ట నియమ నిబంధనలపై జనవరి నుంచే సంప్రదింపులు కొనసాగుతున్నాయి. అయితే ఈ చట్టం సుమారు దశాబ్ద కాలంగా అమలులో ఉన్నదే. కానీ చిన్నారుల విషయంలో డిజిటల్ వేదికలు ఏదైనా వ్యక్తిగత సమాచారాన్ని పబ్లిక్ డొమైన్‌లో పెట్టే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, సమ్మతి పొందాలని తాజా నిబంధనలు నిర్దేశిస్తున్నాయి.

ఐఎఫ్ఎఫ్ ఆందోళన

తక్షణమే అమలులోకి వచ్చిన డిపిడిపి చట్ట నిబంధనలు పారదర్శకత, వ్యక్తిగత స్వేచ్ఛకు అవరోధాలుగా మారబోతున్నాయని ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ (ఐఎఫ్ఎఫ్) ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజల వ్యక్తిగత డేటాను సేకరించే పనిని ప్రభుత్వ సంస్థలకు అప్పగించడంతో ఆ సమాచారం సర్కారు అధీనంలోకి పోతుందని ఆరోపించింది. దేశ ప్రయోజనాలను సాకుగా చూపించి డిజిటల్ వేదికల నుంచి వ్యక్తిగత డేటాను డిమాండ్ చేసేందుకు ప్రభుత్వానికి అపరిమిత అధికారం లభిస్తుందని తెలిపింది.

రికార్డు స్థాయిలో బాండ్లు కొంటున్న ట్రంప్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆగస్ట్ 28-అక్టోబర్ 2 తేదీల మధ్య కనీసం 82 మిలియన్ డాలర్ల విలువ కలిగిన కార్పొరేట్, మున్సిపల్ బాండ్లు కొనుగోలు చేశారు. ఆగస్ట్ నుంచి ఇప్పటి వరకూ 175 ఆర్థిక కొనుగోళ్లతో కలిపి ట్రంప్ కొనుగోలు చేసిన మొత్తం బాండ్ల విలువ రికార్డు స్థాయిలో 337 మిలియయన్ డాలర్లు దాటిందని ఓ నివేదిక తెలిపింది. బ్రాడ్‌కామ్ అండ్ క్వాల్‌కామ్, మెటా వేదికల వంటి టెక్నాలజీ సంస్థలు, హోమ్ డిపోట్, సీవీసీ హెల్త్ వంటి రిటైలర్లు, గోల్డ్‌మ్యాన్ సాచ్స్, మార్గాన్ స్టాన్లే వంటి వాల్ స్ట్రీట్ సంస్థల నుండి ట్రంప్ బాండ్లను కొనుగోలు చేశారు. ఆగస్ట్ చివరలో జరిపిన కొనుగోళ్లలో జేపీ మోర్గాన్ బాండ్లు కూడా ఉన్నాయి.

ఇదిలావుండగా లైంగిక కుంభకోణంలో దోషిగా తేలి జైలు జీవితం గడుపుతూ ఆత్మహత్య చేసుకున్న ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టెయిన్‌తో జేపీ మోర్గాన్‌కు ఉన్న సంబంధాలపై విచారణ జరపాల్సిందిగా అమెరికా న్యాయ శాఖను రెండు రోజుల క్రితం ట్రంప్ కోరారు. కాగా ఇంటెల్ కంపెనీలో అమెరికా ప్రభుత్వం యాజమాన్య వాటాను కొనుగోలు చేసిన తర్వాత అందులో కూడా ట్రంప్ బాండ్లు కొన్నారు. ట్రంప్ కొనుగోలు చేసిన బాండ్లలో మున్సిపాలిటీలు, రాష్ట్రాలు, కౌంటీలు, స్కూల్ డిస్ట్రిక్ట్స్, ఇతర ప్రభుత్వ సంబంధ సంస్థలు జారీ చేసినవి కూడా ఉన్నాయి. ప్రభుత్వ విధానాల కారణంగా ప్రయోజనం పొందిన, పొందుతున్న పలు పరిశ్రమలలో కూడా ట్రంప్ బాండ్లను కొనుగోలు చేశారు. రాజకీయాలలో ప్రవేశించక ముందు ట్రంప్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన విషయం తెలిసిందే. తన కంపెనీలన్నింటినీ పిల్లలు నడుపుతున్న ట్రస్ట్ చేతిలో ఉంచానని ట్రంప్ గతంలో అనేక సందర్భాలలో చెప్పారు.

నడక నేర్పించిన కలెక్టరమ్మ

ప్రజాశక్తి- భీమవరం

ఆ చిన్నారి చిన్ననాటి నుంచి వికలాంగురాలు.. ఏం చేయాలో తెలియని స్థితిలో ఉండిపోయిన తల్లిదండ్రులకు పిజిఆర్ఎస్ మార్గం చూపించింది. చిన్నారిని భుజాన వేసుకుని ఆమె తల్లి కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించింది. చలించిపోయిన కలెక్టర్ నాగరాణి మంచి ఆలోచనతో చిన్నారిపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. సాధారణంగా వికలాంగులు పిజిఆర్ఎస్‌కు వస్తే పింఛను ఇప్పించడానికి ఆలోచన చేస్తారు. ఆ పరిధిని దాటి ఆ పాప ఎందుకు నడవడం లేదని ఆలోచించిన కలెక్టర్ ఆ చిన్నారికి ఉజ్వల భవిష్యత్తు అందించారనడంలో సందేహం లేదు. ప్రతి సోమవారమూ నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సెప్టెంబర్ 8వ తేదీన పాలకోడేరు మండలం పెన్నాడకు చెందిన అంజలి ఆమె ఏడేళ్ల కుమార్తె దివ్య రాణిని భుజాలపై మోసుకొచ్చి మా పాప నడవడం లేదు.. కనీసం వికలాంగుల పెన్షన్ మంజూరు చేస్తే ఆధారంగా ఉంటుందని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కలెక్టర్ వెంటనే ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్‌ను పిలిచి పాపను చిన్న పిల్లల వైద్యులకు చూపించి వైద్యం చేయిస్తే ప్రయోజనం ఉంటుందేమో అని సిఫార్సు చేయడం, వెంటనే ఆర్‌కె గాయత్రి హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యుల వద్ద పరీక్షలు చేయించడంతో 'మైల్ స్టోన్ డిలే'గా గుర్తించారు. ఫిజియో థెరపీ, స్పీచ్ థెరఫీ ద్వారా పాపకి నడవడం, మాట్లాడడం 90 శాతం అవకాశం ఉందని వైద్యులు సూచించారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా పిల్లల వైద్యులతో చికిత్స ఇప్పిస్తూనే, అన్నపూర్ణ ఫిజియోథెరపీ అండ్ రిహాబిటేషన్ సెంటర్‌లో ఫిజియోథెరపీని ఇప్పించారు. ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ వేగ్నేసిన ప్రవీణ కుటుంబ పరిస్థితిని చూసి ఉచితంగా ఫిజియోథెరపీని అందించడానికి ముందుకొచ్చారు. ఇప్పటివరకు 22 సెషన్స్ అందించారు. పాపను పిజిఆర్ఎస్‌కి తీసుకొచ్చినప్పుడు కనీసం కూర్చోలేని స్థితి. నేడు లేచి నిలబడడం, ఒక వస్తువును పట్టుకుని నడవడం విశేషం. ఫిజియోథెరపీ అనంతరం స్పీచ్ థెరపీ కూడా ఇప్పించి చిన్నారికి మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు.

'ఉపాధి'కి షాక్

- భారీ సంఖ్యలో కార్మికుల తొలగింపు
- అక్టోబర్ 10-నవంబర్ 14 మధ్య 27లక్షల మంది ఔట్
- రాష్ట్రం నుంచి అత్యధికంగా 15.2 లక్షల మంది

న్యూఢిల్లీ : గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ)పై మోడీ సర్కారు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నది. గత కొన్నేండ్లుగా ఈ పథకాన్ని నీర్చు గార్చే విధంగా కొత్త కొత్త నిబంధనలను తీసుకొస్తూ లబ్దిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నది. కేంద్రం చర్యలతో లక్షలాది మంది లబ్దిదారులు ఈ పథకానికి దూరమవుతున్నారు. గతనెల 10 నుంచి ఈనెల 14 మధ్య దేశ్యాప్తంగా 27 లక్షల మంది ఎంజిఎన్ఆర్ఇజిఎ కార్మికుల పేర్లను డేటా బేస్ నుంచి తొలగించినట్టు తెలుస్తున్నది. ఇందులో మన ఆంధ్రప్రదేశ్ నుంచే అత్యధికంగా 15 లక్షల తొలగింపులు జరగటం గమనార్హం. దీంతో కేంద్రం చేపట్టిన ఇ-కెవైసి, కొత్త డిజిటల్ విధానాలే లబ్దిదారులను ఈ పథకం నుంచి దూరం చేస్తున్నాయని సామాజిక కార్యకర్తలు, మేధావులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇదే సమయంలో 10.5 లక్షల మంది కార్మికులు మాత్రమే కొత్తగా పథకంలోకి చేరారు. కాగా కార్మికుల తొలగింపు అసాధారణంగా ఉన్నదని సామాజిక కార్యకర్తలు, మేధావులతో కూడిన లిబ్ టెక్ అనేపరిశోధనా సంస్థ వెల్లడించింది. గత ఆరు నెలల్లో 15 లక్షల తొలగింపులు జరగగా.. ఒక్క నెలలోనే 27 లక్షల మంది కార్మికులు తొలగింపునకు గురయ్యారని సమాచారం. అంటే దాదాపు రెండు రెట్ల తొలగింపులు జరిగాయి. ఇది పలు అనుమానాలను రేకెత్తిస్తున్నదని సామాజిక కార్యర్తలు అంటున్నారు.

లిబ్‌టెక్ విశ్లేషణ ప్రకారం.. 2025-26 ఆర్థిక సంవత్సరంలోని తొలి ఆరు మాసాల్లో మొత్తంగా 83.6 లక్షల మంది కార్మికులు (నెట్ ఆడిషన్) చేరారు. తొలగింపులు 15.2 లక్షలుగా ఉన్నది. నవంబర్ నెల మధ్య వరకు చూస్తే కార్మికుల చేరికలు 66.5 లక్షలకు పడిపోయాయి. దీంతో ఒక్క నెలలోనే 17 లక్షల మంది కార్మికులు పథకానికి దూరమయ్యారు.

ఇ-కెవైసి పూర్తయిన రాష్ట్రాల నుంచి తొలగింపులు అధికం

కాగా ఇ-కెవైసి పూర్తి చేసిన రాష్ట్రాల్లో ఈ తొలగింపులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 78.4 శాతం మంది ఇ-కెవైసి ప్రక్రియను పూర్తి చేసుకోగా.. అత్యధికంగా 15.92 లక్షల మంది కార్మికులు తొలగింపునకు గురయ్యారు. ఆ తర్వాత 67.6 శాతంతో రెండో స్థానంలో ఉన్న తమిళనాడు నుంచి 30,529 మంది, 66.6 శాతంతో మూడో స్థానంలో ఉన్న ఛత్తీస్‌గఢ్ నుంచి 1.04 లక్షల మంది కార్మికులు డేటా బేస్ నుంచి తొలగించబడ్డారు. అయితే కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ మాత్రం ఈ తొలగింపులకు, ఇ-కెవైసికి సంబంధం లేదని చెప్తోంది.

పథకంలో కొత్త సమస్యలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంస్ యాప్ ద్వారా కార్మికులు రోజుకు రెండుసార్లు ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. కానీ పరిశీలనలో అనేక లోపాలు, సమస్యలు బయటపడ్డాయి. అసలు పనితో సంబంధం లేని ఫొటోలు, ఒకే ఫొటోను పలుసార్లు వాడటం, ఉదయం, మధ్యాహ్నం ఫొటోల్లో కార్మికుల సంఖ్యలు భిన్నంగా ఉండటం, మహిళలు, పురుషుల నిష్పత్తిలో అసమానతలు వంటివి ఇందులో ఉన్నాయి. ఇక 2023 నుంచి తప్పనిసరి చేసిన ఆధార్ ఆధారిత చెల్లింపులతోనూ కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అధికార పత్రాల్లో ఒక్క అక్షరం భిన్నంగా ఉన్నా.. చెల్లింపులు నిలిచిపోయే పరిస్థితులు ఈ పథకంలో ఉన్నాయి.

సరిహద్దు వివాదాల ఊసెత్తని ఒడిశా సిఎం

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ (అల్లూరి జిల్లా)

పాడేరులో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ చేసిన ప్రసంగంలో ఆదివాసీల అసలు సమస్యలను పూర్తిగా విస్మరించారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథం విమర్శించారు. పాడేరు జిల్లా కేంద్రంలో ఆదివారం బిర్సా ముండా జయంతి వేడుకల్లో పాల్గొన ఒడిశా ముఖ్యమంత్రి బిర్సా ముండా వంటి మహానుభావుడి జయంతిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సిగ్గుచేటు చర్య అని ఆయన పేర్కొన్నారు. అరకులోయలో స్థానిక విలేకరులతో కె.లోకనాథం మాట్లాడుతూ, ఒడిశా ముఖ్యమంత్రి తన ప్రసంగంలో రాష్ట్ర సరిహద్దు సమస్యలపై ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం ఆశ్చర్యకరమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దులోని కోటియా పంచాయతీ వంటి ప్రాంతాల్లో ఆదివాసీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నప్పటికీ, వాటిని ప్రస్తావించ లేదన్నారు. గిరిజన మంత్రి సంధ్యా రాణి చేసిన అభ్యర్థనను పక్కన పెట్టి వ్యవహరించడం ఆదివాసీ సమాజానికి అవమానకరమని పేర్కొన్నారు. ఆదివాసీలకు సంబంధించిన పదవులు, ప్రాతినిధ్యం విషయంలో ఒడిశా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ఇది వారి రాజకీయ ఉద్దేశాలను బట్టబయలు చేస్తోందని తెలిపారు .కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని సవరించి బలహీనపరచడం ద్వారా ఆదివాసీల జీవనోపాధిపై పెద్ద దెబ్బ కొట్టిందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పీసా గ్రామ సభకున్న అధికారాన్ని ధిక్కరిస్తూ ఆదేశించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. బిర్సా ముండా ఉత్సవాల పేరుతో ఆదివాసీల భూమి హక్కులు, అటవీ ఉత్పత్తులపై నిర్లక్ష్యం చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగించడం బిర్సా ముండా ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల సమస్యలను పరిష్కరించకుండా, కేవలం ఉత్సవాలు జరపడం ద్వారా బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తోందన్నారు. బిర్సా ముండా వంటి స్వాతంత్ర్య సమరయోధుడు ఆశయాలు ఆదివాసీల భూమి, అటవీ, సంస్కృతి రక్షణపై ఆధారపడి ఉన్నాయని తెలిపారు. ఒడిశా ముఖ్యమంత్రి ప్రసంగం ఈ విషయాలను పూర్తిగా పక్కనపెట్టి, రాజకీయ ప్రకటనలకే పరిమితమైందని విమర్శించారు. ప్రభుత్వాలు తక్షణమే సరిహద్దు సమస్యలు, అటవీ హక్కులు, గిరిజన ప్రాతినిధ్యం విషయాల్లో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స, మండల కార్యదర్శి కె. రామారావు పాల్గొన్నారు.

సూసైడ్ బాంబర్ సహాయకుడి అరెస్టు

- ఢిల్లీ ఎర్రకోట పేలుళ్ల ఘటనలో ఎన్ఐఎ చర్యలు

న్యూఢిల్లీ. ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుళ్ల కుట్రలో భాగమని ఆరోపిస్తూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) సూసైడ్ బాంబర్ ఉమర్‌నబీ సహాయకుడైన ఒకరిని అరెస్టు చేసింది. దాడిలో వినియోగించిన కారును రిజిస్టర్ చేసిన అమీర్ రషీద్ అలీని ఢిల్లీలో అరెస్టు చేసింది. కాశ్మీర్‌లోని పాంపోర్‌లోని సంబూరా నివాసి అయిన నిందితుడు "ఆత్మాహుతి బాంబర్" ఉమర్ ఉన్ నబీతో కలిసి ఉగ్రవాద దాడికి కుట్ర పన్నాడని తమ దర్యాప్తులో తేలిందని ఎన్ఐఎ తెలిపింది. "ఆ కారు కొనుగోలుకు వీలుగా అమీర్ ఢిల్లీకి వచ్చాడు. చివరికి దీనిని పేలుడుకు వాహనంలో ఉపయోగించే ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్‌గా ఉపయోగించారు. "ఉగ్రవాద నిరోధక సంస్థ నబీకి చెందిన మరో వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకుంది. నవంబర్ 10న దేశ రాజధానిని కుదిపేసిన పేలుడులో గాయపడిన వారితో సహా 73 మంది సాక్షులను ఎన్ఐఎ ఇప్పటివరకు విచారించిన కేసులో సాక్ష్యాల కోసం వాహనాన్ని పరిశీలిస్తున్నారు" అని అది తెలిపింది. ఢిల్లీ, జమ్మూ, కాశ్మీర్, హర్యానా , ఉత్తరప్రదేశ్ పోలీసులతో పాటు వివిధ ఇతర ఏజెన్సీలతో సన్నిహిత సమన్వయంతో పనిచేస్తూ, ఎన్ఐఎ అనేక రాష్ట్రాల్లో తన దర్యాప్తును కొనసాగిస్తోంది.

ఘటనాస్థలంలో నిషేధిత 9ఎంఎం కాట్రిడ్జ్‌లు..

ఢిల్లీ కారుబాబు పేలుళ్ల ఘటనాస్థలం నుంచి పోలీసులు మూడు 9ఎంఎం క్యాలిబర్ కాట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నారు.ఈ కాట్రిడ్జ్‌లలో రెండు లైవ్‌గా ఉండగా.. ఒకటి ఖాళీ షెల్ కనిపించింది. ఈ 9ఎంఎం కాట్రిడ్జ్‌లను నిషేధించారు. ప్రధానంగా భద్రతా దళాలు, ప్రత్యేక అధికారాలు ఉన్న వ్యక్తులు మాత్రమే వీటిని వినియోగించేందుకు అనుమతి ఉంది. మిగతా ఎవరూ ఉపయోగించకూడదు.

ఆ 12 మంది వైద్యుల ఫోన్లు స్విచ్ఛాప్..

కారు బాంబు పేలుళ్ల తర్వాత.. నుహ్ సహ ఫరీదాబాద్‌లో పలువురు వైద్యులను అరెస్టు చేశారు. ఆ ఘటన తర్వాత 12 మందికిపైగా వైద్యుల ఫోన్లు స్విచ్ఛాప్ అయ్యాయని.. వారి ఆచూకీని తెలుసుకునేందుకు దర్యాప్తు సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. బాంబుపేలుళ్లలో అత్యంత ప్రమాదకరమైన "ట్రయాసిటోన్ ట్రైపెరాక్సైడ్" (టీపీటీపీ) వాడినట్లు ఫోరెన్సిక్ బృందాలు అనుమానిస్తున్నాయి.ఈ పేలుడు పదార్థం తీవ్రత చాలా అధికంగా ఉంటుందని ప్రపంచ వ్యాప్తంగా జరిగిన వివిధ భారీ పేలుళ్ల ఘటనలో టీఏటీపీనే వాడారని తెలిపాయి. ఈ పేలుడు పదార్థం కచ్చితంగా ఉగ్రవాద సంస్థల నుంచే ఉమర్ కు అంది ఉండవచ్చని లేదా వివిధ రకాల రసాయనాలు ఉమర్ ఎలా సేకరించాడు. అతనికి ఎవరెవరు సహకరించారు అన్న కోణంలోనూ దర్యాప్తు జరుగుతుందని తెలిపారు.

గుజరాత్‌లో దారుణం..

- పెళ్లికి గంట ముందు వధువును హత్య చేసిన వరుడు

గాంధీనగర్ : గుజరాత్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. మరో గంటలో వివాహం జరగాల్సి ఉండగా, కాబోయే భార్యను ఓ యువకుడు అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. పెళ్లి చీర, డబ్బు విషయమై చెలరేగిన చిన్నపాటి గొడవ ఈ ఘోరానికి దారితీసింది. పోలీసుల కథనం ప్రకారం.. భావ్‌నగర్‌కు చెందిన సాజన్ బరయ్య (25), సోని రాథోడ్ (23) గత ఏడాదిగా సహజీవనం చేస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటలకు వీరి వివాహం జరగాల్సి ఉంది. బంధువులు, అతిథులతో వేదిక హడావుడిగా ఉంది. అయితే, పెళ్లికి గంట ముందు.. అంటే రాత్రి 9 గంటల సమయంలో ఇద్దరి మధ్య పెళ్లి చీర, ఖర్చుల గురించి తీవ్ర వాగ్వాదం జరిగింది.ఈ గొడవ తీవ్రరూపం దాల్చడంతో ఆగ్రహంతో ఊగిపోయిన సాజన్, ఇంట్లోని ఇనుప రాడ్‌తో సోనిపై దాడి చేశాడు. ఆమె చేతులు, కాళ్లపై కొట్టి, అనంతరం తలను గోడకు బలంగా బాదాడు. తీవ్ర రక్తస్రావంతో సోని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. అనంతరం నిందితుడు సాజన్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సాజన్‌పై హత్య కేసు నమోదు చేసి, అతడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ పటేల్ తెలిపారు. ఈ ఘటనతో ఇరు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.

సన్ డే... పుస్తక పండగే

పుస్తక అభిమానులతో కిటకిట

పుస్తక ప్రదర్శనను తిలకిస్తున్న బిఆర్ఎయు విసి రజని



ప్రజాశక్తి- అరసవల్లి (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న సిక్కోలు పుస్తక మహోత్సవానికి పుస్తక అభిమానులు పోటెత్తారు. ఆరో రోజు ఆదివారం పాఠకులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమకు నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేశారు. చిన్నారుల కథల పుస్తకాలు మొదలుకొని విద్యార్థులకు అవసరమైన పలు పుస్తకాలు, వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక, అభ్యుదయ సాహిత్య పుస్తకాలు, పలువురు ప్రముఖుల గాథలు ఇలా అన్ని వర్గాలకు చెందిన వందలాది ప్రచురణ సంస్థల పుస్తకాలకు సిక్కోలు పుస్తక మహోత్సవం వేదికగా మారింది. దీంతో చిన్నారులు, విద్యార్థులు, యువత ఇలా వయోబేధం లేకుండా అందరూ పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సైన్స్ వైజ్ఞానిక కార్యక్రమాలు, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలను ఆసక్తిగా పరిశీలించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె.రజని పుస్తక ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి, పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లల్లో నైతిక విలువలు పెరుగుతాయన్నారు.

మహిళలు రచనలు చేయాలి

కాళీపట్నం రామారావు సాహిత్య వేదికపై 'కళింగాంధ్ర సాహిత్యంలో మహిళా, ఆదివాసీ, దళిత ఆవరణాలు' అంశంపై ఆదివారం చర్చాగోష్టి జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ రజని మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా రచనలు చేస్తే మహిళా సమస్యలు మరిన్ని వెలుగులోకి వస్తాయన్నారు. పురుషులతో సమానంగా మహిళా రచయితలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రచయిత్రి కత్తి పద్మ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో మంచి సాహిత్య రచయితలు ఉన్నారని, రచయిత్రిలే కరువయ్యాన్నారు. రచయిత మల్లిపురం జగదీష్ మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలపై కళింగాంధ్ర రచయితలు రచనలు చేసి చైతన్యం తెచ్చారని తెలిపారు. కలమట దాసుబాబు మాట్లాడుతూ ఆదివాసీల జీవితాలు, దళిత మహిళలపై రచనలు చేసిన వారు లేరన్నారు. కారశాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదివాసీ సాహిత్యం అడవితల్లి వేదన నుంచి పుట్టిందని తెలిపారు. రచయిత నాగరాజు మాట్లాడుతూ గిరిజన మహిళల గురించి రచనలు రావడం లేదన్నారు. అనంతరం రచయితలు కంచరాన భుజంగరావు, ఎల్.ఎన్ కొల్లి రచించిన 'పెయిన్స్ అండ్ గ్రెయిన్స్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. మల్లిపురం జగదీష్ రచించిన 'అడవి పూలదారిలో' పుస్తకాన్ని రచయిత పక్కి రవీంద్రనాథ్ పరిచయం చేశారు. ఆ తర్వాత కవితా పఠనం నిర్వహించారు. సిక్కోలు జానపద, సాహిత్య కళావేదిక ఆధ్వర్యాన జానపద గేయాలను ఆలపించారు. రచయిత కె.తిరుమలరావు 'భారత రాజ్యాంగం' పాట పాడి వినిపించారు. కె.ఎ రాములు ఆధ్వర్యంలో గజల్స్ వాద్య సంగీతం ఆకట్టుకుంది. అనంతరం జానపద గేయాలతో నృత్యాలు అలరించాయి.

మన్యానికి దారేది?

- తప్పని డోలీ మోతలు
- రోడ్డు లేక కాలిబాటే శరణ్యం

రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న వాడబాయి రహదారి

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం మండలంలోని పలు గిరి శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో నేటికీ గిరిజనులకు కాలిబాట తప్పడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణించే వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వారపు సంతలకు వస్తుంటారు. ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మారుతున్నా ఏజెన్సీలో రోడ్ల స్థితిగతులు మాత్రం మారలేదు. దీంతో, అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం వెళ్లాలంటే నేటికీ డోలీ మోతే శరణ్యం అవుతోంది. మండలంలో 27 పంచాయతీలు ఉన్నాయి. వాడబాయి, శిఖర పాయి, అడ్డంగి జంగిడి భద్ర, వామాసి, దేరుగండ, కప్పకల్లు, వనకాబడి వాడపుట్టి, జోగిపురం, కొండ బిన్నిడి, బయ్యాడ, వల్లాడ తదితర కొండ శిఖర గ్రామాల్లో ఎక్కువ శాతం మంది గిరిజనులు నివసిస్తున్నారు. ఈ గ్రామాలకు నేటికీ రోడ్డు మార్గం లేకపోవడంతో రాళ్లు తేలిన రహదారిపై నడుస్తూ బయట ప్రాంతాలకు వస్తున్న పరిస్థితి. గతంలో కొన్నిచోట్ల రహదారులకు మట్టి వేసి వదిలేయడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో, వాహనాల రాకపోకలు అతి కష్టంగా మారాయి. ప్రమాదకర స్థితిలో వాహనాలపై ప్రయాణించాల్సిన పరిస్థితి. రోడ్లు అభివృద్ధికి నోచుకోక గిరిజనులు నేటికీ వెనుకబాటు జీవనం గడుపుతున్నారు. విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక వసతులు మెరుగుపడని పరిస్థితి. వాడబాయి రహదారి రాళు తేలి అధ్వానంగా ఉంది. మొంథా తుపాను వల్ల కురిసిన భారీ వర్షాలకు గండిపాక ఇజ్జకాయ్ రహదారికి గండిపడింది.

మొంథా తుపానుకు గండిపడిన గండిపాక ఇజ్జకాయ్ రహదారి

రోడ్డు లేక అభివృద్ధికి దూరం

రోడ్డు మార్గం లేక గిరిశిఖర గ్రామాల గిరిజనులు నేటికీ కనీస అవసరాలకు నోచుకోక అభివృద్ధికి దూరంగా ఉన్నారు. గ్రామాలకు రోడ్లు వేయండంటూ ఎన్నోసార్లు ధర్నాలు, వినతులు ఇచ్చినా స్పందన అంతంత మాత్రమే. టిడిపి కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లు వేసి అభివృద్ధికి సహకరించాలి.

\- ఎం.సన్యాసిరావు,
సిపిఎం మండల నాయకులు

ప్రజాస్వామ్య పునాదులపై ఎస్ఐఆర్ దాడి

- 12 రాష్ట్రాలు లక్ష్యంగా బిజెపి, ఆర్ఎస్ఎస్ ఉమ్మడి రాజకీయ ప్రాజెక్టు
- మహిళలు, దళితులు, ఆదివాసీలపై పెరిగిన దాడులు
- సిపిఎం పొలిట్‌బ్యూరో ఆందోళన
- ప్రజా వ్యతిరేక విధానాలపై ఉమ్మడి పోరాటాలకు పిలుపు
- తీవ్ర పేదరికాన్ని అరికట్టిన కేరళకు అభినందనలు

న్యూఢిల్లీ : బీహార్ శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) చేపట్టిన వివాదస్పద ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇది ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియ కాదని, ఆర్ఎస్ఎస్, బిజెపి ఉమ్మడి రాజకీయ ప్రాజెక్టు అని పేర్కొంది. అలాగే దేశంలో మహిళలు, దళితులు, ఆదివాసీలపై దాడుల పెరుగుదలకు ఆర్ఎస్ఎస్ జొప్పిస్తున్న విద్వేషపూరిత మనువాద భావజాలమే కారణమని పేర్కొంది. దేశంలో నిరుద్యోగం పెరిగిపోవడం, వేతనాలు తగ్గిపోతుండటం మొత్తం దేశ ఆర్థిక స్థితి ఏమాత్రం సవ్యంగా లేదన్న గణాంకాల పట్ల సిపిఎం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిపక్షాలు మరింత సమిష్టి కార్యాచరణతో ఉమ్మడి పోరాటాలను నిర్మించాలని పిలుపునిచ్చింది. ఈ నెల 13, 14 తేదీల్లో న్యూఢిల్లీలో సిపిఎం పొలిట్‌బ్యూరో సమావేశమైంది. పార్టీ కేంద్ర కమిటీ తదుపరి సమావేశాన్ని వచ్చే ఏడాది జనవరి 16-18 తేదీలలో కేరళలోని తిరువనంతపురంలో నిర్వహించాలని నిర్ణయించింది. జాతీయ, అంతర్జాతీయ తాజా పరిణామాలపై సమావేశంలో తీర్మానించిన అంశాలతో ఆదివారం నాడు ప్రకటన విడుదల చేసింది. ఆ వివరాలు..

బీహార్ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం.. ధన ప్రవాహం

బీహార్ శాసనసభ ఎన్నికలలో రికార్డు స్థాయిలో 67 శాతం పోలింగ్ జరిగింది. గత ఎన్నికలతో పోలిస్తే ఇది 9.6 శాతం అధికం. గమనించదగిన విషయమేమంటే 71.6 శాతం మంది మహిళలు ఓటేశారు. గణనీయంగా పెరిగిన మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని ఇది సూచిస్తోంది. వివిధ పార్టీలకు లభించిన ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే 2024 లోక్‌సభ ఎన్నికలలో సాధించిన ఓట్లతో పోలిస్తే ఎన్డీఏకు పెద్దగా పెరిగిందేమీ లేదు. అయినప్పటికీ రాష్ట్ర శాసనసభలో తన బలాన్ని పెంచుకోగలిగింది. ఎన్నికల సమయంలో అధికార కూటమి అధికార యంత్రాంగాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంది. అనేక అవకతవకలకు పాల్పడింది. పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేసింది. రాష్ట్రం వెలుపలి నుంచి భారీగా కార్యకర్తలను రప్పించింది. మత, కుల తత్వాలను రెచ్చగొడుతూ తమ నేతలు చేసిన ప్రసంగాలతో ఆయా సమాజాల ఓటర్లను సమీకరించి ఎన్‌డిఎ ప్రయోజనం పొందింది. ప్రధాని, హోం మంత్రి సహా కూటమి నేతలందరూ అలాంటి ప్రసంగాలే చేశారు. వీరి వాక్చాతుర్యానికి కార్పొరేట్ మీడియా ఆజ్యం పోసింది. దీంతో మహాగఠ్‌బంధన్ లేవనెత్తిన అనేక ప్రజా సమస్యలు మరుగునపడి పోయాయి.

బిజెపిని ఓడించాలంటే ప్రతిపక్ష పార్టీలు మరింత సంఘటిత ప్రయత్నాలు జరిపి దాని ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికి ఉమ్మడి పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉన్నదని బీహార్ ఎన్నికలు నిరూపించాయి. కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాత వైఖరిని సిపిఎం సవివరంగా పరిశీలిస్తుంది. ఫలితాలకు సర్ ప్రక్రియ, ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనే విషయాన్ని అధ్యయనం చేస్తుంది. తమ పార్టీ అభ్యర్థులతో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు కూడా ఓటు వేసిన ఓటర్లకు సిపిఎం కృతజ్ఞతలు తెలిపింది.

ఢిల్లీ పేలుళ్ల..ప్రభుత్వ వైఫల్యం

ఢిల్లీలో జరిగిన బాంబు దాడి వెనుక విస్తృత నెట్‌వర్క్ ఉన్నదన్న విషయం స్పష్టమవుతోంది. ప్రజలకు భద్రత కల్పించడంలోనూ, ఇలాంటి ఉగ్ర దాడులను అడ్డుకోవడంలోనూ ప్రభుత్వ వైఫల్యం ఈ ఘటనతో మరోసారి బయటపడింది. పహల్గాం దాడి తర్వాత తాను చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలు...ముఖ్యంగా జైషే మహమ్మద్ కేంద్ర కార్యాలయం... ధ్వంసమయ్యాయని ప్రభుత్వం చెప్పుకుంది. తాజా దాడికి జైషే కారణమని ప్రభుత్వం తెలపడంతో ఆ వాదనల్లో పస లేదని తేలిపోయింది. దాడులకు కారణమైన ఉగ్రవాద వ్యవస్థలను కనిపెట్టి, కుట్రదారులందరినీ చట్టం ముందు నిలపడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. ఈ ఘటనను సాకుగా చూపించి మత ప్రాతిపదికన సమాజాన్ని విభజించడానికి జరుగుతున్న ప్రయత్నాలను గట్టిగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది.

దుస్థితిలో ఆర్థిక వ్యవస్థ

మన ఆర్థిక వ్యవస్థ సరిగా లేదని ఇటీవల విడుదలైన గణాంకాలు చెబుతున్నాయి. నిరుద్యోగం, ఉద్యోగావకాశాలు లేకపోవడం, వేతనాలలో పెరుగుదల లేకపోవడం వంటివి ప్రజలలో వ్యతిరేకతకు కారణమవుతున్నాయి. ప్రభుత్వం విదేశీ పెట్టుబడిదారులకు ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరుస్తూ అమెరికా, ఈయూల

తో ఎఫ్‌టీఏలు కుదుర్చుకుంది. అమెరికా విధించిన సుంకాల కారణంగా మన ఎగుమతులు 37.5 శాతం పడిపోయాయి. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోని పక్షంలో గతంలో బలమైన స్థానంలో ఉన్న రంగాలలో కూడా మార్కెట్ వాటాను కోల్పోయే ప్రమాదం ఉంది.

కార్మికుల హక్కులను నిర్వీర్యం చేసేందుకే..'శ్రమశక్తి నీతి'

కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన 'శ్రమ శక్తి నీతి' ముసాయిదా యొక్క ప్రధాన లక్ష్యం కార్మికులకు లభిస్తున్న రక్షణలను, వాటిని అమలు చేసే యంత్రాంగాన్ని, ఉమ్మడి బేరసారాల హక్కులను నిర్వీర్యం చేయడమే. ఈ బిల్లు మనుధర్మ శాస్త్రాల' నుంచి ప్రేరణ పొందింది. ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర రాజ్యాంగంపై ప్రత్యక్షంగా దాడి చేస్తోంది. ఆర్థిక పరమైన ప్రోత్సాహకాలను ఉపయోగించుకొని కార్పొరేట్ అనుకూల కార్మిక కోడ్లను అమలు చేయాల్సిందిగా రాష్ట్రాలను బలవంతం చేయడం ద్వారా సమాఖ్య నిర్మాణాన్ని కేంద్రం బలహీనపరుస్తోంది. లేబర్ కోడ్ల అమలుకు ఇది ఓ మోసపూరిత ప్రయత్నం. ప్రభుత్వ కార్పొరేట్, హిందూత్వ నిరంకుశ పాలనకు అనుగుణంగా దీనిని రూపొందించారు.

బిజెపి- ఆర్ఎస్ఎస్ ఉమ్మడి రాజకీయ ప్రాజెక్టు

పన్నెండు రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకొని కొనసాగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) అనేది బిజెపి -ఆర్ఎస్ఎస్‌ల రాజకీయ ప్రాజెక్ట్. దీనిని కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా అమలు చేస్తున్నారు. ఇది లక్షలాది మంది ఓటర్ల ఓటు హక్కును ఓ పద్ధతి ప్రకారం తొలగించేందుకు ఉద్దేశించబడింది. వివాదాస్పదమైన బీహార్ ప్రక్రియ ఆధారంగా డాక్యుమెంటేషన్‌ను మరింత కఠినతరం చేసుకుంటూ, 2002 నాటి పురాతన బేస్‌లైన్‌ను ఉపయోగించుకొని దొడ్డిదారిన జాతీయ పౌరసత్వ రిజిస్టరుగా (ఎన్ఆర్‌సి) వ్యవహరించే ప్రయత్నం. ఓటర్లను పాలక పార్టీకి అనుకూలంగా మార్చడం, సార్వత్రిక వయోజన ఓటు హక్కు పునాదులను దెబ్బతీయడం దీని ఉద్దేశం. ఎన్నికల ప్రజాస్వామ్యంపై జరుగుతున్న అతి ముఖ్యమైన దాడిగా దీనిని చూడాల్సి ఉంటుంది.

పౌరసత్వాన్ని నిర్ణయించే హక్కును లాక్కోవడానికి ఇసి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా పార్టీ విస్తృత ప్రచారం చేస్తుంది. అప్రమత్తంగా ఉండాలని, నకిలీ ఓటర్లు ఓటరు జాబితాలలో పేర్లు నమోదు చేసుకోకుండా చూసుకోవాలని ప్రజలను కోరింది.

మహిళలు, దళితులు, ఆదివాసీలపై పెరుగుతున్న దాడులు

దేశంలో మహిళలు, దళితులు, ఆదివాసీలపై దాడులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వ పాలనలో గత 11 సంవత్సరాల కాలంలో ఆయా వర్గాలపై దాడులు బాగా పెరిగాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో విడుదల చేసిన అధికారిక డేటా చెబుతోంది. ఈ దాడులు బిజెపి, ఆర్ఎస్ఎస్, దాని అనుబంధ సంస్థలు ప్రచారం చేస్తున్న మనువాద భావజాలానికి ప్రతిబింబాలు.

వెనిజులాకు సంఘీభావం

వెనిజులాపై సైనిక దాడిని ప్రారంభించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నానని అమెరికా ప్రకటించింది. ఆ ప్రాంతంలో పదివేలకు పైగా సైనిక సిబ్బందిని మోహరించింది. అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొంటున్నందునే వెనిజులాపై అమెరికా ఈ చర్యకు దిగుతోంది. అమెరికా దుందుడుకు యత్నాలను పొలిట్‌బ్యూరో ఖండించింది. వెనిజులా ప్రజలకు సంఘీభావం తెలిపింది.

గాజాలో కాల్పుల విరమణతో కొంత ఊరట

గాజాలో కాల్పుల విరమణ, ఇజ్రాయిల్ దాడులకు ముగింపు వంటి పరిణామాలు దీర్ఘకాలం ఎదుర్కొంటున్న సమస్యల నుంచి ప్రజలకు కొంత ఊరట కల్పించాయి. అయితే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయిల్ ఉల్లంఘిస్తూనే ఉంది. ఇజ్రాయిల్ విషయంలో భారత ప్రభుత్వం తన విధానాన్ని సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఆ దేశంతో రక్షణ, భద్రతా సంబంధాలను తెగతెంపులు చేసుకోవాలి. పాలస్తీనాకు సంఘీభావం తెలియజేయాలి.

స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా అమెరికాతో రక్షణ భాగస్వామ్యం

భారత్-అమెరికా దేశాల మధ్య రక్షణ భాగస్వామ్యానికి సంబంధించిన పది సంవత్సరాల సహకార ఫ్రేమ్‌వర్క్ నిబంధనలు మన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తాయి. అమెరికా ఆదేశాలకు మన సైనిక, విదేశాంగ విధానాలు కట్టుబడి ఉండాల్సి వస్తుంది. అమెరికాపై సాంకేతికంగా మరింతగా ఆధారపడాల్సి వస్తుంది. ప్రాంతీయ ఘర్షణ ప్రమాదం పెరుగుతుంది. చైనాను అడ్డుకోవడం, అమెరికా నేతృత్వంలోని సైనిక నిర్మాణంలో మన దేశాన్ని అధికారికంగా కట్టిపడేయడం దీని ఉద్దేశమని ఒప్పందంలో స్పష్టంగా ఉంది. మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మన దేశాన్ని అమెరికా కబంధ హస్తాలలోకి లోతుగా నెట్టివేస్తుండడాన్ని పొలిట్‌బ్యూరో ఖండించింది.

అలాగే దేశంలోని వివిధ రంగాలలో అమెరికా వస్తువులకు విస్తృత మార్కెట్ ప్రవేశం కల్పించేందుకు ఉద్దేశించిన వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయాల్సిందిగా మన దేశంపై అమెరికా ఒత్తిడి తెస్తోంది.

ఈ ఒత్తిడికి ప్రభుత్వం లొంగిపోతోందని వార్తలు వస్తున్నాయి. మన ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఒప్పందంపై సంతకం చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.

ఇంధన సార్వభౌమత్వంపై ప్రయివేటు గుత్తాధిపత్యం

రానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవడానికి ఉద్దేశించిన నూతన బిల్లు ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం దూకుడుగా అడుగులు వేస్తోంది. విద్యుత్ రంగం యొక్క స్వభావాన్ని పూర్తిగా మార్చేసి దానిని ఆర్థికంగా, లాభదాయకంగా నడిచే మార్కెట్‌గా రూపొందించడమే ఈ బిల్లు లక్ష్యం. బిల్లుకు ఆమోదం లభిస్తే వ్యవసాయ, గృహ వినియోగదారులకు భారీగా టారిఫ్ షాక్ ఇస్తుంది. రాష్ట్ర డిస్కమ్‌లు నిర్వీర్యమవుతాయి. జాతీయ ఇంధన సార్వభౌమత్వం ప్రైవేటు గుత్తాధిపత్యం చేతిలోకి వెళుతుంది. ఫెడరలిజం, జీవనోపాధి హక్కుపై ఈ బిల్లు నేరుగా దాడి చేస్తోంది.

బిల్లులో చేసిన ప్రతిపాదిత మార్పులపై సిపిఎం ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తుంది. విద్యుత్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఇప్పటికే పోరాటానికి నేతృత్వం వహిస్తున్న కార్మిక, రైతు సంఘాలకు మద్దతు ఇస్తుంది. ఈ పోరాటంలో చేయి కలిపి దానిని బలోపేతం చేయాలని సమాజంలోని అన్ని వర్గాలకూ పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

కేరళ చారిత్రక విజయం

రాష్ట్రంలో తీవ్ర దారిద్ర్యాన్ని అంతం చేసే విషయంలో చారిత్రక విజయం సాధించామని నవంబర్ 1వ తేదీన కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రకటించింది. తీవ్ర దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాన్ని (ఇపిఇపి) అత్యంత జాగరూకతతో, ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం వల్లనే ఇది సాధ్యపడింది. స్థానిక సంస్థల భాగస్వామ్యంతో నాలుగు సంవత్సరాల డేటా ఆధారంగా 64,006 కుటుంబాలను గుర్తించి వారి అవసరాలను తీర్చడం జరిగింది. ప్రగతిశీల రాజకీయాలు, వికేంద్రీకృత పాలనపై ఆధారపడిన కేరళ అభివృద్ధి నమూనా సమర్థతకు ఈ విజయం నిదర్శనం. కేంద్ర ప్రభుత్వం నిరంతరం ఆర్థికపరమైన యుద్ధం చేసినప్పటికీ, ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు నిధుల కొరత కలిగించినప్పటికీ కేరళ ఈ విజయాన్ని సాధించింది. పరిమితులు ఉన్నప్పటికీ రాజకీయ సంకల్పం, నిబద్ధత ప్రదర్శించడం ద్వారా వామపక్ష ప్రభుత్వం ఉన్నత సంక్షేమ ఫలితాలు సాధించగలిగింది. కాబట్టి ఈ విజయాన్ని అత్యంత ముఖ్యమైనదిగా చూడాల్సి ఉంటుంది.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎల్‌డిఎఫ్ అభ్యర్థులకు ఓటు వేయాల్సిందిగా కేరళ ప్రజలకు పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది. యుడిఎఫ్‌ను, బిజెపి వంటి మతతత్వ శక్తులను ఓడించాలని పిలుపునిచ్చింది. బిజెపి, ఇతర మతతత్వ శక్తులతో యుడిఎఫ్ చేతులు కలిపిన విషయం నిరూపితమవుతోంది.

యుపిలో కుప్పకూలిన క్వారీ

- ముగ్గురు మృతి

లక్నో : ఉత్తర్‌ప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లా ఓబ్రా ప్రాంతంలోని బిల్లీ మార్కుండి మైనింగ్ ఏరియాలోని ఓ క్వారీలో శనివారం రాత్రి ఒక భాగం కూలిపోయి కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. ఎనిమిది మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకు పోయినట్టు తెలుస్తోంది. ఎంతమంది కార్మికులు చిక్కుకున్నారనే స్పష్టమైన సమాచారం ఇంకా తెలియలేదు. అలాగే ఇంకెంతమంది చనిపోయారన్న దానిపై స్పష్టత లేదు. అయితే అప్రమత్తమైన అధికారులు సహాయకచర్యలు చేపట్టారు. శిథిలాల కింద చిక్కుకున్నవారిని బయటకు తీసుకొచ్చేందుకు ఎస్‌డీఆర్ఎఫ్ (రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం) బృందం వెంటనే రంగంలోకి దిగింది. అదనపు సహాయం కోసం వారణాసి నుంచి ఎన్‌డిఆర్ఎఫ్ (జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం) బృందం కూడా చేరుకుంది. ప్రస్తుతం ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు సంయుక్తంగా శ్రమిస్తున్నాయి.

అకస్మాత్తుగా కూలటంతోనే...

రోజువారీ మాదిరిగానే శనివారం సాయంత్రం కూడా కార్మికులు తమ పనిలో నిమగ్నమై ఉండగా, అకస్మాత్తుగా గోడ కూలిపోయినట్టు అధికారులు తెలిపారు. కార్మికులు అప్రమత్తమయ్యే లోపే పెద్ద పెద్ద బండరాళ్లు వారిపై పడినట్టు వెల్లడించారు. అయితే ఈ గని 500 మీటర్లకు పైగా లోతుగా ఉండటం, రాత్రి చీకటి కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పోక్లెయిన్ యంత్రాలు, జనరేటర్లు తెప్పించి రాత్రి రెస్క్యూ ఆపరేషన్‌ను వేగవంతం చేశారు. శిథిలాల కింద 12 మంది వరకు చిక్కుకొని ఉండొచ్చని స్థానిక మంత్రి సంజీవ్ కుమార్ గోండ్ తెలిపారు.

రాజస్తాన్‌లో ఘోర ప్రమాదం

- ఆరుగురు యాత్రికులు మృతి
- 14 మందికి తీవ్ర గాయాలు

జోధ్‌పూర్ : రాజస్తాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జోధ్‌పూర్-జైసల్మేర్ జాతీయ రహదారిపై రామ్‌దేవ్రాకు యాత్రికులతో వెళ్తున్న టెంపోను బాలేసర్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ట్రక్కు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు యాత్రికులు మృతి చెందారు. 14 మందికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను జోధ్‌పూర్‌లోని ఎండిఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులంతా గుజరాత్‌లోని సబర్కాంత జిల్లా వాసులుగా అధికారులు గుర్తించారు. మిల్లెట్ లోడ్‌తో వెళ్తున్న ట్రక్కు వేగంగా వెళ్తూ నియంత్రణ కోల్పోయి ఎదురుగా వస్తున్న టెంపోను ఢీకొట్టిందని బాలేసర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి మూల్ సింగ్ భాటి తెలిపారు.

మెక్సికోలో జెన్-జెడ్ నిరసనలు

- దేశంలో నేరాలు, అవినీతికి వ్యతిరేకంగా ఆందోళన
- పోలీసులు, నిరసనకారులకు మధ్య ఘర్షణ
- 120 మందికి గాయాలు

నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

మెక్సికోసిటీ : ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో జెన్-జెడ్ నిరసనలు అక్కడి ప్రభుత్వాలను వణికిస్తున్నాయి. ఇప్పుడు ఈ ఆందోళనలు మెక్సికోకూ పాకాయి. దేశంలో పెరుగుతున్న నేరాలు, అవినీతికి వ్యతిరేకంగా, చట్టరక్షణలో ప్రభుత్వ వైఫల్యంపై జెన్-జెడ్ నిరసన గళం విప్పింది. పెద్ద ఎత్తున ఆందోళనకు దిగింది. అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు జరిపింది. దేశంలో హింసను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశ అధ్యక్షురాలు క్లాడియా షిన్‌బామ్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వారు అధ్యక్ష భవనం నేషనల్ ప్యాలెస్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు, నిరసనకారుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. ఈ చర్యతో నిరసనకారులను అణచివేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. వారిపై టియర్‌గ్యాస్ ప్రయోగించారు. ఈ ఘర్షణల్లో 100 మంది పోలీసులకు గాయాలయ్యాయని అక్కడి అధికారులు చెప్పారు. వీరిలో 40 మంది ఆస్పత్రి పాలయ్యారని వివరించారు. అలాగే మరో 20 మంది యువత గాయపడ్డారనీ, 20 మందిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు.

నిరసనలు దేనికి?

ఈనెల 1న మెక్సికో పశ్చిమ రాష్ట్రమైన మికోకాన్‌లోని ఉరుపాన్ నగర మేయర్.. కార్లోస్ మంజో దారుణ హత్యకు గురయ్యారు. నేరాలకు వ్యతిరేకంగా పోరాడిన ఈయన మరణం.. సంచలనంగా మారింది.

ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను దుండగులు కాల్చి చంపారు. దీంతో కార్లోస్ మంజో దారుణ హత్య దేశవ్యాప్తంగా యువతలో ఆగ్రహావేశాల్ని రేపింది. ప్రభుత్వాలు హింసను అరికట్టడంలో విఫలమయ్యాయని ఆందోళనలకు దిగారు. మెక్సికో సిటీతో పాటు పలు నగరాల్లో వేలాది మంది యువత ప్రదర్శనలు చేపట్టారు. ఈ ఆందోళనల్లో భాగంగానే నిరసనకారులు అధ్యక్ష భవనం ముట్టడికి ప్రయత్నించారు. కాగా షీన్‌బామ్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలో ఆమెకు 70 శాతానికి పైగా అప్రూవల్‌రేటింగ్ ఉన్నది. అయినప్పటికీ పెరుగుతున్న నేరాలు, అవినీతి వంటి అంశాలు ఆమెకు ప్రతికూలంగా మారాయి. ఇందులో భాగంగా తాజా ఆందోళనలు చోటు చేసుకున్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

ఫిలిప్పీన్స్‌లో అవినీతిపై భారీ పోరాటం

మనీలా: ప్రాజెక్టుల్లో జరిగిన వేల కోట్ల రూపాయల అవినీతికి వ్యతిరేకంగా ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా దద్దరిల్లింది. వేలాది మంది ఆందోళనాకారులు రోడ్డెక్కారు. ఈ భారీ అవినీతి విషయంలో ప్రభుత్వ జవాబుదారీతనాన్ని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇగ్లేసియా ఎన్ఐ క్రిస్టో ఆధ్వర్యంలో జరిగిన మూడు రోజుల ర్యాలీ శనివారం ప్రారంభమైంది. దాదాపు 27వేల మంది మనీలాలోని రిజాల్ పార్క్‌లో గుమిగూడారు. ఫ్లడ్ కంట్రోల్ పేరిట నకిలీ ప్రాజెక్టులు చేపట్టారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి ప్రమాణాలనూ పాటించలేదని ఆరోపించారు. ఈ నిరసనలో ప్రధానంగా ప్రభుత్వ పర్యవేక్షణను కోరారు. వరద-నియంత్రణ ప్రాజెక్టుల్లో భారీ అవినీతి జరిగిందని ఆందోళనాకారులు ఆరోపించారు. ప్రాజెక్టులను దక్కించుకోవడం కోసం రాజకీయ నాయకులు, అధికారులను ప్రసన్నం చేసుకోవడానికి కంపెనీలు ప్రయత్నించాయనీ, ఇందులో వందల కోట్ల అవినీతి జరిగిందని అన్నారు. ఈ మేరకు నిరసనకారులు ప్లకార్డులను చేతబూనీ, అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు వినిపించారు. ప్రభుత్వ జోక్యాన్ని కోరారు. ఈ కుంభకోణంలో ప్రధానంగా పలువురు ప్రభుత్వ పెద్దలు, ఎంపీలు, వ్యాపారవేత్తల పేర్లు వినిపిస్తున్నాయి. కాగా ఆ దేశ అధ్యక్షుడు మార్కోస్ మాట్లాడుతూ.. దోషులు క్రిస్మస్‌కు ముందే జైలులో ఉంటారని హెచ్చరించారు. అధ్యక్షుడు ఏర్పాటు చేసిన స్వతంత్ర కమిటీ ఇప్పటికే 37 మందిపై అవినీతి కేసులు పెట్టగా.. 86 మంది కాంట్రాక్టర్లపై భారీ పన్ను ఎగవేత కేసులు నమోదయ్యాయి.

సౌదీకి అమెరికా ఎఫ్-35 యుద్ధ విమానాలు

వాషింగ్టన్ : ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాలను సరఫరా చేయాల్సిందిగా సౌదీ అరేబియా చేసిన అభ్యర్థనకు అమెరికా అంగీకారం తెలపబోతోంది. యుద్ధ విమానాల సరఫరాకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకునే విషయాన్ని పరిశీలిస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఈ విమానాలను లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఉత్పత్తి చేస్తోంది. 'అనేక జెట్ విమానాలను కొనుగోలు చేయాలని సౌదీ అనుకుంటోంది' అని ట్రంప్ చెప్పారు. 'ఈ అంశాన్ని పరిశీలించాల్సిందిగా వారు కోరారు. నేను పరిశీలిస్తాను. వారు ఎఫ్-35 విమానాలను కోరుకుంటున్నారు' అని ఆయన అన్నారు. సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ మంగళవారం అమెరికాలో పర్యటిస్తారు. ఈ సందర్భంగా యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉంది. అంతేకాక ఆర్థిక, రక్షణ ఒప్పందాలు కూడా కుదుర్చుకుంటారు.

చర్చలపై అడిగిన ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ 'అది సమావేశం కంటే మిన్న. మేము వారిని గౌరవించబోతున్నాం' అని చెప్పారు. అబ్రహం ఒప్పందంలో సౌదీ చేరుతుందన్న ఆశాభావాన్ని ఆయన మరోసారి వ్యక్తపరిచారు. ఇజ్రాయిల్, ముస్లింల ప్రాబల్యం అధికంగా ఉన్న దేశాల మధ్య సాధారణ సంబంధాలు నెలకొల్పేందుకు ఈ ఒప్పందాన్ని ఉద్దేశించారు. అయితే పాలస్తీనాకు రాజ్య హోదా కల్పించేందుకు ఓ కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకునే ఒప్పందాన్ని అది అడ్డుకుంటుందని సౌదీ వాదిస్తోంది. కాగా సౌదీతో ఎఫ్-35 విమానాల ఒప్పందాన్ని కుదుర్చుకుంటే చైనా ఆ యుద్ధ విమానాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుంటుందని అమెరికా రక్షణ శాఖకు చెందిన ఇంటెలిజెన్స్ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది.

బరితెగించిన అస్సాం మంత్రి

- ముస్లింలు లక్ష్యంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు
- బీహార్ ఫలితాల తర్వాత బరితెగింపు

గౌహతి : బిహార్ ఎన్నికల ఫలితాల తర్వాత అస్సాం ఆరోగ్య శాఖ మంత్రి అశోక్ సింఘాల్ బరితెగించి మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. బీహార్‌లో 1989లో 116 మంది ముస్లింలను దారుణంగా చంపేసి..ఆధారాలు దొరక్కుండా మృతదేహాలను గోబి (కాలీఫ్లవర్) పొలాల్లో పూడ్చేశారు. చరిత్రలో చీకటి సంఘటనను మళ్లీ గుర్తు చేసేలా అదే రీతిలో ముస్లింలను వెంటాడుతామనే అర్థంలో ..'గోబీ సాగుకు బీహార్ ఆమోదం' అంటూ సోషల్ మీడియా వేదికగా అశోక్ సింఘాల్ పోస్టు చేశారు. బిజెపి నేత బరితెగించి చేసిన ఈ విద్వేషపూరిత వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

1989లో ఏం జరిగిందంటే..

బీహార్‌లో 1989 అక్టోబర్‌లో రామజన్మ భూమి అంశంపై విశ్వ హిందూ పరిషత్ నిర్వహించిన ర్యాలీలు హింసాత్మకంగా మారాయి. భాగల్పూర్ నగర సమీపంలోని లోగైన్ గ్రామంలో మైనార్టీల నివాసాలపై మతోన్మాదులు దాడి చేశారు. 116 మంది ముస్లింలను ఉచకోత కోసారు. ఆధారాలు దొరక్కుండా మృతదేహాలను సమీపంలోని గోబి పొలాల్లో పూడ్చిపెట్టారు. ఈ సంఘటన నాడు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అప్పటి నుండి మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి 'గోబి పంట' ఫొటోను మతోన్మాదులు సోషల్ మీడియాలో ఉపయోగిస్తున్నారు.

సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి ఖండన

అస్సాం బిజెపి మంత్రి అశోక్ సింఘాల్ వ్యాఖ్యలను భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబి తీవ్రంగా ఖండించారు. చరిత్రలో అత్యంత చీకటి సంఘటనను గుర్తుచేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. 1989 అక్టోబర్ 27న లోగైన్ గ్రామంలో అత్యంత పాశవికంగా పిల్లలు, మహిళలతో సహా 116 మందిని హతమార్చి గోబి పంటపొలాల్లో సామూహికంగా సమాధిచేసారని గుర్తుచేశారు. ఈ చిత్రాలను ఉద్దేశపూర్వకంగా ముస్లింలను కించపరిచేందుకు బిజెపి మంత్రి పోస్ట్ చేశారని విమర్శించారు. సబ్‌కా సాత్ -సబ్‌కా వికాస్ అని ప్రచారం చేసుకుంటున్న బిజెపి అగ్ర నాయకత్వం రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అశోక్ సింఘాల్‌పై చర్యలు తీసుకుంటుందా? అని ప్రశ్నిస్తూ ఆదివారం సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

2027లో ఇస్రో మానవ సహిత అంతరిక్ష యాత్ర

న్యూఢిల్లీ : ఇస్రో తన మొదటి మానవసహిత అంతరిక్ష యాత్ర 2027లో నిర్వహించనుంది. ఈ విషయాన్ని ఇస్రో చైర్మన్ వి నారాయణ్ జాతీయ మీడియాకిచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. అలాగే ఇస్రో మరో 7 కీలక ప్రయోగాలను నిర్వహించనుందని చెప్పారు. చంద్రయాన్-4 ప్రయోగం ద్వారా చంద్రుడి దక్షిణ ధ్రువంలోని వాటర్ ఐస్‌ను అధ్యయనం చేయనున్నారు. ఇది ఇస్రో చరిత్రలోనే అత్యంత క్లిష్టమైన అంతరిక్ష యాత్రలో ఒకటిగా ఆయన పేర్కొన్నారు. దీంతో పాటు జపాన్ ఏరోస్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీతో కలిసి సంయుక్తంగా మిషన్ లూపెక్స్ అనే కార్యక్రమం కూడా చేయనున్నారు. చంద్రయాన్ -4లో చంద్రుడి నమూనాలనున భూమికి తీసుకురావడాన్ని లక్ష్యంగా ఇస్రో పెట్టుకుంది. ఇప్పటి వరకు అమెరికా, చైనాలు మాత్రమే ఇలాంటి విజయవంతమైన ప్రయోగాలు నిర్వహించాయి. సొంతగా అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇస్రో భావిస్తోంది. దీనికి ప్రక్రియ ప్రారంభించినట్లు నారాయణన్ చెప్పారు. ఐదు మాడ్యూళ్లతో ఈ కేంద్రాన్ని 2028లో కక్ష్యలో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. దీనిని 2035 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం నాసా ఐఎస్ఎస్, చైనీస్ అంతరిక్ష సంస్థకు తియాంగాంగ్‌కు మాత్రమే సొంత అంతరిక్ష కేంద్రాలు ఉన్నాయి.

'అణు' శుద్ధికి తెర

- ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడి

టెహ్రాన్ : అణుశుద్ధి కార్యాకలాపాలకు తెర వేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇక నుంచి యురేనియంను శుద్ధి చేయబోమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగచి ఆదివారం ప్రకటించారు. 'ప్రస్తుతం ఇరాన్‌లో శుద్ధి చేసిన యురేనియం లేదు. దేశంలో ఉన్న అణుకేంద్రాలు కూడా అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) నియంత్రణ, పర్యవేక్షణలో ఉన్నాయి' అని తెలిపారు. మంత్రి చేసిన వ్యాఖ్యలను ఈ ఏడాది జూన్‌లో తమ అణుకేంద్రాలపై అమెరికా దాడి తరువాత ఇరాన్ ప్రభుత్వం నుంచి వచ్చిన తొలి ప్రకటనగా భావిస్తున్నారు. అలాగే, ఈ కార్యక్రమంలో అబ్బాస్ అరగచి మాట్లాడుతూ అణు సాంతికేక పరిజ్ఞానాన్ని శాంతియుతంగా ఉపయోగించుకోవడానికి తమకు హక్కు ఉందని స్పష్టం చేశారు.

జీవన సౌరభం

మార్చలేని గతాన్ని గురించి ఆలోచించకుండా, చేతిలో ఉన్న భవిష్యత్తుకై శ్రమించు.

మీ కోసం

రెండు స్పూన్ల నిమ్మ ఉప్పు, అదే కొలతతో సాధారణ ఉప్పు, కొంచెం వేడినీళ్లు, కాస్తంత డిటర్జెంట్ వాటర్‌తో ద్రావణం తయారుచేసుకుని ఇత్తడి, రాగి పాత్రలు తోమితే తళతళ మెరిసిపోతాయి.

కిట కిట తలుపులు



ఒకరోజు రాఘవయ్య వరండాలో కూర్చుని ముందు రోజు జరిగిన క్రికెట్ మ్యాచ్ విశ్లేషణని దినపత్రికలో చదువుతున్నారు. కాసేపటికి కళ్ళంట నీరు కారి చూపు మసకబారింది. 'కిట కిట తలుపులు, కిటారు తలుపులు ఎప్పుడు తెరచిన చప్పుడు కావు. అవి అంటుకుంటున్నాయి. ఈ మందు రెండు చుక్కలు నా కంట్లో వెయ్యమ్మా' అని కోడలి చేతికి చుక్కల మందు ఇచ్చారు రాఘవయ్య.

అక్కడే ఉన్న మనవడు, తాత మాట విని, వీధి తలుపును పట్టుకుని అటూ ఇటూ ఊపాడు. తలుపు కి్రు.. క్రమంటూ పెద్ద శబ్దం చేసింది. తాత వైపు చూస్తూ, 'విన్నావా తాతయ్యా' అని అడిగాడు. రాఘవయ్య ప్రేమగా నవ్వి, 'సరే, చప్పుడు చెయ్యని ఆ తలుపులేవో నువ్వు చెప్పు?' అన్నారు. మనవడు కాసేపు ఆలోచించి 'కిట కిట తలుపులు అంటే కిటికీ తలుపులు తాతయ్యా!' అన్నాడు. 'కాద'ని రాఘవయ్య తల అడ్డంగా ఊపడంతో, 'ఏమో తాతయ్యా! నేను చెప్పలేకపోతున్నాను!' అన్నాడు మనవడు ముఖం చిన్నబుచ్చుకుని.

'ఇదిగో చూడు' అని కిటికీ దగ్గర ఉన్న తుప్పు పట్టిన చాకుతో జామకాయ కొయ్యడానికి ప్రయత్నించారు. కానీ సాధ్యం కాలేదు. 'దీన్ని వాడలేదు కాబట్టి, తుప్పు పట్టి మొద్దు బారిపోయింది. ఇప్పుడెందుకూ పనికి రావడం లేదు. అలాగే మనం ఆలోచిస్తేనే మెదడు చురుకుగా పనిచేస్తుంది. లేకపోతే మొద్దుబారిపోతుంది! అందుకే మనం ఎప్పుడూ ఇలాంటి పొడుపు కథలు విప్పాలి. ఇలా నా దగ్గరకు రా! నా కళ్ల వైపు బాగా చూసి, నేను ఏం చేస్తున్నానో చెప్పు' అన్నారు తాతయ్య.

'సరే'నని తాతకు ఎదురుగా నిలబడి కళ్ళల్లోకి చూసాడు మనవడు. 'నువ్వు కళ్ళు మూస్తున్నావు. మళ్లీ తెరుస్తున్నావు తాతయ్య' అన్నాడు మనవడు. 'సరే ఇప్పుడు చెప్పు.. నేను కళ్ళు మూసినా, తెరిచినా... చప్పుడేమైనా అయ్యిందా?' అని అడిగారు.

'లేదు. ఏ శబ్దమూ రాలేదు! ఆ...హా! తెలిసింది! జవాబు దొరికింది! కనురెప్పలు!' అని అరుస్తూ గంతులు వేసుకుంటూ, ఆనందంగా వీధిలోకి పరుగుతీసాడు మనవడు.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445

లెక్క తేల్చండి



పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 78

నేను గీసిన బొమ్మ

కె.మోక్షిత,
5వ తరగతి,
మండల ప్రజా పరిషత్ పాఠశాల,
కానుపోతు గుంట,
ఆచంట మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మందులతో మూర్ఛను తగ్గించొచ్చు

మూర్ఛ రోగం లేదా ఫిట్స్ మెదడు కణాల్లో ఏర్పడే అవరోధం. మెదడు, నరాలు, దీర్ఘకాలిక నాడీ సంబంధిత రుగ్మత. ఈ రోగం ఉన్న వారికి తాత్కాలికంగా జ్ఞానం తగ్గిపోవటం, శరీర నియంత్రణ తప్పటం, వణుకు రావటం, కొంతసేపు స్పృహ కోల్పోవటం వంటి సమస్యలు వస్తాయి. నవంబర్ 17న ఏటేటా జాతీయ మూర్ఛ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

ప్రపంచవ్యాప్తంగా 10 మందిలో ఒకరు మూర్ఛరోగం సమస్యలతో ప్రతి బాధపడుతున్నారు. మెదడు గాయాలు (ప్రమాదాలు, తల దెబ్బలు), మెదడు ఇన్ఫెక్షన్లు (మెనింజిటిస్, ఎన్సెఫలైటిస్), అనారోగ్యం లేదా అధిక జ్వరం, గుండె జబ్బులు (స్ట్రోక్) మెదడుకు ఆక్సిజన్ లేకపోవడం, మెదడులో కణితి, తిత్తి లేదా అల్జీమర్స్, ప్రశూతి, మాదకద్రవ్యాల వాడకం, జనన పూర్వ గాయం, మెదడులో వైకల్యం, లేదా పుట్టినప్పుడు ఆక్సిజన్ లేకపోవడం, ఎయిడ్స్, మెనింజైటిస్ వంటి అంటు వ్యాధులు ఉన్న వారు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. హఠాత్తుగా స్పృహ కోల్పోయే వ్యాధి. మూర్ఛ పోయే ముందు తీవ్రమైన వణుకు, నోటి నుండి చొంగ కారుతుంటుంది. ఒక్కోసారి నాలుక కరుచుకోవటం కూడా చూస్తుంటాం. అన్ని వయస్సుల వారూ దీనికి ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది.

లక్షణాలు ఇవీ...

- తాత్కాలిక గందరగోళం లేదా స్పృహ కోల్పోవడం.
- చేతులు, కాళ్ళ అనియంత్రిత కదలికలు.
- స్పృహ లేదా అవగాహన కోల్పోవడం.
- వ్యక్తి భయం, భయాందోళన, కోపం

పునరావృత మూర్ఛలు

ఒక వ్యక్తి స్వల్ప కాలానికి ఆలోచించే, ప్రతిస్పందించే లేదా కమ్యూనికేట్ చేసే సామర్థ్యాన్ని కోల్పోతాడు.

మూర్ఛలు-రకాలు

మూర్ఛల్లో రెండు రకాలు ఉన్నాయి. సాధారణం, రెండోది నిద్రలో వచ్చేది.



సాధారణ మూర్ఛలు మొత్తం మెదడును ప్రభావితం చేస్తాయి. ఫోకల్ లేదా పాక్షిక మూర్ఛలు మెదడులోని ఒక భాగాన్ని మాత్రమే ప్రభావితం చేస్తాయి. అవగాహన లేని కొన్ని సెకన్ల పాటు ఉంటుంది. బలమైన మూర్ఛలు దుస్సంకోచాలు, అనియంత్రిత కండరాల మెలికలను కలిగిస్తాయి. కొన్ని సెకన్ల నుండి చాలా నిమిషాల వరకు ఉంటాయి. ఈ సమయంలో కొంతమంది గందరగోళం చెందుతారు. స్పృహ కోల్పోతారు. ఆ తర్వాత అది జరుగుతున్నట్లు జ్ఞాపకం ఉండకపోవచ్చు. ఈ సమస్యతో బాధపడుతున్న వారిలో ఎక్కువ మంది రుగ్మత లేని వ్యక్తుల మాదిరిగానే తమ రోజువారీ పనులు చేయగలరు. మరికొందరికి నెలలు లేదా సంవత్సరాలు కూడా మూర్ఛ రాకుండా ఉండొచ్చు. లక్షణాలను బట్టి మూర్ఛలను వివిధ రకాలుగా గుర్తిస్తారు.

టానిక్ : కండరాలు గట్టిపడటం లక్షణం.

అటోనిక్ : ఫలితంగా కండరాల స్థాయి అకస్మాత్తుగా తగ్గుతుంది.

క్లోనిక్ : రిథమిక్ జెర్కింగ్ కదలికలను చేర్చండి.

మయోక్లోనిక్ : క్లుప్తంగా, షాక్ లాంటి కండరాల కుదుపులకు కారణం.

టానిక్-క్లోనిక్ (గ్రాండ్ మాల్ మూర్ఛలు) : స్పృహ కోల్పోవడం ఉంటుంది.

ఇబ్బందులు ఎలాగుంటాయంటే...

అభ్యాస సమస్యలు: కొంతమంది నేర్చుకోవడంలో ఇబ్బంది పడొచ్చు.

శ్వాస సమస్యలు: ఊపిరితిత్తుల్లోకి ఆహారం లేదా లాలాజలం పీల్చుకునే ప్రమాదం ఉంది. ఇది న్యుమోనియాకు కారణమవుతుంది.

గాయాలు: మూర్ఛలు డ్రైవింగ్ లేదా యంత్రాలను ఉపయోగించడం వంటి పనులు చేస్తున్నప్పుడు పడిపోవడం, కాటు లేదా ప్రమాదాలకు కారణమవుతాయి.

మెదడు నష్టం: కొన్ని సందర్భాల్లో, మూర్ఛలు శాశ్వత మెదడు నష్టం లేదా స్ట్రోక్‌కు కారణం కావొచ్చు.

మెడిసిన్ సైడ్ ఎఫెక్ట్స్ : మూర్ఛ మందులు కొన్నిసార్లు అవాంఛిత దుష్ప్రభావాలకు కారణమవుతాయి.

చికిత్సలు

మూర్ఛకు సకాలంలో వైద్య సేవలు అందిస్తే ఆ తర్వాత రోగి సాధారణ, చురుకైన, ఉత్పాదక జీవితాన్ని గడపొచ్చు. చాలా రకాలకు సరైన చికిత్స లేదు. అయినప్పటికీ, శస్త్రచికిత్స కొన్ని రకాల మూర్ఛలు తలెత్తకుండా నిరోధించొచ్చు. చాలా సందర్భాలలో, వ్యాధిని నియంత్రించొచ్చు. కారణానికి చికిత్స చేయడం ద్వారా భవిష్యత్తులో మూర్ఛలు రాకుండా అప్రమత్తంగా ఉండొచ్చు. మెదడులో లోపాలు సరిచేయడానికి శస్త్రచికిత్స, నరాల ప్రేరణ, కీటోజెనిక్ డైట్ అని పిలువబడే ప్రత్యేక ఆహారం కూడా అందుబాటులో ఉంది. వ్యాధి నిర్ధారణ అయితే యాంటీ-ఎపిలెప్టిక్ మందులను డాక్టరు సూచిస్తారు. మందులు పని చేయకపోతే, శస్త్రచికిత్స, ప్రత్యేక ఆహారం లేదా విఎన్ఎస్ (వాగస్ నరాల ప్రేరణ) చికిత్సలను సూచిస్తారు. యాంటీబయోటిక్స్, వ్యాక్సినేషన్, వెంటిలేషన్ వంటి చికిత్సలు అందిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

స్టేటస్ ఎపిలెప్టికస్ : ఇంట్రావీనస్ డయాజెపాం లేదా లోరాజెపం అనేవి స్టేటస్ ఎపిలెప్టికస్‌కి మొదటి-లైన్ చికిత్సలు. అపస్మారక మూర్ఛలు వచ్చినప్పుడు తిరిగి రాకుండా చేసే ప్రక్రియ. ఏడాదిపాటు కోమాలో ఉన్నప్పటికీ ఎపిలెప్టికస్ ద్వారా తిరిగి నయం చేసే పద్ధతి.

ఎలక్ట్రో ఎన్సెఫాలో గ్రఫీ (ఈఈజి) : మెదడులో వుత్పత్తి అయ్యే విద్యుత్తరంగాలని సేకరిస్తారు. నాడీ కణాల మధ్య జరిగే ఆయనిక విద్యుత్ సరఫరాలో వచ్చే వోల్టేజ్ మార్పులను గుర్తిస్తారు. తరంగాలను గుర్తించటం ద్వారా ప్రవర్తనను గుర్తించొచ్చు. రోగి నిద్ర పోయే వేళల్లో తరంగాలని గ్రహించి రోగి మానసిక పరిస్థితిని గమనిస్తారు. కేవలం కొన్ని సంజ్ఞలను ప్రసారం చేసి ఈ తరంగాలను గ్రహిస్తారు.

ఫైబ్రల్ సెజర్స్ : పిల్లల్లో అధిక జ్వరంతో కలిగే మూర్ఛలు. సాధారణంగా ఆరు నెలల నుంచి ఐదేళ్ల వయస్సు ఉన్న పిల్లలు దీనికి ప్రభావితం అవుతారు. 12 నుంచి 18 నెలల పసిపిల్లలకు కూడా కనిపిస్తాయి.

పిల్లలకు జ్వరం వచ్చినా తగ్గిపోయేలా చూసుకోవాలి. శరీర ఉష్ణోగ్రత తగ్గకపోయినా ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంది. ఎగువ శ్వాసకోశంలో సమస్యలున్నా, చెవి బాధలున్నా, నిమోనియా, రక్తంలో ఇన్ఫెక్షన్, బ్యాక్టీరియల్ డయేరియా, మెదడు, వెన్నుపూసతో కలిసి ఉన్న మెదడును కప్పి ఉంచే పొరల సమస్యలు ఉన్నా ఫిట్స్ సమస్యలు వస్తాయి. అవసరమైన మందుల వాడకం, వ్యాధి నిరోధక స్థితి, లక్షణాలు తెలుసుకుని చికిత్సలు అందిస్తే తగ్గిపోతుంది.

డాక్టర్ గుండాబత్తుల అంజలి
ఎంబిబిఎస్, ఎండి జనరల్ మెడిసిన్, (యుసిఎన్), డయాబెటాలజిస్ట్,
ఎఎస్ఎ హాస్పిటల్స్, అమలాపురం,
అంబేద్కర్ కోనసీమ జిల్లా.

సినీ తారల సామాజిక గళం

పీరియడ్ సమస్యలు, మానసిక ఒత్తిడి, శరీర బరువు, పని గంటలు, సమాన పనికి సమాన వేతనం.. వంటి విషయాలపై ఇటీవల ప్రముఖ నటీమణులు మాట్లాడారు. అవి ఇప్పుడు సమాజంలో ఎప్పటినుండో చర్చల్లోకి వస్తున్న విషయాలని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కారణమయ్యాయి. ఎందుకంటే అవి కేవలం వాళ్లకి మాత్రమే సంబంధించినట్లు వాళ్లు మాట్లాడలేదు. అవి సమాజంలో తమలాంటి ఎందరో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలుగా వారు మాట్లాడారు.

ఆ బాధ అనుభవిస్తేనే తెలుస్తుంది..

'పీరియడ్ సమయంలో మహిళలు పడే ఇబ్బందులు తెలియాలంటే పురుషులు ఒక్కసారైనా ఆ బాధని అనుభవించాలి' అని ఇటీవల రష్మిక మందాన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. ఆ సమయంలో నెలసరిలో స్త్రీలు పడే వేదనని ఆమె చాలా ఎమోషనల్‌గా చెప్పింది. అధిక రక్తస్రావంతో స్పృహ కోల్పోయే పరిస్థితి వచ్చినా డాక్టర్లు కూడా ఇది సాధారణమని కొట్టిపారేయడం తనని ఎంతో బాధించిందని చెప్పింది. రష్మిక చెప్పిన ఈ మాటలు ఎంతోమందిని ప్రభావితం చేశాయి. సోషల్ మీడియాలో దీనిపై పెద్ద ఎత్తున చర్చ జరిగింది.

నిర్ణీత సమయమే పనిచేయాలి

పనిగంటల పెంపు విషయంపై రాజకీయ నాయకులకి తోడు పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు సైతం ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న ఈ రోజుల్లో తన కెరియర్‌ని పణంగా పెట్టి మరీ దీపిక పడుకొణె దీనిపై చాలా ఘాటుగా స్పందించారు. ఒక్కసారే కాదు.. పదే పదే ఈ విషయాన్ని ఆమె లేవనెత్తారు. సాధారణ పని గంటల(8 గంటలు) విధానం ఎంత ముఖ్యమో ఇలా చెబుతున్నారు. '8 గంటల పని విధానంపై నా నిర్ణయం ఎప్పటికీ మారదు. ఎందుకంటే మహిళల విషయంలో ఇది చాలా కీలకంగా ఉంటుంది. ఒక బిడ్డకి జన్మ ఇచ్చిన నేను మాట్లాడేది అందరి తల్లుల గురించి కూడా! రోజుకు 8 గంటల పని మనసుకు, శరీరానికి సరిపోతుంది. అంతకుమించి పనిచేస్తే అనారోగ్యం పాలౌతాం. ఆరోగ్యంగా ఉంటేనే అత్యుత్తమంగా పనిచేయగలం. ఒత్తిడిలో ఉన్నప్పుడు నాణ్యమైన ఉత్పత్తిని అందివ్వలేం. అందుకే ప్రతి ఒక్కరూ 8 గంటల పని విధానానికే మద్దతు పలకాలి' అని చెప్పారు. భారీ బడ్జెట్ సినిమాల్లో కీలక పాత్రలు పోషించిన దీపిక తనపై బలవంతంగా రుద్దుతున్న అదనపు పనిగంటలపై కూడా ఇంతే గట్టిగా తన గళం వినిపించారు.

'వృత్తిపరంగా, వ్యక్తిగతంగా తీరిక లేకుండా గడుపుతున్నా. ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించాలని అర్థం చేసుకున్నా. నిద్ర చాలా ముఖ్యం. నేను ప్రతి ఇంటర్వ్యూలో ఇదే చెబుతుంటా. ఇదే నిజం. నిద్ర, పోషకాహారం, వ్యాయామం.. వీటికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. నా ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే నాకు అన్నింటికంటే ముఖ్యం' అని చెప్పారు.

బరువు పెరగడం సహజం

వయసు పెరిగే కొద్దీ మహిళల శరీరంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయి. బరువు పెరగడం సాధారణ విషయం. దీనిపైనే తమన్నా భాటియా ఈమధ్య మాట్లాడారు. ఆమె మాట్లాడింది తన శరీర బరువుపై వచ్చిన కామెంట్లపైనే అయినా అవి తనలాంటి ఎంతోమంది ఆడవాళ్లకి సంబంధించినవి. 'ప్రతి స్త్రీ శరీరం ఎల్లప్పుడూ మారుతూనే ఉంటుంది. ఐదేళ్లకోసారి ఆమె శరీరంలో కొన్ని మార్పులు వస్తాయి. దానికి నేను మినహాయింపు కాదు' అని తమన్నా చెప్పింది. ఆమె బరువుపై ఇటీవల చాలా వార్తలు వచ్చాయి. 'ఆమె నాజుకుగా ఉండేందుకు ఇంజక్షన్లు వాడుతోందని, ఈమధ్య కాస్త లావైందని, పొట్ట పైకి కనిపిస్తోందని..' ఇలా నానా రకాలుగా మాట్లాడారు. దీనిపైనే ఆమె పైవిధంగా స్పందించారు.

నా బరువు మీకెందుకు?

ప్రెస్‌మీట్లల్లో పాల్గొనే నటీమణులకు ఒక్కోసారి చేదు అనుభవాలు ఎదురవుతుంటాయి. సినిమాల్లో చేసే పాత్రలని వాళ్లకి ఆపాదించేసి మరీ ప్రశ్నలు అడుగుతారు. అలాంటి ఘటనే ఈమధ్య తమిళ నటి గౌరీ కిషన్‌కి ఎదురైంది. తన బరువు గురించి అడిగిన ఓ ప్రశ్నకి ఆమె అక్కడే చాలా గట్టిగా సమాధానం చెప్పింది. 'నా బరువుతో ఏం చేస్తావు? సినిమాలో నా పాత్ర గురించి అడగడం కంటే నా బరువు తెలుసుకోవడం ముఖ్యమా? నువ్వు నన్ను బాడీ షేమింగ్ చేస్తున్నావు. ఒక స్త్రీ బరువు ఎంత అని అడగడం అగౌరవంగా ఉంది. ఈ ప్రశ్న ఒక మగ నటుడ్ని అడగగలవా?' అని చాలా కోపంగా మాట్లాడింది. ఆ సమయంలో తనని మాట్లాడనివ్వకుండా 'సీనియర్ హీరోయిన్లని ఇదే ప్రశ్న చాలాసార్లు అడిగామ'ని వాళ్లు సమర్ధించుకోవడం, దానిపై గౌరీ ఎంతో బలంగా తన నిర్ణయాన్ని ప్రకటించడం సోషల్ మీడియాలో చర్చకి లేవదీసింది. దీనిపై ఆమెకి మద్దతుగా ఎంతోమంది నటులు నిలబడ్డారు. తన ధైర్యాన్ని మెచ్చుకున్నారు. ఒక మహిళ తనకెదురైన చేదు అనుభవానికి గట్టిగా ఎలా బుద్ధిచెప్పాలో గౌరీ బహిరంగ వేదికపై నిరూపించింది.

మానసిక ఆరోగ్యం ముఖ్యం

బాలీవుడ్ నటి సారా అలీఖాన్ మానసిక ఆరోగ్యంపై ఈవిధంగా మాట్లాడారు. 'నేటి యువత మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం సంతోషంగా ఉంది. కానీ వాళ్ల చికిత్స తీసుకోవడానికి ఆలోచిస్తున్నారు. ఈ అంతరాన్ని తగ్గించాలి. మనం శారీరక ఆరోగ్యం గురించి మాట్లాడినట్లే మానసిక ఆరోగ్యం గురించి కూడా చర్చించాలి. చికిత్స గురించి అవగాహన కల్పించాలి. ఈవిధంగా జరిగినప్పుడే మానసిక సమస్య సాధారణ సమస్యలాగా భావిస్తారు. దానిపై ఉన్న భయం పోతుంది. అలాగే ఆ సమయంలో సహాయం కోరడం అంటే బలానికి సంకేతం. అది బలహీనత కాదు. శరీరానికి ఇచ్చే శ్రద్ధ మనసుకు కూడా ఇవ్వాలని భావించినప్పుడే మిమ్మల్ని మీరు జాగ్రత్తగా చూసుకోవడంతో సమానం' అని ఆమె మాట్లాడారు.

ప్రభావవంతమైన వ్యక్తులు లేవనెత్తే ఈ రకమైన చర్చలు సమాజంలో మరిన్ని చర్చలకి దారితీస్తాయి. తద్వారా ప్రగతికాముకులు ఆకాంక్షించే మార్పునకు అడుగులు ముందుకు పడతాయి.

స్పిన్‌కు టపటపా..

స్వల్పలక్ష్య ఛేదనలో టీమిండియా ఘోరవైఫల్యం

లక్ష్యం 124, భారత్ 93 ఆలౌట్

సఫారీ స్పిన్నర్ సైమన్ హార్మర్ మాయ

తొలి టెస్టులో దక్షిణాఫ్రికా ఘన విజయం

గత ఏడు టెస్టుల్లో ఆరు పరాజయాలు. గత 15 ఏండ్లలో భారత గడ్డపై ఒక్క టెస్టు విజయం సాధించలేదు. తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల వెనుకంజ. అయినా, ఈడెన్‌గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా అద్భుతం చేసింది. 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని విజయవంతంగా కాపాడుకుంది. ఆతిథ్య భారత్‌కు స్పిన్ స్ట్రోక్ ఇచ్చి.. 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఛేదనలో భారత్ 93 పరుగులకే కుప్పకూలింది. రెండు టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0తో ముందంజ వేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల ఆధిక్యం సాధించిన భారత్.. 30 పరుగుల తేడాతో మ్యాచ్‌లో ఓటమి చవిచూసింది.

కోల్‌కతా : ఈడెన్‌గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికా అద్భుతం చేసింది. ఆఫ్ స్పిన్నర్ సైమన్ హార్మర్ (4/21), లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (2/37), పేసర్ మార్కో యాన్సెన్ (2/15) మ్యాజిక్‌తో భారత్‌తో తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 30 పరుగుల తేడాతో మెరుపు విజయం సాధించింది. 124 పరుగుల ఛేదనలో భారత్ 35 ఓవర్లలో 93 పరుగులకు కుప్పకూలింది. వాషింగ్టన్ సుందర్ (31, 92 బంతుల్లో 2 ఫోర్లు), అక్షర్ పటేల్ (26, 17 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (18, 26 బంతుల్లో 2 ఫోర్లు) మెరిసినా.. భారత్‌ను ఓటమి నుంచి తప్పించలేదు. అంతకుముందు తెంబ బవుమా (55 నాటౌట్, 136 బంతుల్లో 4 ఫోర్లు) వీరోచిత అర్ధ సెంచరీతో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 153 పరుగులు చేసింది. టెయిలెండర్ కార్బిన్ బాచ్ (25, 37 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మ్యాచ్‌ను మలుపు తిప్పే ఇన్నింగ్స్ నమోదు చేశాడు. ఎనిమిది వికెట్లతో మాయ చేసిన సైమన్ హార్మర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

స్పిన్ స్ట్రోక్ : భారత్ లక్ష్యం 124 పరుగులు. సఫారీ శిబిరంలో ఇద్దరే స్పిన్నర్లు. తొలి ఇన్నింగ్స్‌లో కేశవ్ మహరాజ్ పెద్దగా ప్రభావం చూపించలేదు. పిచ్ బ్యాటింగ్‌కు కఠినంగా మారినా.. మనోళ్లు కొట్టేస్తారనే దీమా. కానీ పేసర్ యాన్సెన్ కొత్త బంతితో ఓపెనర్లు ఇద్దరినీ సాగనంపి భారత ఆత్మవిశ్వాసం దెబ్బతీశాడు. జైస్వాల్ (0), రాహుల్ (1) వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించారు. ధ్రువ్ జురెల్ (13), రిషబ్ పంత్ (2)లను సైమన్ హార్మర్ వెనక్కి పంపాడు. 38/4తో పీకల్లోతు కష్టాల్లో కూరుకున్న భారత్‌ను వాషింగ్టన్ సుందర్ (31), రవీంద్ర జడేజా (18) ఆదుకునే ప్రయత్నం చేశారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు 26 పరుగులు జోడించి ఆశలు రేకెత్తించింది. సుందర్ క్రీజులో పాతుకుపోగా.. జడేజా స్కోరు బోర్డుకు ముందుకు నడిపించాడు. కానీ జడేజాను హార్మర్.. మార్క్రామ్ మాయకు సుందర్ పడిపోయారు. 72/6తో భారత్ ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఈ సమయంలో అక్షర్ పటేల్ (26)పైనే ఆశలు నెలకొన్నాయి. కేశవ్ మహరాజ్‌పై ఎదురుదాడి చేసిన అక్షర్ పటేల్.. ఓ ఫోర్, రెండు సిక్సర్లు బాదాడు. అదే ఓవర్లో మరో సిక్సర్‌కు ప్రయత్నించి బవుమాకు క్యాచ్ ఇచ్చాడు. సిరాజ్ తొలి బంతికే నిష్క్రమించగా 35 ఓవర్లలో భారత్ 93 పరుగులకు కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో స్వీప్ షాట్ ఆడుతూ మెడ గాయానికి గురైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఛేదనలో బ్యాటింగ్‌కు రాలేదు. గాయం తీవ్రత దృష్ట్యా గిల్‌ను ఆసుపత్రికి తరలించారు.

బవుమా అజేయ అర్ధ సెంచరీ : ఓవర్‌నైట్ స్కోరు 93/7తో మూడో రోజు ఉదయం బ్యాటింగ్‌కు వచ్చిన దక్షిణాఫ్రికా.. అప్పటికి 63 పరుగుల ముందంజలోనే నిలిచింది. చివరి మూడు వికెట్లను త్వరగా పడగొడితే.. భారత్ రెండెంకల లక్ష్యాన్ని ఛేదించే అవకాశం ఉండేది. కానీ ఉదయం సెషన్‌ను అక్షర్ పటేల్ బౌలింగ్‌తో మొదలెట్టిన బారత్.. రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్‌లను ప్రయోగించింది. తొలి రెండు రోజులు గొప్పగా మాయ చేసిన స్పిన్నర్లు.. మూడో రోజు తేలిపోయారు. జడేజా 7 ఓవర్లలో 21 పరుగులు సమర్పించుకున్నాడు. కుల్‌దీప్ యాదవ్‌ను టెయిలెండర్ కార్బన్ బాచ్ లక్ష్యంగా చేసుకుని బౌండరీలు బాదాడు. అక్షర్ పటేల్ ఒత్తిడి పెంచలేకపోయాడు.

ఫలితంగా స్ట్రయిక్ రొటేషన్‌తో బవుమా, బాచ్‌లు పరుగులు పిండుకున్నారు. ఈ జోడీ ఎనిమిదో వికెట్‌కు 44 పరుగులు జోడించింది. ప్రతికూల పరిస్థితుల్లో గొప్పగా రాణించిన బవుమా.. 4 ఫోర్లతో 122 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. సైమన్ హార్మర్ (7)తో కలిసి మరో 18 పరుగులు జోడించిన బవుమా.. అర్ధ సెంచరీతో అజేయంగా నిలిచాడు. మూడో రోజు ఉదయం సెషన్లో దక్షిణాఫ్రికా మరో 60 పరుగులు చేసింది. దీంతో భారత్‌కు సవాల్‌తో కూడిన 124 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ముగ్గురు స్పిన్నర్లు వికెట్ల వేటలో నిరాశపరచగా.. పేసర్లు బుమ్రా, సిరాజ్‌కు బంతిని అందించిన రిషబ్ పంత్ ఎట్టకేలకు లాంఛనం ముగించాడు. 54 ఓవర్లలో దక్షిణాఫ్రికా 153 పరుగులకు ఆలౌటైంది.

స్కోరు వివరాలు :

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ : 159/10
భారత్ తొలి ఇన్నింగ్స్ : 189/10
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ : 153/10
భారత్ రెండో ఇన్నింగ్స్ : 93/10

న్యూఢిల్లీ : దక్షిణాఫ్రికాతో రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ క్రికెట్ జట్టు ఓటమితో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) పాయింట్ల పట్టికలో మార్పులు సంభవించాయి. తొలి టెస్టులో గెలిచిన సౌతాఫ్రికా లో ఐదో స్థానం నుంచి రెండో ప్లేస్‌కు ఎగబాకింది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడిన సఫారీలు రెండింట గెలిచి ఒక దాంట్లో ఓడిపోయారు.

దిగజారిన టీమిండియా ర్యాంక్

ప్రస్తుతం ఆ జట్టు విజయాల శాతం (66.67)గా ఉంది. ఇక, తొలి టెస్టులో ఓటమి చవిచూసిన టీమ్‌ఇండియా మూడో స్థానం నుంచి నాలుగో ప్లేస్ (విజయాల శాతం 54.17)కు పడిపోయింది. ఈ డబ్ల్యూటిసిలో ఇప్పటి వరకూ భారత్ ఎనిమిది మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 3 ఓటములు, ఒక మ్యాచ్ డ్రాగా ముగించింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో గెలిచిన ఆస్ట్రేలియా (100.00 శాతం) అగ్రస్థానంలో కొనసాగుతోంది. రెండు మ్యాచ్‌ల్లో ఒక విజయం, ఒక డ్రాతో ఉన్న శ్రీలంక (66.67) మూడో స్థానంలో ఉంది. పాకిస్థాన్ (50.00), ఇంగ్లాండ్ (43.33), బంగ్లాదేశ్ (16.67) వరుసగా ఐదు, ఆరు, ఏడు స్థానాల్లో ఉన్నాయి. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన వెస్టిండీస్ ఎనిమిదో ప్లేస్‌లో ఉంది. న్యూజిలాండ్ ప్రస్తుత డబ్ల్యూటిసిలో ఇంకా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68